www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 10-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 355

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం; తిథి: త్రయోదశి రా.1.01 తదుపరి చతుర్దశి; నక్షత్రం: పుబ్బ మ.12.24 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా.8.25-10.12; దుర్ముహూర్తం: ఉ.10.13-11.02, మ.3.09-3.58; అమృతఘడియలు: శేషం ఉ.7.06 వరకు; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.26

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రుణగ్రహీతలకు ఊరట

తగ్గనున్న గృహ, వాహన, వ్యక్తిగత రుణ రేట్లు.. ఈఎంఐ భారం కూడా

రిజర్వు బ్యాంకు రెపో రేటు 6.25% నుంచి 6 శాతానికి

పరపతి సమీక్ష నిర్ణయాలు ప్రకటించిన ఆర్‌బీఐ

మున్ముందు మరింత తగ్గిస్తామని సంకేతాలు

నేను సంజయ్.. భారతంలో సంజయుడిని కాను

నాకు దివ్య దృష్టి లేదు.. వడ్డీరేట్లు ఇంకెంత తగ్గుతాయో ఇప్పుడే చెప్పలేను: ఆర్‌బీఐ గవర్నర్

11



సంజయ్ మల్హోత్రా

హెచ్‌సీయూకే అత్యధిక భూములు

మిగిలింది 1630 ఎకరాలు.. అయినా సెంట్రల్ వర్సిటీల్లో టాప్

- పాత తరం వర్సిటీలకు భారీగా భూ కేటాయింపులు.. కొత్త తరం వర్సిటీలకు 150-500 ఎకరాలే
- భారీగా భూములున్న సెంట్రల్ వర్సిటీల్లో వినియోగం తక్కువే!.. 25 శాతానికి మించి వాడుకోని వైనం
- విద్యార్థుల సంఖ్యకు, విస్తీర్ణానికి పొంతనే లేదు.. సెంట్రల్ వర్సిటీ ఏర్పాటుకు 500 ఎకరాలు చాలన్న యూజీసీ
- రాష్ట్రంలో జేఎన్‌టీయూహెచ్, ముఖ్యమంత్రి రేవంత్ చదివిన జేఎన్‌ఏఎఫ్‌ఏయూలకు సొంత భూమే లేదు!
- లీజు భూమిలోనే కొనసాగుతున్న ఆ రెండు విశ్వవిద్యాలయాలు



హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విశ్వవిద్యాలయ ఏర్పాటుకు ఎంత భూమి కావాలి? పరిపాలనా భవనాలు, డిగ్రీ, పీజీ, డాక్టరేట్ కోర్సులకు అవసరమైన తరగతి గదులు, హాస్టళ్లు, మెస్‌లు, పరిశోధన విభాగాలు.. ఇలా అన్నింటినీ ఏర్పాటు చేసేందుకు ఎంత భూమి అవసరమవుతుంది?.. అంటే గతంలో నిర్దిష్టమైన ప్రమాణాలేమీ లేవు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం(హెచ్‌సీయూ) భూములు, వాటిని ఆనుకుని ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఆందోళనలు నడుస్తున్న నేపథ్యంలో అసలు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు (సెంట్రల్ వర్సిటీలు) దేశంలో ఎన్ని ఉన్నాయి? అవి ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి? అన్న విషయాలు ఆసక్తికరంగా మారాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 57 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. అయితే, ఒక సెంట్రల్ వర్సిటీకి ఎంత స్థలం ఉండాలన్న చర్చ హెచ్‌సీయూ విషయంలో జరిగినంతగా ఎప్పుడూ, ఎక్కడా జరగలేదేమో! దేశంలో గతంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ యూనివర్సిటీలు 1000, 1500 ఎకరాలకు పైబడి కూడా ఉన్నాయి. బనారస్ హిందూ యూనివర్సిటీ ప్రధాన క్యాంపస్ 1300 ఎకరాల్లో ఉంది. 1974లో ఏర్పాటు చేసిన

మిగతా 14వ పేజీలో...

ప్రతీకార సుంకాల అమలు 90 రోజులు

నిలుపుదల

చైనా మినహా 75కు పైగా దేశాలకు ఊరటనిస్తూ ట్రంప్ ప్రకటన

- అప్పటిదాకా 10 శాతమే వసూలు చేస్తామని వెల్లడి
- తమపై చైనా విధించిన 84% సుంకానికి ప్రతీగా..
- ఆ దేశంపై టారిఫ్ 125 శాతానికి పెంచేస్తూ నిర్ణయం
- ట్రంప్ ప్రకటనతో దూసుకుపోయిన అమెరికా మార్కెట్లు
- సుంకాలపై తమతో ఒప్పందాలు కుదుర్చుకునేందుకు
- పలుదేశాల నేతలు తహతహలాడుతున్నారని వ్యాఖ్య
- ప్లీజ్ సర్ ప్లీజ్ అంటూ ప్రాధేయపడుతున్నారని వెల్లడి
- ఆ నేతలపై అసభ్యకరమైన భాషలో నీచమైన వ్యాఖ్య
- మా కార్లపై దిగుమతి సుంకాన్ని సున్నాకు తగ్గించండి
- భారతదేశానికి యూరోపియన్ యూనియన్ విజ్ఞప్తి
- కనీసం 30 శాతం ఉంచాలంటున్న పరిశ్రమ వర్గాలు
- అమెరికాపై 25% సుంకాల విధింపునకు ఈయూ సై

కలిసి పనిచేద్దాం.. భారత్‌కు చైనా ప్రతిపాదన!



ఫార్మా ఉత్పత్తులపైనా భారీగా సుంకాలు విధించబోతున్నాం. ఆ ప్రకటన చేయగానే ఫార్మా కంపెనీలన్నీ చైనాను, ఇతరదేశాలను వదిలి అమెరికాకు బారులు తీరుతాయి. ఎందుకంటే.. వారి ఉత్పత్తుల్లో అధిక భాగాన్ని ఇక్కడే అమ్ముకోవాలి.

- డొనాల్డ్ ట్రంప్

బీజింగ్, వాషింగ్టన్, ఏప్రిల్ 9: అమెరికా ప్రతీకార సుంకాల బాదుడు నేపథ్యంలో ఆ దేశంతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ప్రయత్నిస్తున్న దేశాలకు ఉపశమనం కలిగించే నిర్ణయాన్ని ట్రంప్ తీసుకున్నారు. తన సూచన మేరకు అమెరికాపై ఎలాంటి ప్రతీకార సుంకాలూ విధించని 75కుపైగా దేశాలకు.. సుంకాల అమలును 90 రోజులపాటు నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. ఈ 90 రోజులూ ఆయా దేశాల ఉత్పత్తులపై నామమాత్రంగా 10 శాతం దిగుమతి సుంకాలను వసూలు చేస్తామని వెల్లడించారు. వాస్తవానికి ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాలు బుధవారం ఉదయం నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. ట్రంప్ నిర్ణయంతో అది వాయిదా పడినట్టయింది. అదే సమయంలో.. ఢీ అంటే ఢీ అంటూ తమకు పోటీగా సుంకాలను విధిస్తున్న చైనాపై ట్రంప్ మరింత భారం మోపారు! అమెరికా తమపై సుంకాల భారాన్ని 104 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో.. చైనా కూడా అమెరికాపై సుంకాలను 84 శాతానికి పెంచుతున్నట్టు బుధవారం ప్రకటించింది. దీంతో అంకుల్‌శామ్ (అమెరికా అధ్యక్షుడు) మరింత

మిగతా 2వ పేజీలో...



హైదరాబాద్-అమరావతి.. గ్రీన్‌ఫీల్డ్ హైవే

- తెలంగాణ ఆర్ఆర్ఆర్ నిర్మాణం వేగవంతం
- శ్రీశైలం కారిడార్‌కు త్వరలో ఆమోదం
- హైదరాబాద్-కల్వకుర్తి విస్తరణ ప్రారంభం
- ఈ ఏడాదే కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ
- ఆంధ్రప్రదేశ్‌లోనూ పలు ప్రాజెక్టులకు ఓకే
- విభజన అంశాల పరిష్కారానికి ఇరు రాష్ట్రాల అధికారుల భేటీలో కేంద్రం నిర్ణయం
- తదుపరి భేటీలో పోలవరం, విద్యాసంస్థలు, ఏపీలో గ్రేహౌండ్స్ ఏర్పాటుపై చర్చ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను వేగంగా పూర్తిచేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ హైవే నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు రూపకల్పన చేసి.. సత్వర చర్యలు చేపట్టాలని కేంద్ర రహదారులు-ఉపరితల రవాణా శాఖకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని అంశాలను వేగంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో గత నెల కేంద్ర హోంశాఖ నిర్వహించిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ మేరకు పనులను వేగవంతం చేయాలని వివిధ మంత్రిత్వ శాఖలకు ఆదేశాలు జారీ అయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అధికారులు

మిగతా 12వ పేజీలో...

బ్రిటిష్ వారి కంటే బీజేపీ నేతలు

ప్రమాదకారులు

- వారిని తరిమికొట్టినట్లుగా దేశంలో బీజేపీని ఓడిద్దాం
- తెలంగాణలో ఆ పార్టీని అడుగు పెట్టనివ్వం
- గాడ్సే ఆలోచనల వ్యాప్తికి ప్రయత్నిస్తున్న మోదీ
- ఆయనపై వ్యతిరేకంగా రాహుల్ ఆధ్వర్యంలో పోరాడదాం
- పటేల్‌తో తెలంగాణకు స్వాతంత్య్రం.. సోనియాతో రాష్ట్రం
- తెలంగాణలో కులగణన చేసి చూపించాం
- 25 లక్షల మందికి 21 వేల కోట్ల రుణమాఫీ చేశాం
- ఏఐసీసీ విస్తృత సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్

14న 423 మందికి నియామక పత్రాలు

అందించనున్న సీఎం.. నీటిపారుదల శాఖలో భర్తీ

13



అహ్మదాబాద్‌లో ఏఐసీసీ సదస్సులో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతలు.. బ్రిటిష్ వారికంటే ప్రమాదకారులని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆనాడు అందరూ ఒక్కటై బ్రిటిష్ వారిని దేశం నుంచి తరిమికొట్టినట్లుగానే.. ఇప్పుడు రాహుల్‌గాంధీ నాయకత్వంలో అందరం ఒక్కటై దేశవ్యాప్తంగా బీజేపీని ఓడగొడదామని పిలుపునిచ్చారు. మోదీ పరివారంపై పోరాటానికి అందరమూ సిద్ధంగా ఉందామన్నారు. బీజేపీని ఓడించే బాధ్యతను దేశ వ్యాప్తంగా ఉన్న గాంధేయవాదులు, కాంగ్రెస్ కార్యకర్తలు తీసుకోవాలని కోరారు. తాము తెలంగాణ రాష్ట్రంలో బీజేపీని అడుగు పెట్టనివ్వబోమని ప్రకటించారు. బుధవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ విస్తృత సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జన్మించిన ఈ గుజరాత్ గడ్డపై నుంచి చెబుతున్నా. తెలంగాణ గడ్డపై బీజేపీని అడుగు పెట్టనివ్వం. వారిని అడ్డుకుంటాం. అందుకు మేం ఇక్కడి నుంచి ఆశను, ఆదేశాన్ని తీసుకొని

మిగతా 13వ పేజీలో...

దేశమంతా తెలంగాణ ఫార్ములా

- 50% రిజర్వేషన్ల పరిమితిని బద్దలు కొడతాం
- సమాజంలో 90 శాతం బలహీనవర్గాలు, పేదలేనని తెలంగాణ సర్వేలో తేలింది
- వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం
- బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఇకపై క్రిస్టియన్లు, సిక్కులు, ఇతర మైనార్టీల హక్కులపై పడతాయి
- ట్రంప్ టారిఫ్ ఒత్తిళ్లకు మోదీ లొంగిపోయారు
- 56 అంగుళాల ఛాతీ ఎక్కడ?: రాహుల్‌గాంధీ
- దేశంలో పది శాతం కార్పొరేట్ శక్తుల చేతుల్లో 90 శాతం సంపద పోగుపడిందని వ్యాఖ్య

2



హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లకు సెప్టెంబరు 30 గడువు

- ఇకపై అన్ని వాహనాలకూ తప్పనిసరి
- లేదంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవు
- బీమా, కాలుష్య సర్టిఫికెట్ సైతం బందే
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా అన్ని వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్‌ఎస్‌ఆర్‌పీ)ను తప్పనిసరి చేస్తూ రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2019 ఏప్రిల్ 1కి ముందు రిజిస్టర్ అయిన అన్ని వాహనాలు కూడా ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీలోగా

మిగతా 13వ పేజీలో...

₹4,150 కోట్లు

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య రంగం బలోపేతానికి ప్రపంచ బ్యాంకు రుణం

- ఫలించిన సర్కారు ప్రయత్నం.. సీఎస్‌కు వరల్డ్ బ్యాంకు లేఖ
- రుణంతో ట్రామాకేర్, డయాలసిస్, 4 ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రాలు
- ఫలితాల ఆధారంగా ఆరేళ్లలో దశలవారీగా నిధుల అందజేత
- రాష్ట్రంలో 4 రోజుల పాటు ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన
- క్షేత్రస్థాయిలో ఆస్పత్రుల్లో వైద్యసేవల పరిశీలన



హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నం ఫలించింది. రాష్ట్రంలో సర్కారీ వైద్యసేవలను మరింత విస్తరించి ప్రజారోగ్యాన్ని బలోపేతం చేసేందుకు వీలుగా ప్రపంచబ్యాంకు దన్ను లభించింది. ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు పలు కార్యక్రమాల అమలుకుగాను రుణం ఇచ్చేందుకు వరల్డ్ బ్యాంకు అంగీకరించింది. రూ.4,150 కోట్ల రుణం ఇవ్వనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి లేఖ పంపింది. ఈ రుణాన్ని ఆరేళ్లపాటు దశలవారీగా అందించనున్నట్టు పేర్కొంది. ఆరోగ్యశాఖలో అమలు చేసే కార్యక్రమాలకు ప్రపంచబ్యాంకు నిధులిస్తుంది. కార్యక్రమాల

మిగతా 3వ పేజీలో...



పోస్టల్ ఖాతాలో 2500 పడతాయని!

ఈ మహిళలంతా క్యూ కట్టింది హైదరాబాద్ అబిడ్స్‌లోని జనరల్ పోస్టాఫీస్ (జీపీవో) వద్ద. మహిళా సమృద్ధి యోజన పథకం కింద ఢిల్లీలోని నిరుపేద మహిళలకు ప్రతి నెలా రూ.2,500 చొప్పున పోస్టాఫీసు ఖాతాలో జమ చేస్తామని అక్కడి ప్రభుత్వం ప్రకటించడంతో.. కేంద్ర ప్రభుత్వం దేశమంతా ఈ పథకాన్ని అమలు చేస్తుందనే వదంతులు వ్యాపించాయి. దీంతో పోస్టల్ పేమెంట్స్ బ్యాంకు ఖాతా తెరిచేందుకు బుధవారం అబిడ్స్‌లో మహిళలు ఇలా మండుటెండలో బారులు తీరారు. కొద్దిరోజులుగా మహిళలు పెద్ద ఎత్తున ఈ ఖాతాలు తెరుస్తున్నారు.

నేడు భారత్‌కు రాణా

- ఎట్టకేలకు ముంబై పేలుళ్ల సూత్రధారిని అప్పగించిన అమెరికా
- జైలు నుంచి ఎన్‌ఐఏ కస్టడీలోకి
- ప్రత్యేక విమానంలో బయల్దేరిన బృందం

2

ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు రద్దు!

- అమెరికా నుంచి రప్పించేందుకు దారి సుగమం
- రెడ్ కార్నర్ నోటీసు జారీ ఫలితం
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

14



13

మెట్రోరైల్ ఎండీగా మళ్లీ ఎన్వీఎస్ రెడ్డి

ఏడాది కాలానికి పునర్నియామకం.. ఉత్తర్వులు జారీ

నేవీ అమ్ములపొదిలో రాఫెల్ ఫైటర్లు

- 64 వేల కోట్లతో 26 మెరైన్‌జెట్లు
- ఫ్రాన్స్ నుంచి కొనుగోలు
- ఐఎన్ఎస్ విక్రమాదిత్య, విక్రాంత్‌లపై మిగ్-29కేల స్థానంలో మోహరింపు
- ప్రభుత్వాల స్థాయిలో ఒప్పందం
- ఆమోదం తెలిపిన కేబినెట్ కమిటీ
- 1,600 కోట్లతో 'కృషి సించాయి' కింద ప్రత్యేక ఉప పథకం
- ఎం-సీఏడీడబ్ల్యూఎంతో సూక్ష్మ నీటిపారుదలకు ఊతం
- సీసీఈఏ నిర్ణయాలు



న్యూఢిల్లీ/అమరావతి, ఏప్రిల్ 9: భారత నౌకాదళం అమ్ములపొదిలో భారీ యుద్ధ విమానాలు వచ్చి చేరనున్నాయి. రూ.64 వేల కోట్ల వ్యయంతో ఫ్రాన్స్ నుంచి రాఫెల్ మెరైన్ జెట్ ఫైటర్ల కొనుగోలుకు భద్రతావ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) బుధవారం ఆమోదం తెలిపింది. విమాన వాహక నౌకలు

మిగతా 2వ పేజీలో...

రాణాకు మన్నె క్రిశాంక్

- కంచ గచ్చిబౌలి నకిలీ వీడియోలు.. 9 గంటల పాటు విచారణ
- 14న మళ్లీ విచారణకు రావాలని నోటీసు ఇచ్చిన పోలీసులు

12

కంచ గచ్చిబౌలికి కేంద్ర ప్రభుత్వ కమిటీ

- అక్కడి భూములకు సంబంధించి వాస్తవాలపై అధ్యయనం
- హైదరాబాద్‌లో నేటి నుంచి 2 రోజుల పర్యటన.. పర్యావరణ చట్టాలను ఉల్లంఘిస్తున్నారని ఫిర్యాదు చేసిన వారితో భేటీ

బీవైడీకి తలుపులు తెరవం!

- భారత చట్టాలను పాటిస్తామని నమ్మకం కలిగిస్తే ఆలోచిస్తాం
- దేశ భద్రత దృష్ట్యా నిర్ణయించాల్సిన అంశమిది: పీయూష్ గోయల్
- భారత్‌లో ఈవీల పరిశ్రమ ఏర్పాటు ఆలోచన లేదు: బీవైడీ

2

నేడు భారత్‌కు తహవ్వుర్ రాణా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ముంబై పేలుళ్ల సూత్రధారి తహవ్వుర్ రాణాను అమెరికా జైలు నుంచి భారత్‌కు తీసుకొస్తున్నారు. నేరస్థుల అప్పగింత ఒప్పందం కింద కస్టడీలోకి తీసుకున్న జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) బృందం అమెరికా నుంచి ప్రత్యేక విమానంలో భారత్‌కు బయలుదేరింది. గురువారం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకుంటుంది. పాకిస్థాన్‌కు చెందిన రాణా కెనడా పౌరుడు. పాకిస్థాన్ ఆర్మీలో డాక్టర్‌గా పనిచేసిన అతడు 1997లో కెనడాకు వలస వెళ్లాడు. అనంతరం అమెరికాకు వెళ్లి ఇమ్మిగ్రేషన్ సంస్థను ఏర్పాటు చేశాడు. భారత్‌లోని ఆ సంస్థ కార్యాలయంలోనే లష్కరే తోయిబా ఉగ్రవాది డేవిడ్ హెడ్లీ ఆశ్రయం పొంది ముంబై పేలుళ్లకు కీలక భవనాల వద్ద రెక్కీ నిర్వహించినట్టు భారత దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. 2008 నవంబరు 26న ముంబైపై జరిపిన ఉగ్రదాడిలో 174 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 300 మందికిపైగా గాయాలపాలయ్యారు. రాణాను తమకు అప్పగించాలంటూ భారత్ ఎప్పటి నుంచో అమెరికాను కోరుతోంది. భారత జైళ్లలో తనను చిత్ర హింసలకు గురిచేస్తారని, అది హింసకు వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానానికి విరుద్ధమంటూ రాణా పలు ఫెడరల్ కోర్టుల తోపాటు అమెరికా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా, అన్ని చోట్లా అతడికి చుక్కెదురైంది. అతడికి అన్ని అవకాశాలూ మూసుకుపోవడంతో అమెరికా వెళ్లిన ఎన్ఐఏ బృందం రాణాను తీసుకుని ప్రత్యేక విమానంలో భారత్‌కు బయలుదేరింది. ఎన్ఐఏ, ముంబై పోలీసులు నమోదు చేసిన కేసుల్లో అతడు విచారణను ఎదుర్కోనున్నాడు.

ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరపున చైనీయులు



తమ ఆధీనంలో ఉన్న చైనా సైనికుడు అంటూ జెలెన్‌స్కీ విడుదల చేసిన ఫొటో

మాస్కో, కీవ్, ఏప్రిల్ 9: తమతో జరుగుతున్న యుద్ధంలో రష్యా తరపున చైనీయులు పాల్గొన్నారని ఉక్రెయిన్ ఆరోపించింది. తమ బలగాలు ఇద్దరు చైనీయులను రష్యా ఆక్రమిత డోనెట్స్క్ ప్రాంతంలో బంధించాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. మొత్తం ఆరుగురు చైనీయులతో పోరాడి ఇద్దరిని బందీలుగా పట్టుకున్నారని ఆయన తెలిపారు. తమపై యుద్ధాన్ని రష్యా అధ్యక్షుడు పుతిన్ కొనసాగించాలనుకుంటున్నారనే విషయాన్ని ఇది స్పష్టం చేస్తుందని జెలెన్‌స్కీ చెప్పారు. రష్యా తరపున మరింతమంది చైనీయులు యుద్ధంలో పాల్గొంటున్నారని తాము అనుమానిస్తున్నట్లు వెల్లడించారు. అయితే, ఉక్రెయిన్ ఆరోపణలను చైనా కొట్టిపారేసింది. రాజకీయపరంగా సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తాము చేసిన, చేస్తున్న యత్నాలను ఉక్రెయిన్ పరిశీలించాలని కోరింది.

రష్యా విక్టరీ డే పరేడ్‌కు రావాలని మోదీకి ఆహ్వానం

మాస్కో, ఏప్రిల్ 9: వచ్చే నెల 9న జరగబోయే విక్టరీ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనాలని భారత ప్రధాని మోదీకి రష్యా ఆహ్వానం పంపింది. ఈ విషయాన్ని రష్యా ఉప ప్రధాని ఆండ్రీ రుడెంకో వెల్లడించారు. ఇప్పటికే పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని రష్యన్ వార్తా సంస్థ టాస్ కూడా ధ్రువీకరించింది. ఈ వేడుకల్లో పాల్గొనాలని రష్యా తమ మిత్ర దేశాలకు ఆహ్వానం పంపినట్లు పేర్కొంది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై రష్యా సాధించిన విజయానికి గుర్తుగా ఏటా ఈ విజయ దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. ఈ ఏడాదితో జర్మనీపై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రష్యా ఏర్పాట్లు చేస్తోంది.

వాహన ప్రమాదాల్లో క్షతగాత్రులకు నగదు రహిత వైద్యం ఇంకెప్పుడు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: వాహన ప్రమాదాల్లో క్షతగాత్రులకు నగదు రహిత వైద్యం అందించేలా పథకాన్ని రూపొందించే విషయంలో కేంద్రం జాప్యం చేస్తుండటంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ కార్యదర్శికి బుధవారం నోటీసులు జారీ చేసింది. జనవరి 8న తామిచ్చిన ఆదేశాలు అమలు చేయకపోవడంపై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. "గతంలో ఇచ్చిన గడువు మార్చి 15తో తీరిపోయింది. అయినా స్పందించలేదంటే ఇది కోర్టు ఆదేశాలను ధిక్కరించడమే కాదు. చాలా ఉపయోగకరమైన చట్టాన్ని అమలు చేయకుండా ఉండటమే" అని ధర్మాసనం మండిపడింది. ఈనెల 28న మంత్రిత్వ శాఖ కార్యదర్శి నేరుగా వచ్చి కోర్టులో వివరణ ఇవ్వాలని బెంచ్ ఆదేశించింది.

భారత్‌తో కలిసి పనిచేస్తాం: చైనా

బీజింగ్, ఏప్రిల్ 9: సరిహద్దుల వద్ద శాంతి, సుస్థిరత నెలకొల్పేందుకు భారత్‌తో కలిసి పనిచేసేందుకు తమ సైన్యం సిద్ధమని చైనా ప్రకటించింది. రెండు దేశాల సైనిక భవిష్యత్ సంబంధాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఝూంగ్ జియావోగాంగ్ స్పందిస్తూ ఈ విషయం చెప్పారు. అత్యంత పురాతన నాగరికతలు కలిగి ఉన్న ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన స్థానాలను ఆక్రమించాయన్నారు. ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

తమిళనాట నీట్ రద్దు కోసం న్యాయపోరాటం

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాట నీట్ పరీక్షల రద్దు కోసం న్యాయపోరాటం జరపాలని రాష్ట్ర సీఎం స్టాలిన్ అధ్యక్షతన జరిగిన అఖిల పక్ష సమావేశం తీర్మానించింది. బుధవారం సాయంత్రం జరిగిన ఈ సమావేశంలో స్టాలిన్ ప్రసంగిస్తూ.. తొలిసారిగా 2021 సెప్టెంబర్ 13న నీట్ పరీక్షల రద్దు ముసాయిదా చట్టాన్ని రూపొందించి రాష్ట్రపతి పరిశీలనకు పంపామని, ఆ బిల్లును రాష్ట్ర గవర్నర్ రాష్ట్రపతి ఆమోదం కోసం పంపుతారని ఎదురు చూశామని, అయితే ఆ బిల్లును రాష్ట్రపతికి పంపకుండా పెండింగ్‌లో ఉంచారని వివరించారు. ఆ తర్వాత 2022 ఫిబ్రవరి 5న అఖిలపక్ష సమావేశం జరిపి, ఆ ముసాయిదా చట్టాన్ని అసెంబ్లీలో అదే నెల 8న మళ్లీ ఆమోదింపజేసి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపినా ఫలితం లేకపోయిందన్నారు. కాగా, అఖిలపక్ష సమావేశానికి ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే, బీజేపీ సమావేశాన్ని బహిష్కరించాయి.

నేవీ అమ్ములపొదిలో రాఫెల్ ఫైటర్లు

(మొదటి పేజీ తరువాయి)

ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్‌లపై ప్రస్తుతం ఉన్న మిగ్-29కే ఫైటర్ల స్థానంలో రాఫెల్-ఎం ఫైటర్లు రానున్నాయి. ఇవి నౌకాదళ అవసరాల కోసం రూపొందించిన దసాల్ట్ రాఫెల్ ఫైటర్ జెట్లు. 9.5 టన్నుల ఆయుధాలు, చమురు ట్యాంకులను తీసుకెళ్లడానికి వీటిని ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. భారత్, ఫ్రాన్స్ నడుమ ప్రభుత్వాల స్థాయిలో కొనుగోలు ఒప్పందం చేసుకోనున్నారు. ఇది ఖరారైతే ఫ్రాన్స్ తర్వాత అటు వాయుసేనకు, ఇటు నౌకాదళానికి ఒకేరకమైన యుద్ధవిమానాలు ఉన్న దేశంగా భారత్ మారుతుంది. గగనతలం, సముద్రతలంపై ఆధిపత్యానికి ఇది తోడ్పడుతుంది. కొనబోతున్న 26 మెరైన్ ఫైటర్లలో 22 సింగిల్ సీటర్లు కాగా.. 4డబుల్ సీటర్లు. ఒప్పందం కుదిరిన ఐదేళ్లలో సరఫరా ప్రారంభమవుతుంది. జెట్ల నిర్వహణ, సిబ్బందికి శిక్షణ, అవసరమైన పరికరాలను భారత్‌లోనే ఉత్పత్తిచేయడం దీని ప్రత్యేకతలు. ఇప్పటికే భారత వాయుసేన వద్ద 36 రాఫెల్ ఫైటర్లు ఉన్నాయి. గగనతలంలోనే ఇంధనం నింపుకోవడానికి రాఫెల్-ఎం జెట్లు వీటికి ఉపయోగపడతాయి. ఇదిలా ఉండగా, ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) కింద ప్రత్యేక సబ్ స్కీంగా 2025-26 సంవత్సరానికి రూ.1,600 కోట్ల వ్యయంతో కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్-వాటర్ మేనేజ్‌మెంట్ ఆధునికీకరణ (ఎం-సీఏడీడబ్ల్యూఎం) కార్యక్రమం అమలుకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ(సీసీఈఏ) ఆమోదం తెలిపింది. నిర్దేశిత క్లస్టర్‌లో కెనాల్స్, ఇతర నీటి వనరుల ద్వారా జరిగే సాగునీటి సరఫరా నెట్‌వర్క్‌ను ఆధునికీకరించడం దీని ఉద్దేశం. పంజాబ్-హరియాణాల్లో వాహనాల రద్దీని నియంత్రించేందుకు పంజాబ్‌లోని మొహాలీ జిల్లా జిరాక్‌పూర్ వద్ద బైపాస్ నిర్మాణానికి సీసీఈఏ ఆమోదించింది. దీన్ని రూ.1,878.31 కోట్లతో 19.2 కిలోమీటర్ల మేర నిర్మిస్తారు.

90 రోజులు నిలుపుదల

(మొదటిపేజీ తరువాయి)



రెచ్చిపోయారు. ప్రపంచ మార్కెట్ల పట్ల ఏమాత్రం మర్యాద చూపని డ్రాగన్ దేశంపై.. సుంకాలను 125 శాతానికి పెంచుతున్నట్టు తన సొంత సామాజిక మాధ్యమమైన ట్రూత్ సోషల్ ద్వారా ప్రకటించారు. మిగతా దేశాల్లాగా 90 రోజుల వెసులుబాటు కూడా ఇవ్వకుండా.. ఆ పెంపు తక్షణమే అమల్లోకి వస్తుందని ఆ పోస్టులో ట్రంప్ తేల్చిచెప్పారు. అమెరికాను, ఇతర దేశాలను సుంకాల పేరుతో దోచుకోవడం ఇకపై ఎంతమాత్రం కుదరదనే నిజాన్ని చైనా త్వరలోనే తెలుసుకుంటుందన్న ఆశాభావాన్ని ట్రంప్ వ్యక్తం చేశారు. అంతకుముందు.. అమెరికాపై 84 శాతం సుంకాలను విధిస్తూ తీసుకున్న నిర్ణయం గురువారం నుంచే అమల్లోకి వస్తుందని చైనా ప్రకటించింది. సుంకాల అమలును 90 రోజులపాటు నిలిపివేస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో అమెరికా మార్కెట్లు దూసుకుపోయాయి. ఎస్ అండ్ పీ 500 సూచీ 8.5 శాతం పెరగ్గా.. డౌజోన్స్ సూచీ 7.2%, నాస్‌డాక్ 10.8% మేర పెరిగాయి. 2020 నుంచి మార్కెట్లు ఒక్కరోజే ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటిసారి.

అంతేకాదు.. ప్రపంచ వాణిజ్య సంస్థలో అమెరికాకు వ్యతిరేకంగా మరో దావా వేయబోతున్నట్టు వెల్లడించింది. చైనా కంపెనీలతో వ్యాపారం చేసే అమెరికన్ కంపెనీలపై మరిన్ని ఆంక్షలు విధిస్తున్నట్టు తెలిపింది. ఇప్పటికే ఇలా చాలా కంపెనీలపై ఆంక్షలు విధించిన చైనా.. తాజాగా 11 కంపెనీలను ఆ జాబితాలో చేర్చింది. సుంకాలను పెంచడం అమెరికా సమస్యలను పరిష్కరించదని చరిత్ర, గణాంకాలు చెబుతున్నాయని పేర్కొంది. అమెరికా చర్యలు ఆ దేశానికే ముప్పుగా పరిణమిస్తాయని హెచ్చరించింది. సుంకాల పేరుతో అమెరికా తమపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తోందని.. కానీ, అలాంటి ఆధిపత్య చర్యలను తాము ఎన్నటికీ అంగీకరించబోమని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ స్పష్టం చేశారు. తమ దేశ సార్వభౌమాధికారానికి, భద్రతకు, అభివృద్ధి ఆకాంక్షలకు విఘాతం కలిగించే ఎటువంటి ప్రయత్నాలనూ తాము సహించబోమని.. అమెరికాపై దృఢమైన, శక్తిమంతమైన చర్యలు తీసుకుంటామని ఆయన తేల్చిచెప్పారు. మరోవైపు.. యూరోపియన్ యూనియన్ దేశాలు సైతం అమెరికాపై 25 శాతం సుంకాల విధింపు ప్రతిపాదనకు అనుకూలంగా ఓటువేశాయి. ఈ సుంకాలు ఏప్రిల్ 15, మే 16, డిసెంబరు 1 నుంచి అమల్లోకి రానున్నట్టు వెల్లడించింది.

కలిసి పనిచేద్దాం.. డ్రాగన్ ప్రతిపాదన!

అమెరికాతో వాణిజ్య యుద్ధం ముదిరిన నేపథ్యంలో డ్రాగన్ దేశం భారతదేశ మద్దతును కోరింది. అమెరికా సుంకాల వేధింపులను ఎదుర్కోవడానికి, కష్టాలను అధిగమించడానికి రెండు అతిపెద్ద అభివృద్ధి చెందుతున్న దేశాలు (భారత్, చైనా) కలిసి నిలబడాలని భారత్‌లో చైనా దౌత్యకార్యాలయ అధికార ప్రతినిధి యు జింగ్ 'ఎక్స్‌'లో పెట్టిన ఒక పోస్టులో పేర్కొన్నారు. రెండు దేశాల ఆర్థిక, వాణిజ్య సంబంధాలు పరస్పర సహకారం, ప్రయోజనాలపై ఆధారపడి ఉన్నాయని ఆమె గుర్తుచేశారు. అమెరికా అనుసరిస్తున్న సుంకాల వేధింపుల కారణంగా పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలు నష్టపోతున్నాయని, ఆవేదన వెలిబుచ్చిన యు జింగ్.. వాణిజ్య, సుంకాల యుద్ధాల్లో విజేతలు ఎవరూ ఉండరని హెచ్చరించారు. సంరక్షణ వాదం, ఏకపక్ష వాదం ఏ రూపంలో ఉన్నా వాటిని ప్రపంచదేశాలన్నీ కలిసి వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సాక్షాత్తూ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సైతం.. ఇండియా, చైనా మరింత సన్నిహితంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఏప్రిల్ 1న బీజింగ్‌లో మన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ సందర్భంగా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఇరుదేశాల మధ్య సంబంధాలు 'ఏనుగు-డ్రాగన్ నృత్యం'లా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ట్రంప్ సుంకాల నేపథ్యంలోనే అయినప్పటికీ.. చైనాలో అత్యున్నత స్థాయి నేత నుంచి అలాంటి వ్యాఖ్యలు రావడం చెప్పుకోదగ్గ విషయమే. చైనా విదేశాంగ మంత్రి కూడా.. న్యూఢిల్లీ, బీజింగ్ కలిసి పనిచేయాలని, ఆధిపత్యవాదాన్ని, పవర్ పాలిటిక్స్‌ను వ్యతిరేకించడంలో నాయకత్వ పాత్ర పోషించాలని గత నెలలో వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, కొన్ని దేశాలకు ప్రపంచ ఆహార పథకం(డబ్ల్యూఎఫ్‌పీ)లో భాగంగా యూఎస్ఎయిడ్‌ను పునరుద్ధరించాలని అమెరికా నిర్ణయించింది. అంతర్యుద్ధం జరుగుతున్న దేశాల్లో యూఎస్ఎయిడ్ అందకపోవడంతో లక్షల మంది ఆకలిచావులను ఎదుర్కోవాల్సి వస్తుందని డబ్ల్యూఎఫ్‌పీ ఎక్స్‌లో పోస్టు చేసిన నేపథ్యంలో అమెరికా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 14 దేశాల్లో డబ్ల్యూఎఫ్‌పీకి యూఎస్ఎయిడ్ అందుతుండగా.. ట్రంప్ అధికారంలోకి వచ్చాక దాన్ని నిలిపివేసిన విషయం తెలిసిందే.! ఇప్పుడు లెబనాన్, సిరియా, ఇరాక్, జోర్డాన్, ఈక్వెడార్, సోమాలియాల్లో సహాయాన్ని కొనసాగించాలని అమెరికా నిర్ణయించింది.

తగ్గించండి...

విదేశీ కార్ల దిగుమతులపై భారత్ విధిస్తున్న భారీ సుంకాలకు ప్రతిగా ట్రంప్ ప్రతీకార సుంకాలు విధించిన నేపథ్యంలో.. యూరోపియన్ యూనియన్ కూడా ఆ అంశంపై దృష్టి సారించింది. విదేశీ కార్లపై సుంకాలను సున్నా శాతానికి తగ్గించాలని భారతదేశానికి విజ్ఞప్తి చేసింది. నిజానికి దీనికి సంబంధించిన వాణిజ్య ఒప్పందం చాలాకాలంగా పెండింగ్‌లో ఉంది. భారత్ కూడా.. విదేశీ కార్లపై 100 శాతానికి పైగా ఉన్న సుంకాలను దశలవారీగా 10 శాతానికి తగ్గించేందుకు సిద్ధంగా ఉన్నట్టు పరిశ్రమ వర్గాలను, ప్రభుత్వ అధికారులను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తాసంస్థ ఒక కథనాన్ని వెలువరించింది. కిందటివారం జరిగిన ఒక సమావేశంలో కేంద్ర వాణిజ్య శాఖ అధికారులు ఈయూ అభ్యర్థనను, దానిపై ప్రభుత్వ వైఖరిని.. భారీ పరిశ్రమల శాఖ అధికారులు, ఆటో ఇండస్ట్రీ ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చినట్టు అందులో పేర్కొంది. భారతీయ కార్ల పరిశ్రమ మాత్రం.. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే కార్లపై సుంకాన్ని కనీసం 30 శాతంగా ఉంచాలని, ఈవీలపై విధిస్తున్న దిగుమతి సుంకాలను మరో నాలుగేళ్ల పాటు తగ్గించొద్దని పైరవీ చేస్తున్నట్టు వెల్లడించింది. ఈయూ విజ్ఞప్తి మేరకు భారతదేశం సుంకాలను తగ్గిస్తే.. మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఫోక్స్‌వ్యాగన్ వంటి యూరోపియన్ కార్ల తయారీ దిగ్గజాలకు, అటు అమెరికాకు చెందిన టెస్లా సంస్థకు ప్రయోజనం కలుగుతుంది.

ట్రంప్ దారుణ వ్యాఖ్యలు

అమెరికా విధించిన అడ్డగోలు సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో.. పుండు మీద కారం జల్లినట్టుగా ట్రంప్ ఆ సుంకాలతో ప్రభావితమవుతున్న దేశాలపై అత్యంత నీచమైన వ్యాఖ్యలు చేశారు. ఆయా దేశాల నేతలందరూ అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి తహతహలాడిపోతున్నారని.. సుంకాల బారి నుంచి తప్పించుకోవడానికి ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నారని, "ప్లీజ్ సర్, ప్లీజ్ సర్ మేం ఏమైనా చేస్తాం సర్" అంటూ తమను పదేపదే సంప్రదిస్తున్నారని ఆయన గొప్పలు చెప్పుకొన్నారు. అంతటితో ఆగక.. 'కిస్సింగ్ మై యా....' అంటూ రాయడానికి వీల్లేని అసభ్యకరమైన భాషలో దారుణంగా మాట్లాడారు. అలాగే.. ఫార్మా ఉత్పత్తుల పైనా భారీగా సుంకాలు విధించబోతున్నట్టు మరోసారి వెల్లడించారు. "ఆ ప్రకటన చేయగానే ఫార్మా కంపెనీలన్నీ చైనాను, ఇతరదేశాలను వదిలి బారులు తీరుతాయి. ఎందుకంటే.. వారి ఉత్పత్తుల్లో అధిక భాగాన్ని ఇక్కడే అమ్ముకోవాలి" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

లోకం తీరు



అమెరికాలో 'ఓపీటీ' రద్దుకు చట్టసభలో బిల్లు

వాషింగ్టన్, ఏప్రిల్ 9: అమెరికాలో పని అనుభవాన్ని పొందడానికి విదేశీ విద్యార్థులను అనుమతించే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగ్రాంను తొలగించే బిల్లును అక్కడి చట్ట సభలో ప్రవేశపెట్టారు. దీంతో అక్కడి విదేశీ విద్యార్థుల్లో పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ సభ్యుడు పాల్ గోసర్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. 'విద్యార్థి వీసాలపై అమెరికాలో చదువుకునేందుకు వస్తున్న ఏటా లక్ష మంది విదేశీయులు ఓపీటీ కింద నమోదు చేసుకొని విద్యాభ్యాసం అయిపోయాక కూడా ఇక్కడే మూడేళ్ల పాటు ఉంటున్నారు. దురాశపరులైన ఇక్కడి వ్యాపారులు నైపుణ్యం, ఉన్నత విద్యావంతులైన అమెరికన్లను కాదని చవకగా వస్తున్న విదేశీ విద్యార్థులకే ఉద్యోగాలు ఇస్తున్నారు. ఓపీటీ విధానం విదేశీ కార్మికులనే ప్రోత్సహిస్తోంది' అని బిల్లులో పేర్కొన్నారు. అయితే ఈ బిల్లు సెనెట్‌లో ఆమోదం పొందే అవకాశం లేదని, ఈ బిల్లు ఆమోదానికి కావాల్సిన సంఖ్యాబలం రిపబ్లికన్లకు లేదని ఇమ్మిగ్రేషన్ న్యాయవాదులు అంటున్నారు.

అమెరికాను విడిచి వెళ్లొద్దు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: వలసదారులపై ట్రంప్ సర్కారు కఠిన వైఖరి అవలంబిస్తున్న నేపథ్యంలో అమెరికాలోని టెక్ ఉద్యోగుల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో దేశం విడిచి వెళ్తే తిరిగి ప్రవేశించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున అమెరికా వెలుపల ప్రయాణాలు పెట్టుకోవద్దని వీసాదారులైన తమ ఉద్యోగులను అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్ వంటి ప్రముఖ టెక్ దిగ్గజ సంస్థలు హెచ్చరించాయి. భారత్ వస్తే, అమెరికాలోకి తిరిగి ప్రవేశాన్ని నిరాకరిస్తారనే భయంతో స్వదేశానికి వెళ్లే ఆలోచనను విరమించుకున్నామని భారత్‌కు చెందిన ఇద్దరు హెచ్-1బీ వీసాదారులు మీడియాకు తెలిపారు.

బీవైడీకి తలుపులు తెరవం!

» కేంద్ర వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్



ముంబై, ఏప్రిల్ 9: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీదారు బీవైడీ కంపెనీకి.. ప్రస్తుతానికైతే భారత్‌లో తలుపులు తెరవటం లేదని కేంద్ర వాణిజ్య పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. భారత చట్టాలకు అనుగుణంగా నడుచుకుంటామని ఆ కంపెనీ నమ్మకం కలిగిస్తే ప్రభుత్వం అప్పుడు ఆలోచిస్తుందన్నారు. భారత్‌లో పెట్టుబడులకు ఎవర్ని అనుమతించాలన్నది దేశ వ్యూహాత్మక, భద్రతాపరమైన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయించాల్సిన అంశమని చెప్పారు. ముంబైలో జరిగిన 'ఇండియా గ్లోబల్ ఫోరం' సదస్సులో మాట్లాడుతూ పీయూష్ గోయల్ ఈ వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో బీవైడీ వెయ్యి కోట్ల డాలర్ల (రూ.86,707 కోట్లు) పెట్టుబడితో ఈవీల తయారీ పరిశ్రమను నెలకొల్పనుందని ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే, తమకు అటువంటి ఆలోచనేమీ లేదని బీవైడీ ఓ ప్రకటన జారీ చేసింది. ప్రస్తుతం భారత్‌లో బీవైడీ కంపెనీ కార్యాలయాలున్నాయి గానీ.. ఫ్యాక్టరీ లేదు. బీవైడీ చైనా నుంచి ఈవీలను దిగుమతి చేసుకొని భారత్‌లో విక్రయిస్తోంది. కాగా, మేఘా ఇంజనీరింగ్ కంపెనీతో కలిసి 100 కోట్ల డాలర్లతో(రూ.8,670కోట్లు) ఈవీల పరిశ్రమను ఏర్పాటు చేస్తామన్న బీవైడీ ప్రతిపాదనను కేంద్రం 2023లో తిరస్కరించినట్టు సమాచారం.

బంగ్లాదేశ్ ఎగుమతులు భారత్ నుంచి వెళ్లకుండా నిషేధం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: భారత భూభాగం గుండా నేపాల్, భూటాన్, మయన్మార్ దేశాలకు సరుకులు ఎగుమతి చేసుకునేలా బంగ్లాదేశ్‌కు గతంలో ఇచ్చిన వెసులుబాటు(ట్రాన్స్‌షిప్‌మెంట్)ను కేంద్రప్రభుత్వం రద్దు చేసింది. బంగ్లాదేశ్ ఎగుమతులేవీ భారత దేశం గుండా వేరే దేశాలకు వెళ్లకుండా పూర్తిగా నిషేధం విధించింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ) మంగళవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపింది. బంగ్లాదేశ్‌కు ట్రాన్స్‌షిప్‌మెంట్ వెసులుబాటు కల్పిస్తూ 2020 జూన్ 29న భారత్ సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం.. బంగ్లాదేశ్ తమ ఉత్పత్తులను భారత్‌లోని ల్యాండ్ కస్టమ్స్ స్టేషన్లు, నౌకాశ్రయాలు, ఎయిర్‌పోర్టుల ద్వారా వేరే దేశాలకు ఎగుమతి చేసుకోవచ్చు. అయితే, బంగ్లాదేశ్ ప్రభుత్వ సలహాదారు యూనస్ ఇటీవల చైనాలో పర్యటించినప్పుడు.. భారతదేశ ఈశాన్య రాష్ట్రాలకు సముద్రమార్గం లేదని, అవి భూపరివేష్టిత రాష్ట్రాలని అన్నారు. వాటికి తామే రక్షకులుగా ఉన్నామని చెప్పారు. వాటి చుట్టూ బంగ్లాదేశే ఉందన్న అర్థం వచ్చేలా మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాల్లో వాణిజ్యపరంగా తన పట్టును పెంచుకోవడానికి చైనాకు మంచి అవకాశం ఉందని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే బంగ్లాదేశ్ ట్రాన్స్‌షిప్‌మెంట్‌ను భారత ప్రభుత్వం రద్దుచేసింది.

బీజేపీది నకిలీ జాతీయవాదం

కాంగ్రెస్ జాతీయవాదం ప్రజలను ఏకం చేస్తే.. బీజేపీ సమాజాన్ని విభజిస్తోంది

- సమాఖ్య వ్యవస్థను దెబ్బతీసే ప్రతి ప్రయత్నాన్ని అడ్డుకుంటాం
- అహ్మదాబాద్ ఏఐసీసీ విస్తృత స్థాయి సమావేశంలో కాంగ్రెస్ తీర్మానం



ఏఐసీసీ విస్తృత స్థాయి సమావేశంలో సోనియా, ఖర్గే, రాహుల్

అహ్మదాబాద్, ఏప్రిల్ 9: జాతీయవాదం అంటే కాంగ్రెస్ దృష్టిలో ప్రజలను ఏకం చేసేదని.. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌ల నకిలీ జాతీయవాదం పక్షపాతంతో ప్రజలను విభజించేదని కాంగ్రెస్ పార్టీ మండిపడింది. అవి స్వార్థపూరిత అధికారం కోసం కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించింది. రాజ్యాంగాన్ని రక్షించేది తామేనని, దేశ సమాఖ్య వ్యవస్థను దెబ్బతీసే ప్రతి ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు పోరాటం చేస్తామని తెలిపింది. ఈ మేరకు బుధవారం అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ విస్తృత స్థాయి సమావేశంలో 'న్యాయపథం' పేరిట కాంగ్రెస్ పార్టీ తీర్మానం చేసింది. "దేశంలో మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయి. ముస్లింలు, క్రిస్టియన్లలో చాలా మంది భయంతో బతుకుతున్నారు. ఇది దారుణమేకాదు రాజ్యాంగ వ్యతిరేకం కూడా. వక్ఫ్ బోర్డుల చట్టానికి సవరణలు, చర్చిల భూములను లక్ష్యంగా చేసుకోవడం, మతపరమైన ప్రాంతాల వద్ద ఉద్దేశపూర్వక ప్రదర్శనలు వంటివి వ్యూహాత్మకంగా సాగుతున్నాయి. మతం, భాష, ప్రాంతం ఆధారంగా విభజన జరుగుతోంది. కానీ భారతీయ సాంప్రదాయమైన లౌకికత్వానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటుంది. మా మార్గం సుస్పష్టం.. 'విద్వేషాన్ని వీడాలి.. దేశాన్ని ఐక్యం చేయాలి" అని తీర్మానంలో పేర్కొంది.

అందరికీ న్యాయమే జాతీయ వాదం..

"అణచివేతకు గురైనవారి హక్కులను కాపాడటమే కాంగ్రెస్ సిద్ధాంతం. దురదృష్టవశాత్తూ నాడు దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని వ్యతిరేకించిన వారు ఇప్పుడు జాతీయవాదం గురించి మాట్లాడుతున్నారు. భారత్ లౌకిక దేశంగా ఉంటుందని సర్దార్ పటేల్ ఆనాడే స్పష్టం చేశారు. భిన్నత్వంలో ఏకత్వమే మన దేశ ప్రత్యేకత. ప్రాంతం, కులం, మతం, భాష ఆధారంగా వివక్ష ఉండకూడదనేదే కాంగ్రెస్ సిద్ధాంతం. దానికి కట్టుబడి ఉంటాం. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సబ్ ప్లాన్ కోసం కేంద్రంలో చట్టం చేస్తాం. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించే చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తాం" అని కాంగ్రెస్ తెలిపింది. బీజేపీ ప్రభుత్వంలోని నేతలు వ్యక్తిగత ప్రతిష్ఠ, స్వప్రయోజనాల కోసం భారత విదేశాంగ విధానాన్ని తాకట్టు పెట్టారని, బలహీనమైన నాయకత్వంతో దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని కాంగ్రెస్ ఆరోపించింది.

న్యాయవ్యవస్థకు జవాబుదారీతనం కావాలి

"దేశంలో ప్రతి వ్యవస్థను బలంతోనో, ప్రలోభంతోనో, అధికారంతోనో లొంగదీసుకోవడం సాధారణమైపోయింది. ఇటీవల ఢిల్లీ హైకోర్టు జడ్జి నివాసంలో నోట్ల కట్టలు బయటపడటం అప్రమత్తం కావాల్సిన అంశం. దేశంలో న్యాయ వ్యవస్థ స్వతంత్రత దెబ్బతినకుండా చూస్తూనే.. దాని జవాబుదారీతనం పెంచే వ్యవస్థ అత్యవసరం" అని కాంగ్రెస్ తీర్మానంలో అభిప్రాయపడింది. "జీఎస్టీ ఆదాయంలో వాటాను తగ్గిస్తూ రాష్ట్రాలను ఆర్థికంగా బలహీనం చేస్తున్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక పేరిట సమాఖ్య వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తున్నారు" అని ఆరోపించింది. మరోవైపు గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఆ రాష్ట్రానికి సంబంధించి కాంగ్రెస్ ప్రత్యేకంగా మరో తీర్మానం చేసింది.

పనిచేయకుంటే తప్పుకోండి: ఖర్గే

కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనని, తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించని నేతలు తప్పుకుంటే మంచిదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హెచ్చరించారు. పార్టీలో జిల్లా అధ్యక్షుల అధికారాలు, బాధ్యతలు పెరగనున్నాయని.. అందుకే వారి ఎంపికలో కఠినంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించనున్నామని తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా నియమితులైనవారు ఏడాదిలోపు జిల్లా స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో జిల్లా అధ్యక్షులను భాగస్వామ్యం చేయనున్నట్టు తెలిపారు. ఈవీఎంలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయని. అభివృద్ధి చెందిన దేశాలు కూడా తిరిగి బ్యాలెట్ పేపర్లకు మళ్లాయని ఖర్గే చెప్పారు. మన ఎన్నికల సంఘం మాత్రం ఈ విషయాన్ని గుర్తించదని పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు ప్రయోజనం కలిగేలా మోదీ సర్కారు ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తోందని ఆరోపించారు. ప్రైవేటీకరణ వల్ల దేశంలో రిజర్వేషన్లకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. కాగా, పార్టీ సీనియర్ నేత శశిథరూర్ మాట్లాడుతూ.. ప్రజల భవిష్యత్తుకు కాంగ్రెస్ ఆశాదీపంగా ఉండాలని సూచించారు.

దేశమంతా తెలంగాణ ఫార్ములా

- సమాజంలో 90 శాతం బలహీనవర్గాలు, పేదలేనని తెలంగాణ సర్వేలో తేలింది
- వారి గోడు పట్టించుకునేవారే లేరు
- ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే కులగణన చేపట్టాల్సిందే: రాహుల్ గాంధీ

అహ్మదాబాద్, ఏప్రిల్ 9: తాము అధికారంలోకి వస్తే దేశంలో 50 శాతం రిజర్వేషన్ల పరిమితి బద్దలు కొడతామని, ఇందుకోసం తెలంగాణ ఫార్ములాను అమలు చేస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. జనగణనలో భాగంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రం తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, మత స్వేచ్ఛపై దాడి అని అభివర్ణించారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లు త్వరలోనే క్రిస్టియన్లు, సిక్కులు, ఇతర మైనారిటీల హక్కులపై పడతాయని వ్యాఖ్యానించారు. బుధవారం ఏఐసీసీ విస్తృత స్థాయి సమావేశంలో రాహుల్ మాట్లాడారు. "నేను బలహీనవర్గాల వారి కోసం పనిచేస్తున్నాను. దేశ వనరుల్లో ఎవరి వాటా ఎంత అనేది తేలాల్సి ఉంది. అందుకు కులగణన చేయాలి. మేం తెలంగాణలో చేశాం. ఢిల్లీలో, దేశవ్యాప్తంగా కూడా చేసి చూపిస్తాం. రిజర్వేషన్లకు ఉన్న 50 శాతం పరిమితి అడ్డుగోడను బద్దలుకొడతాం. తెలంగాణలో చేసిన కులగణనలో సమాజంలో 90% మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉన్నారని తేలింది. ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుంది. కానీ వారి గోడు పట్టించుకునేవారు లేరు. దేశవ్యాప్తంగా కులగణన చేపడితే ఈ పరిస్థితిలో మార్పు వస్తుంది. నిర్ణయాధికారంలో వారి వాటా ఏమిటో వెల్లడవుతుంది" అని రాహుల్ చెప్పారు. టారిఫ్‌లపై ట్రంప్ ఒత్తిళ్లకు ప్రధాని మోదీ లొంగిపోయారని, దేశంలో ఆర్థిక తుఫాను రాబోతోందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. "56 అంగుళాల ఛాతీ ఎక్కడ పోయింది?" అని ప్రశ్నించారు. దేశంలో పది శాతం కార్పొరేట్ శక్తుల చేతుల్లో 90 శాతం సంపద పోగుపడిందని వ్యాఖ్యానించారు.



ఎంవోయూ చూపిస్తున్న వైద్యులు భాస్కర్‌రావు, గురవారెడ్డి తదితరులు

రక్తపోటు రోగుల కోసం.. కిమ్స్ సన్‌షైన్‌లో రీనల్ డెనర్వేషన్ థెరపీ

» మెడ్‌ట్రానిక్‌తో అవగాహన ఒప్పందం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రక్తపోటు నియంత్రణకు రోగులకు చేసే రీనల్ డెనర్వేషన్ థెరపీ అనే వైద్య విధానం హైదరాబాద్, బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో అందుబాటులోకి రానుంది. కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో రీనల్ డెనర్వేషన్ థెరపీ సెంటర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి మెడ్‌ట్రానిక్ అనే సంస్థతో కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి యాజమాన్యం బుధవారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. కిమ్స్ గ్రూప్ చైర్మన్, ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు, కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రుల ఎండీ డాక్టర్ ఏవీ గురవారెడ్డి, కిమ్స్ సన్‌షైన్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్ కాస్తూరి, మెడ్‌ట్రానిక్ ఎండీ, వైస్ ప్రెసిడెంట్ మందీప్ సింగ్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోట్లకు పడగెత్తి కటిక దారిద్ర్యంతో కన్నుమూసి!

» గల్ఫ్‌లో ఇద్దరు తెలంగాణ ప్రవాసీయుల విషాదాంతం


(గల్ఫ్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

కాలం కన్నెర్రజేస్తే ఓడలు బండ్లయ్యేందుకు.. రాజులు బంట్లయ్యేందుకు ఎంతో సమయం పట్టదు. గల్ఫ్‌లో తెలంగాణకు చెందిన ఆ ఇద్దరు కుబేరులు రాత్రికి రాత్రే బికారులై కటిక దారిద్ర్యం అనుభవించి చనిపోయారు. స్వర్గాన్ని తలపించేలా కళ్లు చెదిరే భవంతులు.. చిటికేస్తే కూర్చున్నచోటుకే వచ్చివాలే సకల సదుపాయాలు.. ఇంట్లోంచి కాలు బయటపెడితే విలాసవంతమైన కార్లు.. అన్నీ కళ్లుమూసి తెరిచేలోపు మాయమైపోయి... చేతిలో చిల్లిగవ్వ లేని స్థితిలో.. పిడికెడు మెతుకులు దొరకని దయనీయస్థితిలో పాడుబడ్డ ఇళ్లలో దుర్భరంగా బతుకీడుస్తూ చనిపోయారు. వారిలో ఒకరు.. హైదరాబాద్‌కు చెం దిన గఫ్ఫార్ సేట్ అయితే మరొకరు సిద్దిపేట జిల్లాకు చెందిన గాథర మోం డయ్య! ఈ ఇద్దరూ ఒకప్పుడు సౌదీలో అక్రమ పద్ధతిలో ఇబ్బడిముబ్బడిగా డబ్బు సంపాదించి.. విపరీతంగా కూడబెట్టారు. గఫ్ఫార్ సేట్‌కు నోట్ల కట్టలు పెట్టే స్థలం లేక సంచుల్లో కుక్కి గోదాంలో ఆ సంచుల్ని పేర్చేవాడు. ఈ డబ్బంతా గఫ్ఫార్ సేట్ చట్టవిరుద్ధంగా థాయ్‌లాండ్ లాటరీలు నిర్వహించి సంపాదించిందే!. తర్వాత మనీలాండరింగ్ కేసుల్లో ఇరుక్కున్నాడు. చివరికి ఇంటి అద్దెను, కరెంటు బిల్లులూ చెల్లించే స్థోమత లేక శిథిలమైపోయిన ఓ భవంతిలో గడిపాడు. స్వదేశానికి వెళ్లేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసి, ఇటీవల అల్ ఖోబర్‌లో మృతిచెందాడు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలానికి చెందిన మోండయ్య చట్టవిరుద్ధమైన పద్ధతిలో భవన నిర్మాణ కాంట్రాక్టు, వీసా దందాలతో విపరీతంగా డబ్బు సంపాదించాడు. ఇతనూ మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొని.. 17 ఏళ్లుగా స్వదేశానికి వెళ్లేందుకు యత్నాలు చేసీ చేసీ ఇటీవల రియాద్‌లో గుండెపోటుతో మృతిచెందాడు.

తమిళిసై తండ్రి కుమరి అనంతన్ కన్నుమూత

» గాంధేయవాది, కాంగ్రెస్ దిగ్గజం.. తమిళ సాహితీవేత్తగా ఖ్యాతి

» సంతాపం తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీ


అనంతన్(ఫైల్)

చెన్నై, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తండ్రి, గాంధేయవాది, తమిళనాడు కాంగ్రెస్ దిగ్గజం కుమరి అనంతన్(93) కన్నుమూశారు. ఆయన కొన్నేళ్లుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో చెన్నైలోని వానగరంలో ఉన్న అపోలో ఆస్పత్రిలో చేర్చగా బుధవారం వేకువజామున తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం సాలి గ్రామంలోని తమిళిసై సౌందరరాజన్ నివాసగృహంలో ఉంచారు. 1933లో జన్మించిన ఆయన 1965లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1977 లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కోవిల్ నుంచి విజయం సాధించారు. లోక్‌సభలో తమిళంలో ప్రశ్నలడిగే హక్కును పొందిన సభ్యుడిగా ఖ్యాతిగడించారు. లోక్‌సభ, రాజ్యసభలో తమిళం సహా ఇతర భాషల్లో సభ్యులు ప్రశ్నలడిగితే అప్పటికప్పుడు హిందీ, ఆంగ్ల భాషల్లో తర్జుమా చేసే పరికరాలు ఏర్పాటు కావడానికి ఆయనే ప్రధాన కారకుడు. తమిళ సాహితీవేత్తగాను కీర్తి గడించారు. నాటి ప్రధానులు మొరార్జీ దేశాయ్, రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావు తమిళనాడు పర్యటనకు వచ్చినప్పుడు వారి ప్రసంగాలను ఆయనే తమిళంలోకి అనువదించి ప్రశంసలు అందుకున్నారు. బుధవారం సాయంత్రం ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. అనంతన్ మృతి పట్ల ప్రధాని మోదీ, గవర్నర్ ఆర్‌ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి సంతాపం ప్రకటించారు.

కమ్మగూడ భూవివాదంలో ఘర్షణ

» పరస్పరం రాళ్ల దాడి.. ద్విచక్ర వాహనం దగ్ధం

» ఉద్రిక్త పరిస్థితులతో పోలీస్ పికెట్ ఏర్పాటు

వనస్థలిపురం/హయత్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తుర్కయాంజల్ మునిసిపాలిటీ కమ్మగూడ-శివాజీనగర్ ఫేస్-2లోని 240, 241, 242 సర్వేనంబర్ల పరిధిలో భూమి విషయమై రెండు పక్షాల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఇరుపక్షాలు పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతో కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ఓ ద్విచక్ర వాహనాన్ని దగ్ధం చేయగా, జేసీ అద్దాలు పగుల గొట్టిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం జరిగింది. ఈ మూడు సర్వే నంబర్ల పరిధిలోని 10.09 ఎకరాల భూమిని ఉప్పల్ వాసి గుండ్ల రాజమ్మకు ఆమె పూర్వీకుల నుంచి సంక్రమించిందని కోర్టు తీర్పు ఇచ్చినట్లు సమాచారం. అప్పటికే ఈ భూమిలో వేసిన ప్లాట్లను వందల మంది కొనుగోలు చేశారు. వారిలో కొందరు ఇళ్లు కట్టుకుంటే.. మరికొందరు ప్లాట్ల చుట్టూ ప్రహరీగోడ ఏర్పాటు చేసుకున్నారు. రూ.కోట్ల విలువైన ఈ భూమిపై కోర్టు తీర్పు ఆధారంగా దాన్ని దక్కించుకునేందుకు రాజమ్మ 2024లో ఒక వ్యక్తికి జీపీఏ చేశారు. జీపీఏ తీసుకున్న ఆ వ్యక్తి.. బుధవారం తెల్లవారుజామున కూలీలతో ఆ ప్లాట్లలోని ప్రహరీలను, కడీలు, ప్రీకాస్ట్ వాల్లను కూల్చేందుకు యత్నించారు. కాలనీ వాసులు, ప్లాట్ల యజమానులు ఎదురు తిరిగారు. వనస్థలిపురం పోలీసులు ఇరుపక్షాలను చెదరగొట్టారు. ఆ ప్రాంతంలో ముందు జాగ్రత్త చర్యగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

కాగా, ఇరువర్గాలు తొర్రూర్‌లోని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడా ఇరుపక్షాల మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది.

రూ.4,150 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

అమలు, వాటి ఫలితాల ఆధారంగా ఈ నిధులను విడుదల చేయనుంది. ఇందుకోసం ప్రపంచ బ్యాంకు బృందం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖతో కలిసి పనిచేస్తుంది. వచ్చే ఆరేళ్ల ఈ బృందం సాంకేతిక, ఇతర సహాయ సహకారాలను అందజేయనుంది. ప్రస్తుతం 4 రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనుంది. ఇక నుంచి ప్రతి నెలా ప్రపంచ బ్యాంకు బృందం రాష్ట్రంలో పర్యటించనున్నట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి.

ఆ మూడు అంశాలపై ఆరా...

ప్రపంచ బ్యాంకు బృందం బుధవారం వైద్యశాఖలో కీలకమైన కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్, వైద్య విద్య సంచాలకుడు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్, రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులతో భేటీ అయింది. ప్రధానంగా మూడు అంశాలపై హెచ్‌వోడీల నుంచి వివరాలు సేకరించింది. ప్రభుత్వాస్పత్రుల్లో అందుతున్న వైద్యసేవలు, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (బీడబ్ల్యూఎం)సేఫ్టీ, మానవ వనరుల గురించి ఆరా తీసింది. ఎలాంటి వైద్య సేవలు అందుతున్నాయి? వ్యర్థాలను ఎలా డిస్పోజ్ చేస్తున్నారు? ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు? వైద్యులు, ఇతర పారామెడికల్ సిబ్బంది కొరత ఎంత అంశాలపై రిపోర్టులు తీసుకుంది. అలాగే క్షేత్రస్థాయి పర్యటనలో



భాగంగా సరోజిని కంటి ఆస్పత్రిని సందర్శించింది. ఇక్కడి వైద్యసేవలు, బీడబ్ల్యూఎంపై ఆరా తీసింది. గురువారం హైదరాబాద్‌లోని అమీర్‌పేట యూసీహెచ్‌సీ, వనస్థలిపురం ప్రాంతీయ ఆస్పత్రి, తిలక్‌నగర్ యూపీహెచ్‌సీ, అన్నోజిగూడ హెల్త్‌సెంటర్‌ను ప్రపంచ బ్యాంకు బృందం సందర్శించనుంది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించనున్నట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి.

నిధుల వినియోగం ఇలా!

ప్రపంచ బ్యాంకు రుణం ప్రధానంగా నాలుగైదు విభాగాలకే ఉండనున్నట్లు తెలుస్తోంది. మహిళల ఆరోగ్యం, అసాంక్రమిక వ్యాధులు (ఎన్‌సీడీ), వయోవృద్ధుల ఆరోగ్యం, స్పెషాలిటీ ఆస్పత్రుల్లో యంత్ర పరికరాల కొనుగోలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ట్రామాకేంద్రాల ఏర్పాటుకు పెద్దయెత్తున నిధులు ఇవ్వనుంది. ప్రపంచబ్యాంకు సాయంతో జాతీయ రహదారుల వెంట ప్రతి 30 కి.మీ.కు ఒక ట్రామాకేర్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వందకుపైగా ట్రామా కేర్ కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి ఇందుకు రూ.1,000 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. ప్రమాదం జరిగితే బాధితుల వద్దకు 8 నిమిషాల్లోపు అంబులెన్స్‌లు చేరుకునేలా చర్యలు తీసుకోనున్నారు. అలాగే 4 ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రాలను ఒక్కొక్కటి రూ.30కోట్లతో ఏర్పాటు చేస్తారు. అలాగే ప్రభుత్వం నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో యంత్ర పరికరాల కొనుగోలుకు ప్రపంచబ్యాంకు నిధులను వినియోగించనున్నారు. పదిచోట్ల అవయవాల సేకరణ, నిల్వ కేంద్రాలు, ఇంటిగ్రేటెడ్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్స్, జిల్లాల్లో డయాలసిస్, ఐవీఎఫ్ కేంద్రాలను ఆ నిధులతో ఏర్పాటు చేయనున్నారు.

గతేడాది నుంచి ప్రయత్నాలు..

వరల్డ్ బ్యాంకు సాయం కోసం గత సెప్టెంబరు నుంచే రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇదే విషయాన్ని "ఆంధ్రజ్యోతి" ముందే చెప్పింది. గత సెప్టెంబరు 15న "వైద్యానికి 5 వేల కోట్లు" పేరిట కథనాన్ని ప్రచురించింది. ప్రతిపాదనలను గతేడాది సర్కారు కేంద్రానికి పంపగా, వాటిని కేంద్రం ప్రపంచ బ్యాంకుకు పంపింది. మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో పరికరాల కొనుగోలు, ఎన్‌సీడీ స్క్రీనింగ్ బీపీ, షుగర్ బాధితులకు ఔషధాల పంపిణీ తదితరాల కోసం రూ.4,944 కోట్ల ప్రతిపాదనలను రాష్ట్రప్రభుత్వం పంపగా.. రూ.4,150కోట్ల సాయానికి ప్రపంచబ్యాంకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

ఫార్మాసిటీ కోసం మేడిపల్లిలో హద్దుల గుర్తింపు

యాచారం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మేడిపల్లి-నుంచి కుర్మిద్ద వరకు ఫార్మాసిటీ కోసం గతంలో సేకరించిన భూముల్లో బుధవారం రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు సర్వే చేసి హద్దులు గుర్తించారు. రెండున్నర కి.మీ.మేర కడీలను బిగించారు. టీజీఐఐసీ అధికారి రామాంజనేయులు, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సర్వేను పర్యవేక్షించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రభుత్వాలే సుప్రీం

అక్కడ వేరొకరు గనుక ఉండివుంటే, ఇన్నిమాటలు పడ్డాక కూడా ఇంకా ఆ కుర్చీని పట్టుకొనివేలాడేవారు కాదు. తమిళనాడు గవర్నర్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు తరువాత ఈ తరహా వ్యాఖ్యలు అనేకం వినబడుతున్నాయి. రవి తక్షణమే రాజీనామా చేయాలని డీఎంకె నాయకులు అనడమే కాదు, ఇంకా కొనసాగడం ఆయనకంటే ఆ పదవికే అవమానకరమన్న వ్యాఖ్యలు ప్రజాస్వామికవాదులనుంచి, రాజ్యాంగం మీద గౌరవాభిమానాలున్నవారినుంచి కూడా వినబడుతున్నాయి. న్యాయస్థానాలనుంచి ఈ తరహా తీర్పులు, కఠిన వ్యాఖ్యలు నిజంగానే విపక్షపాలిత గవర్నర్లను అవమాన భారంతో కుదిపేయ గలిగితే రవి వంటివారి ఆవిర్భావమే ఉండేది కాదు. గవర్నర్ స్థాయిలో ఉన్నవారికి రాజ్యాంగబద్ధంగా నడుచుకోమని పదేపదే చెప్పాల్సిరావడం నిజానికి సర్వోన్నత న్యాయస్థానానికే పెద్ద పరీక్ష.

ఇది తమిళనాడు గవర్నర్‌కు మాత్రమే పరిమితమైన తీర్పు కాదు. విపక్షపాలిత రాష్ట్రాల్లో రవి తరహా గవర్నర్లు పెడుతున్న బాధలను అనుభవిస్తున్న పార్టీలకు ఈ తీర్పు ఎక్కడలేని శక్తినీ, ఉత్సాహాన్నీ ఇచ్చింది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకు, రాష్ట్రాలకు అతీతులమన్న తరహాలో వ్యవహరిస్తున్న గవర్నర్లకు ఘాటైన హెచ్చరిక ఇది. వారి అధికారాలను, పరిధినీ, పాటించాల్సిన ధర్మాన్నీ గుర్తుచేస్తూ, లక్ష్మణరేఖ దాటవద్దని చెబుతున్న తీర్పు ఇది. రాజ్యాంగం ఆశయాలను ఎత్తిపడుతూ, ఫెడరల్ వ్యవస్థను పునాది దిట్టం చేసేందుకు ఈ తీర్పు ఉపకరిస్తుంది. ఓ పది బిల్లులను రాష్ట్రపతికి నివేదించడంలో సదరు గవర్నర్ కుట్రను తప్పుబట్టడానికే సుప్రీంకోర్టు పరిమితం కాలేదు. నిర్దిష్టకాల పరిమితిలో ఆమోదించకుండా, శాసనసభ రెండోసారి పంపినా సంతకం చేయకుండా ఆ గవర్నర్ కుట్రలు చేసిన బిల్లులమీద సుప్రీంకోర్టే నిర్ణయం తీసుకుంది. గవర్నర్ చర్యలన్నింటినీ రద్దుపరిచి, 142వ అధికరణద్వారా తనకు దఖలుపడిన ప్రత్యేకాధికారాలను అందుకు వినియోగించుకుంది. అసెంబ్లీ రెండవసారి పంపిన బిల్లులను సైతం ఆమోదించకుండా, వాటిని రాష్ట్రపతికి నివేదించి గవర్నర్ అతితెలివి ప్రదర్శిస్తే, దానినే గడువుగా తీసుకొని ఆ బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టుగా కోర్టు నిర్ధారించడం సముచితమైన చర్య. దుష్ట చేష్టలను వమ్ముచేయాలన్నా, కృత్రిమ సంక్షోభాలను పరిష్కరించాలన్నా ఈ తరహా సాహసోపేతమైన నిర్ణయాలు తప్పవు. ఇలా, గవర్నర్ ఆమోదం లేకుండా బిల్లులు చట్టాలు కావడం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు.

బిల్లు ఆమోదానికి నిర్దిష్ట కాలపరిమితి లేకపోవడం రవి తరహా గవర్నర్లకు అధికారపక్షాన్ని వేధించడానికి బ్రహ్మాస్త్రంలాగా ఉపకరిస్తోంది. ఇప్పుడు, ఆమోదానికీ, తిరస్కారానికీ, రాష్ట్రపతి నివేదనకు కాలపరిమితులు విధించడం, ఏ ముచ్చటైనా మూడునెలల్లో జరగాలని కోర్టు శాసించడం బాగుంది. మళ్ళీ తనముందుకు మరోమారు యథాతథంగా వచ్చిన బిల్లును నెలరోజుల్లోగానే ఆమోదించాలనడం, ఆమోదం పొందినట్టుగానే పరిగణించాలనడం సముచితంగా ఉంది. ఈ కాలపరిమితులను దాటితే గవర్నర్ల చర్యలు న్యాయసమీక్షకు నిలవాల్సి వస్తుందన్న హెచ్చరిక అవసరమైనదే. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్న రవివంటివారి వల్లనే ఆ ఉన్నత వ్యవస్థకు సర్వోన్నత న్యాయస్థానం ఇలా గడువులు విధించాల్సి వచ్చింది. ఇప్పటికే పలుమార్లు హితవులు చెప్పినా, హెచ్చరించినా నడవడిక మార్చుకోకుండా రాజ్యాంగాతీత శక్తులుగా తయారైనవారిని ఇలా దారికి తేవాల్సి వస్తున్నది.

కేంద్రప్రభుత్వం నియమించే గవర్నర్లకంటే, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలే ఉన్నతమైనవని కోర్టు తేల్చింది. మీకు వీటో అధికారాలు లేవు అంటూ, రాష్ట్ర ప్రభుత్వాలకు, వాటిని ఎన్నుకున్న ప్రజలకు గవర్నర్‌లు జవాబుదారీగా ఉండాల్సిందేనని స్పష్టంచేసింది. తాము ఏదో పైనుంచి దిగివచ్చినట్టుగా, ప్రత్యేకాధికారాలు ఉన్నట్టుగా వ్యవహరిస్తూ, ఎన్నికల్లో నెగ్గివచ్చిన విపక్షపార్టీల ప్రభుత్వాలను ఇరకాటంలో పెడుతున్న గవర్నర్లకు ఈ తీర్పులో సరిపడినన్ని చీవాట్లున్నాయి. రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేయాలని, రాష్ట్ర ప్రభుత్వాలకు మిత్రుడిగా, మార్గదర్శిగా వ్యవహరించాలంటూ చెప్పిన బోలెడు హితవులూ ఉన్నాయి. ప్రజాస్వామ్యానికీ, సమాఖ్యవ్యవస్థకు సత్తువనిచ్చే తీర్పు ఇది. రవి తరహాలో పార్టీ కార్యకర్తల్లాగా వ్యవహరించే గవర్నర్లందరికీ చెంపపెట్టు. అటువంటి వారికి వెన్నుదన్నుగా నిలుస్తూ, భుజం తట్టి ప్రోత్సహిస్తూ, ప్రమోషన్లు ఇస్తున్న ఢిల్లీ పెద్దలకు ఎదురుదెబ్బ.


విద్యావిధానాన్ని రాజకీయం చేయకండి!

ప్రపంచంలో ఎన్నో దేశాల్లో అక్షర జ్ఞానం అడుగులు పడకముందే మనం నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాం. మన ఆచార వ్యవహారాలన్నింటిలో శాస్త్ర విజ్ఞానం నిగూఢంగా నిక్షిప్తమై ఉంది. ఇంతటి గొప్ప వారసత్వాన్ని సొంతం చేసుకున్న భారతీయ విద్య విదేశీ దండయాత్రలతో తన ప్రాభవం కోల్పోయింది. ముఖ్యంగా దాదాపు రెండు శతాబ్దాల ఆంగ్లేయుల పాలనలో మన విద్యా వ్యవస్థ తీవ్రంగా విధ్వంసమైంది.

స్వాతంత్ర్యం వచ్చాక కూడా దురదృష్టవశాత్తూ ఆంగ్లేయులు అందించిన విద్యావిధానాలనే కొనసాగిస్తూ వచ్చాం. భారతీయతకు పెద్దపీట వేసి మనదైన సొంత విద్యావిధానాన్ని రూపొందించుకోవడంలో విఫలమయ్యాం. 1948లో స్వేచ్ఛాయుత భారతదేశ అవసరాలను తీర్చే విద్యా వ్యవస్థను నిర్మించే నిమిత్తం రాధాకృష్ణన్ కమిషన్ ఏర్పాటైంది. బ్రిటిష్, మెకాలే విద్యా విధానాలను రూపుమాపి, భారతీయ విలువలతో కూడిన విద్యావిధానం ప్రవేశపెట్టేందుకు మంచి అవకాశం ఈ కమిషన్‌కు లభించింది. కానీ, నాటి సామాజిక పరిస్థితులు, రాజకీయ సమీకరణాలు తదితర కారణాలతో అది సాధ్యపడలేదు.

రాజ్యాంగ సభలో అధికార భాషపై చర్చ జరిగినప్పుడు హిందీని అధికారిక భాషగా ప్రకటించాలని చాలామంది సిఫార్సు చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ 'హిందుస్థానీ' (హిందీ, ఉర్దూ కలిసి ఉండే భాష)ని సూచించారు. చివరకు మున్షీ–అయ్యంగార్ ఫార్ములా ప్రకారం దేశంలో అత్యధిక మంది మాట్లాడే హిందీని అధికారిక భాషగా నిర్ణయించారు. హిందీతో పాటు ఒక పదేళ్ల వరకు ఇంగ్లీష్‌ను కూడా అధికార భాషగా అమలు చేయాలని, పదేళ్ల తర్వాత కేవలం హిందీని అధికార భాషగా కొనసాగించాలని నిర్ణయించారు. పదేళ్ల అనంతరం 1958 ప్రాంతంలో హిందీయేతర రాష్ట్రాల్లో ముఖ్యంగా తమిళనాడులో హిందీ వ్యతిరేక ఆందోళనలు జరిగాయి. అదే సమయంలో ఉత్తర భారతదేశంలో 'అంగ్రేజీ హటావో' నినాదాలు మిన్నంటాయి. ఈ నేపథ్యంలో నాటి ప్రధాని నెహ్రూ 1961లో రాష్ట్రాల ముఖ్యమంత్రులతో 'చీఫ్ మినిస్టర్స్ కాన్ఫరెన్స్' నిర్వహించారు. ఆ కాన్ఫరెన్సులోనే త్రిభాష సూత్రం ప్రతిపాదన వచ్చింది. దాని ప్రకారం పదేళ్ల వరకే అని ముందుగా అనుకున్నప్పటికీ, ఇప్పటికీ అధికార భాషగా ఇంగ్లీషును కొనసాగిస్తూ వచ్చారు. త్రిభాష సూత్రం ప్రకారం హిందీ, ఇంగ్లీషుతో పాటు మరొక భాష, అంటే ఆయా ప్రాంతం మాతృభాషను సబ్జెక్టులుగా ప్రవేశపెట్టారు. నాడు నెహ్రూ ప్రవేశపెట్టిన త్రిభాషా సూత్రాన్ని నేడు మోదీ ప్రభుత్వం మరింత మెరుగుపరిస్తే, దానిని తప్పుబట్టడం అర్థరహితం.

1964లో ఏర్పాటైన కోఠారీ కమిషన్ 1966లో నివేదికను సమర్పించింది. దీని ఆధారంగా స్వతంత్ర భారతంలో 1968లో తొలిసారి జాతీయ విద్యావిధానం రూపొందించారు. 1986లో నాటి జాతీయ విద్యావిధానంలో కొన్ని సవరణలు తీసుకొచ్చారు. మరిన్ని మార్పుల కోసం 1990లో రామ్మూర్తి కమిటీ ఏర్పాటైంది. 2005లో ఏర్పాటైన నాలెడ్జ్ సెంటర్ ఆఫ్ ఇండియా 2009లో తన నివేదికను సమర్పించింది. ఇవన్నీ ఆంగ్లేయుల ఆలోచన విధానంలో జరిగిన ప్రయత్నాలే. వీటిలో విద్యలో భారతీయ మూలాలను పాదుకొల్పాలన్న దృక్పథం కొరవడింది. ప్రధానమంత్రి



భారతీయతకు పట్టం కడుతూ ఆధునిక అవసరాలను తీర్చే, భావి పౌరులను తీర్చిదిద్దే నూతన విద్యా విధానం–2020ను తప్పుబట్టడంలో అర్థం లేదు. రాజకీయంగా మోదీని, బీజేపీని వ్యతిరేకించాలన్న ఆదుర్దాతో ఒక మంచి ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూడడం, కట్టుకథలు అల్లి ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టడం ఎంతమాత్రం భావ్యం కాదు.

మోదీ నేతృత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం వలస పాలకుల వాసనలను వదిలించుకునే దిశగా అనేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో భారతీయ విజ్ఞానానికి పెద్దపీట వేస్తూనే, ప్రస్తుత ఏఐ జనరేషన్ అవసరాలనూ తీర్చేలా, కస్తూరి రంగన్ నేతృత్వంలో విస్తృత సంప్రదింపుల తర్వాత నూతన జాతీయ విద్యా విధానం–2020 (ఎన్ఈపీ–2020)ను ప్రవేశపెట్టింది.

మోదీ ప్రభుత్వం ఏం చేసినా తప్పుబట్టడమే పనిగా పెట్టుకున్న కొందరు సూడో మేధావులు, కొన్ని పార్టీలు యథావిధిగా ఎన్ఈపీ–2020 పైనా విమర్శలు ఎక్కుపెట్టాయి. త్రిభాషా సూత్రం, విద్యను కేంద్రీకృతం చేయడం, మతం రంగు పులమడం అన్న మూడు 'లోపాలు' వారికి ప్రధానంగా కనిపించాయి. త్రిభాషా సూత్రాన్ని బూచిగా చూపి, హిందీయేతర రాష్ట్రాలపై కేంద్రం హిందీని, సంస్కృతాన్ని రుద్దుతుందంటూ తప్పుడు ఆరోపణలతో ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొడుతున్నారు. త్రిభాష సూత్రం ప్రస్తుత ఎన్ఈపీ–2020 తీసుకొచ్చినదేమీ కాదు, గతంలో ఉన్న విధానమే. ఇంకా చెప్పాలంటే పాత పద్ధతిని మరింత మెరుగుపర్చింది. పాత విధానంలో హిందీ, ఇంగ్లీష్ తప్పనిసరి చేసి మాతృభాష కోసం మరొక భాషను ఎంచుకునే అవకాశం ఇస్తే, ఇప్పుడు కనీసం రెండు భారతీయ భాషలను తప్పనిసరి చేస్తూ ఏవైనా మూడు భాషలనూ ఎంచుకునే అవకాశం విద్యార్థులకు కల్పిస్తుంది. ఉదాహరణకు హైదరాబాదులో చదువుకునే ఒక బెంగాలీ విద్యార్థి ఇంగ్లీషుతో పాటు తెలుగు, బెంగాలీ భాషలను ఎంచుకోవచ్చు, లేదా హిందీ, తెలుగు, బెంగాలీ భాషలను ఎంచుకోవచ్చు.



3–8 ఏళ్ల వరకు మాతృభాషలోనే విద్యా బోధన జరగాలని ఎన్ఈపీ–2020 ప్రతిపాదిస్తుంది. మాతృభాషలో బోధన జరిగితే విద్యార్థి పాఠ్యాంశాన్ని తొందరగా, సమగ్రంగా ఆకళింపు చేసుకోగలుగుతాడు. ఇతర భాషలో బోధన జరిగితే విషయాలను అర్థం చేసుకోవడం కన్నా, భాషను అర్థం చేసుకోవడమే పెద్ద సవాలుగా మారుతుంది. ముప్పు ఎదుర్కొంటున్న గిరిజన భాషల్లోనూ విద్యాబోధన జరగాలనేది మోదీ ప్రభుత్వం ఆకాంక్ష. తద్వారా ఆయా గిరిజన విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థమవడమే కాకుండా, గిరిజన భాషను పరిరక్షించవచ్చు అనేది అభిప్రాయం. ఇప్పటివరకు ఇంగ్లీష్‌లోనే అందుబాటులో ఉన్న మెడిసిన్, ఇంజనీరింగ్ వంటి సబ్జెక్టులను సైతం భారతీయ భాషల్లోనూ తీసుకురావాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. వాస్తవం ఇలా ఉంటే నూతన విద్యా విధానం ద్వారా మోదీ ప్రభుత్వం హిందీని బలవంతాన రుద్దుతున్నారనడం శుద్ధ అబద్ధం.

సంస్కృతం దైవభాషగా ప్రసిద్ధి. పురాణేతిహాసాలన్నీ సంస్కృతంలోనే రచించారు. భారతీయ సంస్కృతి అందించిన గొప్ప వారసత్వమైన ఈ భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే ఎన్ఈపీ–2020లో విద్యార్థులు సంస్కృతాన్ని కూడా ఒక భాషగా ఎంచుకునే అవకాశం కల్పించారు. కానీ తప్పనిసరి చేయలేదు. ప్రపంచమే కుగ్రామంగా మారిన ఈ ఇంటర్నెట్ యుగంలో టీచర్ సాయం లేకుండానే ఒక భాష నేర్చుకునేందుకు కావాల్సిన వనరులు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో తొలిసారి 8వ తరగతి ఆ పై స్థాయి విద్యార్థులు ఇంగ్లీషేతర విదేశీ భాషలు– జర్మన్, ఫ్రెంచ్, స్పానిష్, కొరియా లాంటి భాషలను సబ్జెక్టులుగా ఎంచుకునే అవకాశం ఎన్ఈపీ–2020 కల్పించింది. విద్యార్థులు ఈ విదేశీ భాషలను సబ్జెక్టుగా ఎంచుకునేందుకు ఎంత స్వేచ్ఛ ఉంటుందో, సంస్కృతంను ఎంచుకునేందుకూ అంతే స్వేచ్ఛ ఉంటుంది. అంతేకాని, సంస్కృతంను బలవంతాన రుద్దుతున్నారన్న వాదనకు తావులేదు.

విద్యను కేంద్రం గుప్పిట పెట్టుకుని, పాఠ్యాంశాలను రాష్ట్రాలపై బలవంతాన రుద్దుతుందనేది సోకాల్డ్ మేధావుల మరో ఆరోపణ. ఇది పూర్తిగా అవాస్తవం. ఎన్ఈపీ–2020 స్థానికతకు, స్థానిక భాషలకు అధిక ప్రాధాన్యమిస్తున్నది. స్థానిక జీవన విధానం, చరిత్ర, ఆర్థిక పరిస్థితులు, అవసరాల మేరకు రాష్ట్రాలు సొంతంగా పాఠ్యాంశాలను రూపొందించుకోవచ్చు. ఇందులో కేంద్రం ఎలాంటి ఒత్తిడి చేసే అవకాశం లేదు. అంతేకాదు, ఈ ఎన్ఈపీ–2020నే అటానమస్ హోదా పొందడాన్ని సులభతరం చేసింది. స్వయం ప్రతిపత్తి పొందిన కాలేజీలు, విద్యా సంస్థలు స్థానిక అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికను రూపొందించుకునే వెసులుబాటు కల్పించింది.

భారతదేశంలో 61.6శాతం పాఠశాలలు త్రిభాషా విధానాన్ని అమలుచేస్తున్నాయి. 74.7శాతం మంది విద్యార్థులు దీని ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇదే తమిళనాడులో 3శాతం పాఠశాలలు, కేవలం 10.8శాతం మంది విద్యార్థులు మాత్రమే దీన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. అంటే.. తమిళనాడులో కేవలం పార్టీల రాజకీయం కారణంగా 90శాతం మంది విద్యార్థులు ఇతర భాషలను నేర్చుకోలేకపోతున్నారు. దీనివల్ల ఆయా పార్టీలు సాధించేదేమీ లేకపోయినా.. విద్యార్థులకు మాత్రం నష్టం వాటిల్లుతోంది. ఇటీవల విడుదలైన ASER (యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్) నివేదిక ప్రకారం.. 2005లో ఈ నివేదిక ఇవ్వడం మొదలైనప్పటి నుంచి ఉన్న పరిస్థితులతో పోలిస్తే.. 2024 నాటికి (NEP అమలు కారణంగా) ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో నేర్చుకునే తత్వం మెరుగుపడిందని వెల్లడైంది.

విద్యకు మతం రంగు అనేది మరొక ఆరోపణ. దేశ స్వాతంత్ర్యానంతరం విద్యారంగంలో విదేశీ భావజాలం గల వ్యక్తులే కీలక స్థానాలను చేజిక్కించుకున్నారు. వీరు పక్షపాత వైఖరితో చరిత్ర పాఠ్యాంశాలను రూపొందించారు. ఇప్పటివరకు మన దేశంపై దండెత్తిన దురాక్రమణదారులను కీర్తిస్తూ చరిత్ర పుస్తకాల్లో స్థానం కల్పించారు, కానీ వారిని ఎదురించిన వీరులకు, అంతకుముందున్న సుసంపన్న వారసత్వ చరిత్రకు చోటు కల్పించలేదు. పాశ్చాత్యుల చరిత్రనే భారత చరిత్రగా నమ్మబలికారు. నా వ్యక్తిగత అనుభవమే తీసుకుంటే మా పిల్లల చరిత్ర పుస్తకాల్లో ఫ్రెంచ్ విప్లవం, రోమన్ సామ్రాజ్యం, జర్మనీ ఏకీకరణ వంటి సంఘటనలపై పాఠ్యాంశాలున్నాయే కానీ, నిజాం నుంచి విమోచనం పొంది భారతదేశంలో విలీనమైన నా తెలంగాణ గడ్డ చరిత్ర గురించి ఒక్క పాఠ్యాంశమూ లేదు. ఇలాంటి పక్షపాత వైఖరిని రూపుమాపి అసలైన భారతీయ చరిత్రకు పెద్దపీట వేయాలన్న ప్రయత్నంలో కొన్ని కొత్త చరిత్ర పాఠాలను ప్రవేశపెడితే ఈ సోకాల్డ్ మేధావులు తప్పులు వెతుకుతున్నారు.


భారతీయతకు పట్టం కడుతూ ఆధునిక అవసరాలను తీర్చే భావి పౌరులను తీర్చిదిద్దే నూతన విద్యా విధానం–2020ను తప్పుబట్టడంలో అర్థం లేదు. రాజకీయంగా మోదీని, బీజేపీని వ్యతిరేకించాలన్న ఆదుర్దాతో ఒక మంచి ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూడడం, కట్టుకథలు అల్లి ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టడం ఎంతమాత్రం భావ్యం కాదు.

● జి. కిషన్‌రెడ్డి
కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి

పార్ట్ టైం సహాయ ఆచార్యులకు ఇది తీరని అన్యాయం

తెలంగాణలో రాష్ట్రస్థాయి స్వయంప్రతిపత్తి గల 12 ప్రభుత్వ యూనివర్సిటీలు పనిచేస్తున్నాయి. పన్నెండేళ్లకు పైగా శాశ్వత ప్రాతిపదిక ఆచార్యుల ఉద్యోగ భర్తీ నిరీక్షణకు ముగింపు పలుకుతూ తెలంగాణ ప్రభుత్వం ఒక ముందడుగు వేసింది. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో నియామకమైన అత్యున్నత కమిటీ సిఫారసులను ప్రభుత్వం ఆమోదిస్తూ జీవో నెంబర్ 21ను తీసుకొచ్చింది. ఫలితంగా రాష్ట్రంలోని 12 ప్రభుత్వ యూనివర్సిటీలకు మార్గదర్శకాలు వెలువడ్డాయి. అయితే ఈ మార్గదర్శకాల ద్వారా మహాభారతంలోని బర్బరీకుడి లాగా యూనివర్సిటీల పార్ట్ టైం సహాయ ఆచార్యులు బలి కానున్నారు. వీరు వేరువేరు ఉద్యోగాలు చేసుకునే ఇచ్ఛాపూర్వక పార్ట్ టైం ఆచార్యులు కాదు. యూనివర్సిటీలలోనే పూర్తి సమయం కేటాయిస్తూ, సమస్త పనులు నిర్వహిస్తూ కూడా యాజమాన్యం చేత ఉద్దేశపూర్వకంగా పార్ట్ టైం ఆచార్యులుగా పిలువబడుతున్న పీడితులు.

విషయాన్ని సంక్షిప్తంగా అర్థం చేసుకోవాలంటే.. 12 యూనివర్సిటీలకు కలిపి మంజూరైన సహాయ ఆచార్యుల పోస్టులు 1524. అయితే కేవలం 463 మంది మాత్రమే నియమించబడగా, 1061 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీ పోస్టులతో విద్యాబోధన, పరిశోధన యూనివర్సిటీలలో సమగ్రంగా జరగదు, కాబట్టి కాంట్రాక్టు పద్ధతిన సహాయ ఆచార్యులను తీసుకొచ్చారు. వీరికి వారానికి 16 గంటల బోధన చేయాలనే నిబంధన పెట్టి, ప్రతి నెలా జీతం ఇస్తున్నారు. నిజానికి శాశ్వత సహాయ ఆచార్యుని జీతంలో 30 నుంచి 40 శాతం కూడా వీరి జీతం ఉండదు.



తెలంగాణ ఉద్యమ సమయంలో కాంట్రాక్టు ఉద్యోగ వ్యవస్థలేని తెలంగాణ ఏర్పాటు లక్ష్యంగా పని చేస్తానని కేసీఆర్ చెప్పారు. విద్యార్థి ఉద్యమ ఫలితంగా కావలసిన బోధన కోసం పూర్తి మొత్తంలో కాంట్రాక్టు పద్ధతిన తీసుకునే క్రమంలో 2014లో నూతనంగా ఏర్పాటైన కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ఒక సర్క్యులర్ విడుదల చేసింది. ఫలితంగా కాంట్రాక్టు వ్యవస్థ కంటే దారుణమైన ఈ పార్ట్ టైం ఆచార్య వ్యవస్థ ఇక్కడ నుంచి అధికమైంది. వీరికి ఒక గంటకు 700 రూపాయలు చెల్లిస్తారు. సెలవు రోజులు వచ్చినా, పరీక్షలు జరుగుతున్న జీతం చెల్లించరు. సంవత్సరానికి 6 నెలలు మాత్రమే ఉద్యోగం. శాశ్వత సహాయ ఆచార్యులతో సమానమైన విద్యార్హతలు ఉన్నా, వారు చేసే పనులన్నీ చేస్తున్నా యూనివర్సిటీ యాజమాన్యాల నుంచి అవమానాలు లెక్కలేనన్ని ఉన్నాయి. 2023 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పార్ట్ టైం ఆచార్యులకు భద్రతతో కూడిన స్థిరమైన వేతనం చెల్లిస్తామని మాట ఇచ్చి, మ్యానిఫెస్టోలో కూడా పెట్టింది. అధికారంలోకి వచ్చారు, కనుక మాట తప్పరని కోటి ఆశలతో ఉన్న పార్ట్ టైం ఆచార్యుల గుండెల్లో పిడుగు లాంటి మార్గదర్శకాలను జీవో నెంబర్ 21 ద్వారా తీసుకొచ్చారు. వాటిని నిశితంగా పరిశీలిద్దాం.

1) బోధన అనుభవానికి గరిష్ఠంగా 10 మార్కులు పొందుపర్చారు. ప్రతి సంవత్సరానికి ఒక్క మార్కు చొప్పున కేటాయించారు. దీనికి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, పీజీ కాలేజ్ శాశ్వత సహాయ ఆచార్యులతో పాటు యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులకు కూడా అర్హత ఇచ్చారు. చివరికి రాటిఫికేషన్ జరిగిన ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీ అధ్యాపకులకు కూడా అర్హత ఇచ్చారు. కానీ యూనివర్సిటీల పార్ట్ టైం సహాయ ఆచార్యులకు అవకాశం లేదు. యూనివర్సిటీ యాజమాన్యం రాటిఫికేషన్ చేయని కారణంగా పార్ట్ టైం సహాయ ఆచార్యులు అవకాశం కోల్పోతున్నారు.

2) ఒక అధ్యాపకుడికి ప్రథమ ఆయుధాలు కంఠస్వరం, ఆకర్షించబడే బోధన. వీటితోనే ఉత్తమ బోధన, అత్యుత్తమ ఫలితాలు అందించగలుగుతారు. కానీ ఇక్కడ అధ్యాపకుడి బోధన సామర్థ్యం గుర్తించే డెమోకు కేవలం 10 మార్కులు మాత్రమే కేటాయించారు. ఇది ఎంతవరకు సమర్థనీయం?

3) జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (JRF) వచ్చిన వారికి పది మార్కులు కల్పించారు. అలాగే డాక్టరేట్ సాధించినా 10 మార్కులే అని ఉంది. ఇటీవల కాలంలో ఖాళీలు భర్తీ చేసిన కేంద్ర యూనివర్సిటీలలో కూడా పీహెచ్‌డీకి అత్యధికంగా 25 నుంచి 30 మార్కులు కేటాయించారు. 2018 యూజీసీ మార్గదర్శకాలల్లో కూడా పీహెచ్‌డీకి 30 మార్కులు ఇవ్వాలని ఉంది. కానీ ఈ మార్గదర్శకాలల్లో కేవలం పీహెచ్‌డీకి 10 మార్కులు కేటాయించడం సమంజసమేనా? పీహెచ్‌డీ చదువుతున్నప్పుడు JRF మాత్రమే కాకుండా RGNF ద్వారా, ICSSR ద్వారా, మెరిటోరియల్ ఫెలోషిప్ ద్వారా ఆర్థిక సహాయం పొందిన వారికి ఎటువంటి మార్కులు పొందుపరచలేదు. ఈ అన్యాయం ఎందుకు?

4) యూజీ, పీజీలలో పొందిన మార్కులకు 20 మార్కుల వెయిటేజ్‌ను ఇచ్చారు. 15 సంవత్సరాల వయసు తేడా ఉన్న పోటీదారుల మధ్య ఇది మరింత వ్యత్యాసం చూపనున్నది. దాదాపు 15–20 సంవత్సరాల క్రితం డిగ్రీ, పీజీ పాసవడమే గగనమయ్యేది. గూగుల్ ప్లాట్ ఫామ్ వేదిక మీద నిలబడిన నేటి విద్యార్థికి, నాటి విద్యార్థికి ఒకే తూకం వేసి చూడడం అవమానకరం. ఇకపోతే జాతీయ, అంతర్జాతీయ నిధులు సమకూర్చిన ఏజెన్సీలు, సంస్థలలో పీహెచ్‌డీ అనంతరం పనిచేసిన వారికి 5 మార్కులు కేటాయించిన ఉద్దేశం అసలు అంతుపట్టడం లేదు.

అరకొర జీతంతో, పస్తులు ఉంటూ యూనివర్సిటీ బోధన బాధ్యతలను భుజానికి ఎత్తుకొని నడిచిన పార్ట్ టైం సహాయ ఆచార్యులను బజారున పడేసే విధంగా ఈ మార్గదర్శకాలు ఉన్నాయి. దాదాపు పదిహేనేళ్ల నుంచి పార్ట్ టైం అధ్యాపకులుగా భవిష్యత్తు మీద వీరు ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నారు. అట్టడుగున ఉండి నలిగిన వారికి భరోసా ఇవ్వకపోతే అది ప్రజాపాలన అనిపించుకోదు. వెట్టిచాకిరి చేసి సర్వం కోల్పోయిన వారిని ముందుకు నడిపించడమే సుభిక్ష పాలనవుతుంది. ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు మార్చాలని, పార్ట్ టైం సహాయ ఆచార్యులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

◆ డాక్టర్ దుబ్బ రంజిత్
ఉస్మానియా యూనివర్సిటీ

'బిరుదురాజు' శతజయంతి సదస్సు

కవి, పరిశోధకుడు, అనువాద రచయిత, సంపాదకుడుగా ప్రసిద్ధి చెందిన ఆచార్య బిరుదురాజు రామరాజు తెలుగు సాహిత్యానికి చేసిన కృషి అనన్య సామాన్యమైనది. ఆయన జానపద సాహిత్యానికి ఒక శాస్త్రీయమైన గుర్తింపు తీసుకువచ్చారు. ప్రాచీన సాహిత్యాన్ని నూతన కోణంలో ఆవిష్కరించారు. ఎంతోమంది విద్యార్థులను రచయితలుగా, విమర్శకులుగా తీర్చిదిద్దారు. ఆయన శతజయంతి సందర్భంగా 'ఆచార్య బిరుదురాజు రామరాజు సాహితీ సమాలోచనం' అనే పేరుతో రెండు రోజుల జాతీయ సదస్సును ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ, తెలంగాణ ఉన్నత విద్యా మండలి, తెలంగాణ భాష–సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 10, 11 తేదీలలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల రూమ్ నెంబర్ 133 ఆ సదస్సునకు వేదిక. ఆచార్య సాగి కమలాకరశర్మ–అధ్యక్షులుగా, డా. ఎస్.రఘు–కన్వీనర్‌గా, ప్రొఫెసర్ సి.కాశీం, డా. ఏలె విజయలక్ష్మి, డా. ఓ.కృష్ణయ్య, డా. వేల్పుల కుమారస్వామి, డా. ఇ. మహేందర్ సదస్సు నిర్వహణలో పాల్గొంటారు. సదస్సులో పరిశోధనపత్రాల సమర్పణతో పాటు తెలుగు సాహిత్యంలో రామరాజు పాత్ర, వారి సాహిత్యసేవపై ప్రసంగాలు ఉంటాయి.

– పల్లె సతీష్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి
ప్లాట్–76, అశ్వినీ లేఔట్, హుడా హైట్స్
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

బీళ్లకు మళ్లని 'సీతారామ' జలాలు


తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టు తర్వాత రెండో అతిపెద్ద ప్రాజెక్టుగా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (ఎస్ఎల్ఐఎస్) గుర్తింపు పొందింది. తొమ్మిదేళ్ల క్రితం కేసీఆర్ దీనికి శంకుస్థాపన చేశారు. గోదావరి నుంచి 67 టీఎంసీల నీటిని ఎత్తిపోయడం ద్వారా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో సుమారు 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనేది సంకల్పం. అయితే డిజైన్లను, డీపీఆర్‌లను మార్చి, ప్రజలను ఏమార్చి ప్రాజెక్టు లక్ష్యానికి విరుద్ధంగా నీటిని తరలించుకుపోతున్న తీరు ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా– ప్రస్తుత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో నిర్మాణంలో ఉన్న ఈ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో తెలియదుగానీ, రాజకీయ, ప్రజా ఉద్యమాలకు మాత్రం ఆజ్యం పోస్తోంది.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్‌పి) ఎడమ కాలువ ద్వారా ఇప్పటికే ఖమ్మం జిల్లాలో దాదాపు 3 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. సూర్యాపేట నుంచి పాలేరు వరకు జోన్–1లో 50 వేల ఎకరాలు, పాలేరు నుంచి కల్లూరు వరకు జోన్–2లో 2.50 లక్షల ఎకరాలకు రెండు పంటలకు నీరు అందుతోంది. ఇదంతా కృష్ణా బేసిన్ పరిధిలోకి వస్తుంది. సాగర్ నీరుతో ప్రస్తుత ఖమ్మం జిల్లాలో 70శాతం భూములు సస్యశ్యామలంగా మారాయి. కానీ చెంతనే ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గోదావరి బేసిన్‌లో ఉండటంతో సాగర్ నీరు అందే అవకాశం లేకుండా పోయింది. ఈ క్రమంలోనే అప్పటి వైఎస్ ప్రభుత్వం గోదావరి జలాలపై దృష్టి పెట్టింది. సాగర్‌యేతర ఆయకట్టుకు సాగునీరు అందించడానికి దుమ్ముగూడెం వద్ద రాజీవ్‌సాగర్, రుద్రంకోట వద్ద ఇందిరాసాగర్ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. మొత్తం 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనేది అప్పుడు లక్ష్యం.

అయితే ఆ తర్వాత రాష్ట్ర విభజన జరిగి తెలంగాణ ఏర్పడగా, అదే క్రమంలో ఉమ్మడి ఖమ్మంలోని ఏడు మండలాలు ఏపీలోని పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలో కలిసిపోయాయి. ఇందిరాసాగర్ తలపెట్టిన ప్రాంతం విలీన మండలాల్లో ఉండటంతో రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులను కలిపి, కొత్త ప్రాజెక్టుగా డిజైన్ చేసి 'సీతారామ ఎత్తిపోతల పథకం'గా కేసీఆర్ ప్రభుత్వం తెర మీదకు తీసుకువచ్చింది. దీని ద్వారా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో 4,15,621 ఎకరాలకు సాగునీరు అందించడం, మరో 3,89,366 ఎకరాలను స్థిరీకరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.7,926 కోట్ల అంచనా వ్యయంతో (ఇప్పుడు రూ.20 వేల కోట్లకు పెరిగింది) పరిపాలన అనుమతి ఇచ్చి కేసీఆర్ 2016 ఫిబ్రవరి 16న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని టేకులపల్లి మండలం రోళ్లపాడు చెరువు వద్ద శంకుస్థాపన చేశారు. అలాగే దుమ్ముగూడెం వద్ద గోదావరి నదిపై కాటన్ నిర్మించిన ఆనకట్టకు దిగువన 67 టీఎంసీల సామర్థ్యంతో సీతమ్మసాగర్ బ్యారేజిని ఏర్పాటు చేసి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీరు పంపింగ్ చేసేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. గోదావరి నుంచి నీటిని లిఫ్ట్ చేసి రోళ్లపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా ఫేజ్–1 కింద భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో కొత్త ఆయకట్టుకు సాగునీరు ఇచ్చి, ఆ తర్వాత ఫేజ్–2 కింద ఖమ్మం జిల్లా పరిధిలోని సాగర్ ఆయకట్టును స్థిరీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

2016లో ప్రాజెక్టు పనులు ప్రారంభం కాగా, 2018 వచ్చేసరికి సీన్ మారిపోయింది. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు గోదావరి జలాలను అందించే ఫేజ్–1 డిజైన్ పక్కకు పోయి, ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు తరలించే పనులు తెర మీదకు వచ్చాయి. పంప్‌హౌజ్‌లు, మెయిన్ కెనాల్ నిర్మాణ పనులు ఆ దిశగానే కొనసాగాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గోదావరి–కృష్ణా జలాల అనుసంధానం అనే పేరుతో మొదటి ప్రాధాన్యంగా ఏన్కూరు (రాజీవ్) లింక్ కెనాల్‌పై దృష్టి పెట్టి ఆగమేఘాలపై పూర్తి చేశారు. మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, పాల్వంచ, కొత్తగూడెం, ములకలపల్లి, జూలూరుపాడు మీదుగా ఏన్కూరు లింక్ కెనాల్‌కు తరలించి వైరా రిజర్వాయర్‌ను నింపేందుకు; అలాగే కామేపల్లి, కారేపల్లి, గార్ల, డోర్నకల్, తిరుమలాయపాలెం మీదుగా పాలేరు రిజర్వాయర్‌ను నింపేందుకు పనులు జోరందుకున్నాయి. ఈ

భద్రాద్రి జిల్లాలో సీతారామ కెనాల్‌కు అనుబంధంగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మిస్తే ఆ ప్రాంతంలో వేలాది ఎకరాలు సస్యశ్యామలం అవుతాయి. కానీ, వాటిని పట్టించుకోకుండా ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టును స్థిరీకరించడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. తమ భూముల గుండా గోదావరి జలాలను తరలిస్తూ.. తమకు చుక్కనీరు ఇవ్వకపోవడం సహజ న్యాయానికి విరుద్ధం కాదా.. అని భద్రాద్రి జిల్లా రైతాంగం ప్రశ్నిస్తోంది.



రెండు రిజర్వాయర్‌లు కృష్ణా బేసిన్ పరిధిలో ఉంటాయి. ఏన్కూరు లింక్ కెనాల్‌తో వైరా ఆయకట్టు స్థిరీకరణకు మార్గం ఏర్పడింది. అలాగే పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి జలాలను తరలించే కాలువ పనులను, సత్తుపల్లి ట్రంక్ మెయిన్ కాలువ పనులను వడివడిగా పూర్తి చేయిస్తున్నారు. ఇవి పూర్తయితే సంపూర్ణంగా సాగర్ ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. తద్వారా సాగర్ నుంచి కృష్ణా జలాలు విడుదల కాకున్నా, సీతారామ ద్వారా గోదావరి జలాలను తరలించి పంటలను సాగు చేసుకోవచ్చు.


సీతారామ ప్రాజెక్టులో దుమ్ముగూడెం నుంచి గోదావరి జలాలను తరలించడానికి అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు, ములకలపల్లి మండలం పూసుగూడెం, కమలాపురం వద్ద వరుసగా పంప్‌హౌజ్‌లను ఏర్పాటుచేశారు. దుమ్ముగూడెం నుంచి మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, పాల్వంచ, కొత్తగూడెం, ములకలపల్లి, జూలూరుపాడు మండలాల మీదుగా తవ్విన మెయిన్ కెనాల్. సింగరేణి మండలంలో చీమలపాడు వద్ద ప్రతిపాదిత రోళ్లపాడు చెరువు వైపు మళ్లాలి. రోళ్లపాడును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ప్రతిపాదించారు. ఇక్కడి నుంచి పలు పంప్‌హౌజ్‌ల ద్వారా భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లోని సుమారు 4,15,621 ఎకరాలకు సాగునీరు అందించాలనేది లక్ష్యం.

కానీ, ఇక్కడే కథ అడ్డం తిరిగింది. మెయిన్ కెనాల్‌ను రోళ్లపాడు వైపు కాకుండా, పాలేరు లింక్ కెనాల్ వైపు తీసుకువెళ్లారు. దీంతో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా బీడు భూములకు చుక్క నీరు అందకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. రోళ్లపాడు వైపు అటవీశాఖ భూములు, గుట్టలు, కొండలు ఉన్నాయని, పనులు జాప్యం అవుతాయనే సాకుతో... కాలువ తవ్వకం, పంప్‌హౌజ్‌ల నిర్మాణ పనులను ఉపేక్షించారు.

దుమ్ముగూడెం నుంచి గోదావరి జలాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని 104 కి.మీ. పొడవైన మెయిన్ కెనాల్ ద్వారా ప్రవహించి ఏన్కూరు లింక్ కెనాల్‌లో కలుస్తున్నాయి. మెయిన్ కాలువ కోసం ప్రభుత్వం వేలాది ఎకరాలను రైతుల నుంచి సేకరించింది. తమ భూముల గుండా గోదావరి జలాలను తరలిస్తూ.. తమకు చుక్కనీరు ఇవ్వకపోవడం సహజ న్యాయానికి విరుద్ధం కాదా.. అని భద్రాద్రి జిల్లా రైతాంగం ప్రశ్నిస్తోంది. ప్రాజెక్టుపై ఇప్పటివరకు ఖర్చు చేసిన రూ.10వేల కోట్లతో ఎవరికి మేలు జరిగిందని వారు నిలదీస్తున్నారు. భద్రాద్రి జిల్లా బీళ్లు తెలంగాణలో భాగం కాదా.. అని వారు ప్రశ్నిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 104 కి.మీ. ప్రవహిస్తున్న సీతారామ కెనాల్‌కు అనుబంధంగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మిస్తే ఆ ప్రాంతంలో వేలాది ఎకరాలు సస్యశ్యామలం అవుతాయి. కానీ, వాటిని పట్టించుకోకుండా ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టును స్థిరీకరించడానికే ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు వెంపర్లాడటం సమర్థనీయం కాదు.

భద్రాద్రి జిల్లాలో బలమైన రాజకీయ నాయకత్వం లేకపోవడం ఈ సమస్యకు కారణం. కేసీఆర్ అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేళ్లలో భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు.. సీతారామ ప్రాజెక్టు విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ మిన్నకుండిపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు అఖిలపక్షంగా ఏర్పడి సీతారామ జలాల కోసం పోరాటం ప్రారంభించారు. ఈ అంశం ఇప్పుడు అన్ని పార్టీల ఎజెండాగా మారింది. ఇటీవల అఖిలపక్షం నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పిస్తే... పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ, అది ఆచరణలోకి వచ్చే వరకు భద్రాద్రి, మహబూబాబాద్ ప్రాంత రైతాంగం– తలాపున ప్రవహిస్తున్న గోదావరిని చూస్తూ బాధపడక తప్పదు.

■ శంకర్‌రావు శెంకేసి
సీనియర్ జర్నలిస్టు



బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.9 కనిష్ఠం 23.4

9 ఏళ్లుగా పరి'హాసం'!



కొత్తపల్లి పాండు

దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుడు ఘటనలో

పాండుకు అందని పరిహారం.. తిరిగి తిరిగి అలసిపోయిన బాధితుడు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల ఘటనపై ఏ1 మిర్చి సెంటర్ పూర్తిగా ధ్వంసమైంది. ఏడాది పాటు మూత పడింది. దీంతో ఆ మిర్చి సెంటర్‌పై ఆధారపడిన నిర్వాహకుడు కొత్తపల్లి పాండు ఆర్థికపరంగా తీవ్రంగా నష్టపోయారు. బాంబు పేలుళ్ల ఘటనపై విచారణ చేపట్టిన ఎన్‌ఐఏ ప్రత్యేక కోర్టు నిందితులకు ఉరిశిక్ష విధిస్తూ 2016లో తీర్పునిచ్చింది. అదే సందర్భంలో పేలుడు కారణంగా నష్టపోయిన దిల్‌సుఖ్‌నగర్‌లోని ఏ1 మిర్చి సెంటర్‌కు లక్ష రూపాయల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది.

లక్ష పరిహారం కాగితంపైనే..

పరిహారంగా రూ.లక్ష ఇవ్వాలంటూ కోర్టు ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను తాను కాగితంలోనే చూశానని, అది తనకు పరిహాసంగానే మిగిలిపోయిందని పాండు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌ఐఏ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ హైకోర్టు తాజాగా నిందితులకు ఉరిశిక్ష ఖరారు చేయడంతో లక్ష రూపాయల పరిహారం అందిందా అని 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా బాధితుడు పై విధంగా స్పందించాడు.

కోర్టు తీర్పు కాపీతో తిరిగినా..

కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకటన కాపీతో పాండు అప్పట్లో ఎన్‌ఐఏ కోర్టును ఆశ్రయిస్తే రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లాలని అధికారులు తెలిపారు. అక్కడి నుంచి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు వస్తే రంగారెడ్డి జిల్లా కోర్టుకు వెళ్లాలని పంపించారు. అలా ఎవరికి వారు అక్కడ, ఇక్కడ తిప్పుతుండడంతో అలసిపోయి ఇక ఆ ప్రయత్నాలు ఆపేశానని పాండు తెలిపారు.





పక్షుల సవ్వడి

మహా నగరంలోని అమీన్‌పూర్ లేక్ వద్ద పక్షులు సందడి చేస్తున్నాయి. చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వీటిని తమ కెమెరాల్లో బంధించేందుకు పర్యావరణ ప్రేమికులు ఆసక్తి చూపుతున్నారు.

- ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

నల్లాకు మోటర్ బిగిస్తే కనెక్షన్ కట్



రూ.5 వేలు జరిమానా కూడా..

సప్లయ్ సమయంలో లైన్ల వారీగా తనిఖీలు

రంగంలోకి లైన్‌మెన్ నుంచి ఎండీ వరకు

ఈనెల 15 నుంచి వాటర్‌బోర్డు స్పెషల్ డ్రైవ్

టార్గెట్ 'మోటర్ ఫ్రీ టాప్ వాటర్'

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): తాగునీటిని సరఫరా చేసే నల్లాకు ఎవరైనా మోటార్ బిగిస్తే, రూ.5 వేలు జరిమానా విధించనున్నట్లు వాటర్‌బోర్డు ప్రకటించింది. ఈనెల 15వ తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ మేరకు నీటి సరఫరా సమయంలో లైన్‌మన్ నుంచి మేనేజింగ్ డైరెక్టర్ల వరకు తనిఖీలు చేయనున్నారు. నల్లాకు మోటార్ బిగిస్తే వెంటనే సీజ్ చేయడంతో పాటు నీటి కనెక్షన్ కట్ చేయనున్నారు. నగరంలో లోప్రెషర్‌తో నగరవాసులు పడుతున్న ఇబ్బందులపై 'నీళ్లు సరిపోతాలేవ్' అనే శీర్షికతో ఈ నెల 6న, చైనా మోటర్లతో 'నీళ్లు లాగేస్తున్నారు' అంటూ ఫిబ్రవరి 22న ఆంధ్రజ్యోతి కథనాలను ప్రచురించింది. దీనికి స్పందించిన వాటర్‌బోర్డు టార్గెట్ 'మోటర్ ఫ్రీ టాప్ వాటర్' కార్యాచరణ పేరుతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టనుంది.



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం క్లిప్పింగ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

థర్డ్ పార్టీ ద్వారా ఆరా

కొందరు నల్లాలకు మోటర్లు బిగిస్తున్నారు. దీంతో మోటర్ ఉన్నవారికి హైప్రెషర్‌తో సమృద్ధిగా, మోటరు లేని 40 శాతం

మిగతా 6వ పేజీలో..

నల్లాకు మోటర్ బిగించడం నేరం



అందరికీ నీరు సమపాళ్లలో పంపిణీ కావాలి. కొన్ని ప్రాంతాల్లో వినియోగదారులు నల్లాలకు అక్రమంగా మోటర్లు బిగిస్తున్నారు. ఇది చట్టరీత్యా నేరం. తక్కువ ప్రెషర్‌తో నీరు సరఫరా అయినా, నీటి సరఫరాలో ఇతర సమస్యలు తలెత్తినా సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలి. లేదా వాటర్‌బోర్డు కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

- వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి

ఎక్కడివక్కడే!

ఎస్ఆర్‌డీపీ పనుల్లో కనిపించని పురోగతి

- నత్త నవ్విపోయేలా సా..గుతున్న వైనం
- ఆస్తుల సేకరణలో జాప్యం.. నిధుల కొరత కారణం
- ఉన్నతస్థాయి పర్యవేక్షణ లేకపోవడం కూడా..
- కొన్ని ప్రాజెక్టుల పురోగతి 50శాతం మాత్రమే
- శిల్ప లే అవుట్ వద్ద మరో రెండు ఆస్తులు సేకరిస్తేనే..



కొనసాగుతూ ఉన్న శిల్ప లే అవుట్ రెండో లెవల్ వంతెన పనులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ)లో భాగంగా పలు ప్రాంతాల్లో వంతెనలు, రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ)ల పనులు దాదాపుగా పడకేశాయి. ఆస్తుల సేకరణలో జాప్యం, నిధుల కొరత, ఉన్నతస్థాయి సమీక్షలు లేకపోవడం, ఇంజనీరింగ్ విభాగం నిర్లక్ష్యంతో పనులు సాగడం లేదు. గత ఆగస్టులో అందుబాటులోకి రావాల్సిన శిల్ప లే అవుట్ రెండో లెవల్ వంతెన పనులు ఇంకా సాగుతున్నాయి. మరో నెలన్నర నుంచి రెండు నెలలైతే కానీ అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదు. నల్గొండ ఎక్స్‌రోడ్, శాస్త్రిపురం, ఫలక్‌నుమా, ఉప్పల్ ఎక్స్‌టెన్షన్ వంతెన పనులూ నత్త నవ్విపోయేలా సాగుతున్నాయి. పనుల్లో ఆలస్యం నేపథ్యంలో ప్రాజెక్టుల విభాగం పనితీరుపై కమిషనర్ ఇలంబరిది ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పాత ప్రాజెక్టుల పనులు పూర్తి చేయడంలోనే ఇన్ని ఇబ్బందులుంటే, హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ) ప్రాజెక్టుల ఆస్తుల సేకరణ, పనులు పూర్తి చేయడం ఎలా అని ఉన్నతాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.275 కోట్లతో..

కొండాపూర్, హఫీజ్‌పేట, మాదాపూర్ వైపు నుంచి ఔటర్, అంతర్జాతీయ విమానాశ్రయం వెళ్లేందుకు వీలుగా గచ్చిబౌలి చౌరస్తాలో రూ.275 కోట్లతో శిల్ప లే అవుట్ రెండో లెవల్ వంతెన నిర్మిస్తున్నారు. 2022లో పనులు ప్రారంభం కాగా, డిసెంబరు 2023 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వంతెనకు

మిగతా 6వ పేజీలో..

ఐదేళ్లు.. 53 శాతం పనులు..

నల్గొండ ఎక్స్‌రోడ్ నుంచి ఓవైసీ ఆస్పత్రి వరకు ప్రతిపాదించిన స్టీల్ వంతెన పనుల్లో వేగం గణనీయంగా తగ్గింది. 2.5 కి.మీల మేర నాలుగు లేన్లుగా రూ.523.37 కోట్లతో 2020లో పనులకు శంకుస్థాపన చేయగా, ఐదేళ్లలో 53 శాతం మేర మాత్రమే పనులు జరిగాయి. దీర్ఘకాలంగా పనులు సాగడం, స్టీల్ ధరల పెరుగుదలతో నిర్మాణ వ్యయమూ రూ.620 కోట్లకు పెరిగింది. 149 ఆస్తులకుగాను 126 సేకరించారు. మరో 23 ఆస్తులు సేకరణ పెండింగ్‌లో ఉంది. కోర్టు కేసులు, స్థల వివాదాలు, మతపరమైన కట్టడాలు ఉండడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

2020లో కురిసిన భారీ వర్షాలకు ఫలక్‌నుమా ఆర్ఓబీ పాడైంది. కొన్నాళ్లపాటు ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేసిన అధికారులు ఆధునికీకరణ పనులు పూర్తి చేశారు. రెండు లేన్లుగా మాత్రమే బ్రిడ్జి ఉండడం, ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండడంతో సమాంతరంగా మరో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. రూ.47 కోట్లతో రెండు లేన్లుగా ప్రతిపాదించిన ఆర్ఓబీ పనులు

ఫలక్‌నుమా ఆర్ఓబీ.. 50 శాతంలోపే?

2022లో మొదలు పెట్టారు. గత జూన్‌లో అందుబాటులోకి వస్తుందని భావించినా, ఇంకా పనులు పూర్తవలేదు. మిగిలిన పనులు చేసేందుకు రెండు నెలల సమయం పడుతుందని ఓ అధికారి తెలిపారు. దాదాపు 75 శాతం పనులు జరిగాయని పేర్కొన్నారు.



ఫలక్‌నుమా ఆర్ఓబీ



11 శాతానికి పైగా..

గ్రేటర్‌లో ఆహార కల్తీ

2021 నుంచి 2023 వరకు గుర్తించిన లెక్కల ప్రకారం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో ఆహార కల్తీ పెరుగుతోంది. ప్యాకింగ్ ఫుడ్ నుంచి వండి వడ్డించే ఆహారం వరకు అన్నింటా ఉల్లంఘనలు జరుగుతున్నట్టు జీహెచ్ఎంసీ గణాంకాలు చెబుతున్నాయి. 2021 నుంచి 2023 వరకు సేకరించిన నమూనాల్లో 11 శాతానికిపైగా, 2024లో మాత్రం 4 శాతానికిపైగా ఉల్లంఘనలు జరిగినట్టు తేలింది. ఎక్కువగా హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి సేకరించిన నమూనాలను పరీక్షల నిమిత్తం నాచారంలోని లేబొరేటరీకి పంపారు. చికెన్, మటన్ దుకాణాల్లో నిల్వ ఉంచిన చికెన్, మటన్, బేకరీల్లోని పలు పదార్థాలూ పాడైనట్టు గుర్తించారు. ఆహార కల్తీలో దక్షిణ భారత రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచినట్టు కేంద్ర మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. ఆ ప్రకారం రాష్ట్రంలో 15% ఆహార కల్తీ జరుగుతున్నట్టు నివేదికలు చెబుతుండగా, గ్రేటర్‌లో అది 11 నుంచి 12 శాతంగా ఉంది.

నాలుగేళ్లలో 56 వేలకుపైగా తనిఖీలు

నమూనాల సేకరణ అంతంతే..

నాలుగేళ్లలో 56,719 తనిఖీలు నిర్వహించిన ఫుడ్ సేఫ్టీ అధికారులు కేవలం 8,109 నమూనాలు సేకరించారు. ఇందులో 765 ఉల్లంఘనలు జరిగినట్టు గుర్తించారు. 10,578 సంస్థలకు నోటీసులు ఇచ్చారు. కొన్ని ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార విక్రయ సంస్థలతో సత్సంబంధాలు కొనసాగించే అధికారులు, వాటిలో నమూనాల సేకరణకు ఆసక్తి చూపలేదన్న ఫిర్యాదులున్నాయి. అలాగే మెజార్టీ తనిఖీల్లో ఉల్లంఘనలు ఉన్నట్టు గుర్తించినా, నమూనాలు సేకరించకుండా కేవలం నోటీసుల జారీతో సరిపెడుతున్నట్టు సమాచారం.

ఇదీ లెక్క...

వివరాలు	2021	2022	2023	2024
ఆహార తనిఖీలు	12,375	17,209	14,889	12,246
నోటీసులు ఇచ్చినవి	926	3,962	3,803	1,887
సేకరించిన నమూనాలు	978	2,322	2,534	2,275
ఉల్లంఘనలు	126	264	280	95
విధించిన జరిమానా (రూ.)	18,16,500	36,99,400	16,83,000	30,60,003



జేఎన్‌టీయూలో విభాగాధిపతులకు

స్థానచలనం

కొత్త హెచ్ఓడీల నియామకం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాలేజీలో నాలుగు ఇంజనీరింగ్ విభాగాలకు కొత్త అధిపతులను నియమిస్తూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్లకు పైగా సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా కొనసాగుతున్న ప్రొఫెసర్ డీస్‌కుమార్‌ను ఆ బాధ్యతల నుంచి తొలగించి, ఆయన స్థానంలో సీనియర్ ప్రొఫెసర్ ఎం.జనార్ధన్ యాదవ్‌ను నియమించారు. అలాగే, ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతిగా ఉన్న ప్రొఫెసర్ ఏ.రజని స్థానంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.మాధవీకుమారిని నియమించారు. మెటలర్జికల్ విభాగాధిపతిగా ప్రొఫెసర్ దేవకిరాణి నియమితులవగా, ఆ స్థానం నుంచి ప్రొఫెసర్ రమేశ్‌చంద్రను రిలీవ్ చేశారు. మరోవైపు జగిత్యాల జేఎన్‌టీయూ కాలేజీ నుంచి హైదరాబాద్ కాలేజీలో డిప్యుటేషన్‌పై

మిగతా 6వ పేజీలో..

మహిళల భద్రతకు 'టీ సేఫ్'

ఉబెర్, సేఫ్‌గాడీతో సమగ్ర సేవలు

ఇలాంటి టెక్నాలజీ దేశంలోనే మొదటిది : శిఖాగోయల్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు 'టీ సేఫ్' యాప్ భరోసా కల్పిస్తుందని, ఒంటరిగా ప్రయాణించే మహిళలు గమ్యస్థానాలు చేరేంత వరకు ఉబెర్, సేఫ్ గాడీ పేరుతో సమగ్ర సేవలు అందుబాటులోకి తెచ్చామని మహిళా భద్రతా విభాగం డీజీ శిఖాగోయల్ వెల్లడించారు. టీ సేఫ్ యాప్ ప్రారంభించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా అమీర్‌పేట్ మెట్రోస్టేషన్ వద్ద బుధవారం సక్సెస్ మీట్ నిర్వహించారు. హైదరాబాద్ మెట్రో రైల్ సెక్యూరిటీ మేనేజర్ బాలకృష్ణ, ఉబెర్, సేఫ్‌గాడి ప్రతినిధులతో కలిసి క్యాబ్స్‌లో టీ సేఫ్ యాప్, క్యూఆర్ కోడ్‌ను అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా శిఖాగోయల్ మాట్లాడుతూ మహిళా భద్రతకు భరోసా కల్పించే విధంగా ఈ తరహా టెక్నాలజీని వినియోగిస్తున్న దేశంలోనే మొదటి రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ఉబెర్ ఎస్ఓఎస్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని లోకేషన్లు, ప్రయాణించే వారి వివరాలు సహా అత్యవసర సమయంలో స్పందించేందుకు స్థానిక పోలీసుల సమాచారం మహిళలకు చేరుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో ఓలా, ర్యాపిడో, మనయాత్ర, అబిబస్ సహా అన్ని ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీలను టీ సేఫ్ యాప్‌తో ఇంటిగ్రేట్ చేస్తామని తెలిపారు.



క్యూఆర్ కోడ్ బ్రోచర్స్‌ను ఆవిష్కరిస్తున్న మహిళా భద్రతా విభాగం బృందం



ఇవ్వాల్సిందే.. మేం ఇవ్వం!

గ్యాస్ సిలిండర్ ధరపై వాదోపవాదాలు

పెరగక ముందు నాటి ధర ప్రకారం ఆన్‌లైన్‌లో చెల్లింపులు

డెలివరీ వేళలో పెరిగిన రుసుం చెల్లించాలంటున్న సిబ్బంది

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెరిగిన గ్యాస్ సిలిండర్ల ధరలు, బిల్లుల చెల్లింపు విషయంలో సిబ్బంది, వినియోగదారుల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆన్‌లైన్‌లో ఉన్న ధర ప్రకారం చెల్లింపులు చేసినా, డెలివరీ సమయంలో తాజాగా పెరిగిన రూ.50 కూడా చెల్లించాలని సిబ్బంది పట్టుబడుతుండడం వివాదానికి దారి తీస్తోంది. గ్రేటర్ పరిధిలో లక్షలాది మంది గ్యాస్ వినియోగదారులు ఆన్‌లైన్‌లోనే గ్యాస్ బుకింగ్, చెల్లింపులు చేస్తుంటారు. కాగా, ఈనెల 7న కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ పెరుగుదల ఏప్రిల్ 7 అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చింది. 8వ తేదీ నుంచి డెలివరీ చేస్తున్న సిలిండర్లకు పెరిగిన ధరను అమలు చేస్తున్నామని డీలర్లు పేర్కొంటున్నారు. అయితే 8వ తేదీకి ముందే కొందరు గ్యాస్ బుక్ చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో ఉన్న ధర ప్రకారం డబ్బు చెల్లించారు. రెండు రోజుల తర్వాత సిలిండర్ డెలివరీ సమయంలో కొత్తగా పెరిగిన రూ.50 కూడా ఇవ్వాలని సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. బుకింగ్ సమయంలో ఉన్న ప్రకారం ధర చెల్లించామని, అప్పటికి పెంపు లేదు కాబట్టి కొత్త ధరతో తమకు సంబంధం లేదని వాదిస్తున్నారు. పెంచిన ధర చెల్లిస్తేనే డెలివరీ ఇస్తామని సిలిండర్ ఇవ్వకుండానే గ్యాస్ బాయ్స్ వెళ్లిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

హనుమాన్ విజయోత్సవ ర్యాలీకి

17 వేల మంది పోలీసులతో బందోబస్తు

- అనుమతి లేకుండా డ్రోన్లను వినియోగించొద్దు
- సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు
- సమీక్షా సమావేశంలో సీపీ సీవీ ఆనంద్

8

మార్ఫింగ్ ఫొటోలతో యువతికి వేధింపులు 6

క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు



ఉదయం నుంచే భానుడి ప్రతాపం

- వేడిగాలులు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- నగరంలో పగటి ఉష్ణోగ్రతలు 39.5 డిగ్రీలు
- నేడు గ్రేటర్ పరిధిలోని జిల్లాలకు ఎల్లో హెచ్చరిక

8

రూ.200తో ప్రారంభించి

రూ.3.56 లక్షలు లూటీ

పార్ట్‌టైం జాబ్ పేరుతో సైబర్ మోసం



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పార్ట్ టైం ఉద్యోగం పేరుతో నగరానికి చెందిన యువతికి సైబర్ నేరగాళ్లు టోకరా పెట్టారు. రిజిస్ట్రేషన్ చార్జీలంటూ రూ.200తో మొదలు పెట్టి రూ.3.56 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన యువతి (22) ఆన్‌లైన్‌లో పార్ట్‌టైం ఉద్యోగాల కోసం వెతికింది. వాట్సప్ ద్వారా సంప్రదించిన సైబర్ నేరగాళ్లు ఫ్లిప్ కార్ట్ ఇంటర్నెట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో గ్లోబల్ ఆన్‌లైన్ జాబ్‌లు ఉన్నాయని లింక్‌లు పంపారు. ఆమె వివరాలు నమోదు చేసింది. ఆ తర్వాత జాబ్ కావాలంటే రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని కోరగా, వారు సూచించిన ఖాతాకు డబ్బు పంపింది. అనంతరం బాధితురాలి ఖాతాలో రూ.100 జమ చేసిన సైబర్ నేరగాళ్లు, ఆన్‌లైన్‌లో జాబ్ చేయాలంటే ముందుగా కొంత పెట్టుబడి పెట్టాలని సూచించారు. బాధితురాలితో రూ.1000 పెట్టుబడి పెట్టించి, లాభం అంటూ రూ.250 ఆమె ఖాతాలో జమ చేశారు. పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడితే ఇంకా ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించిన సైబర్ నేరగాళ్లు పలు దఫాలుగా రూ.3.56 లక్షలు వసూలు చేశారు. భారీ లాభాలు వచ్చినట్లు యాప్‌లో లాభాలు చూపించారు. కానీ విత్‌డ్రా చేసుకోవాలంటే మరింత పెట్టుబడి పెట్టాలని డిమాండ్ చేయడంతో బాధితురాలు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాచిగూడ-హిస్సార్ మధ్య 22 స్పెషల్ రైళ్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కాచిగూడ-హిస్సార్ మధ్య 22 వేసవి ప్రత్యేకరైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. ఈ నెల 17 నుంచి జూన్ 26 వరకు ప్రతి గురువారం సాయంత్రం 4 గంటలకు కాచిగూడ నుంచి, ఈ నెల 20 నుంచి జూన్ 29వరకు ప్రతి ఆదివారం రాత్రి 10 గంటలకు ఈ ప్రత్యేకరైళ్లు బయలుదేరుతాయని సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లలో అన్నీ ఏసీ త్రీటైర్ కోచ్‌లే ఉంటాయని, మార్గమధ్యంలో మల్కాజిగిరి, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, ముద్కేడ్, నాందేడ్ తదితర స్టేషన్లలో ఆగుతాయని పేర్కొన్నారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి ప్రయాణికులకు రిజర్వేషన్ సదుపాయం అందుబాట్లో ఉంటుందని సీపీఆర్‌ఓ తెలిపారు.

ఎక్కడివక్కడే!

(5వ పేజీ తరువాయి)


శాస్త్రిపురంలో ఎస్‌ఆర్‌డీపీ పనులు

సంబంధించి 15 శాతానికి పైగా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆస్తుల సేకరణలో జాప్యంతో సర్వీస్ రోడ్డు నిర్మాణం మొదలు కాలేదు. మూడు ఆస్తుల సేకరించాల్సి ఉండగా, ఒక్క ఆస్తికి తాజాగా అవార్డ్ పాస్ చేశారు. మరో రెండు ఆస్తుల యజమానులు డాక్యుమెంట్లు ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారు. ఆస్తుల సేకరణ పూర్తయితే విస్తరణ పనులు చేపట్టి విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాల్సి ఉంది. ఆ తర్వాతే సర్వీస్ రోడ్డు నిర్మాణం జరగనుంది. ఆగస్టు 2024లో పూర్తిచేస్తామని గతంలో జీహెచ్‌ఎంసీ సర్కారుకు విన్నవించింది. ఇప్పటికీ పనులు కొనసాగుతుండడం గమనార్హం. మే రెండో వారం నాటికి పనులు పూర్తి చేసి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించాలని భావిస్తున్నట్టు ఓ అధికారి తెలిపారు. సేకరణలో ఆలస్యం నేపథ్యంలో అప్పటికైనా పనులు పూర్తవుతాయా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ట్రాక్ వద్ద పనులు పూర్తయితేనే..

చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, పాతబస్తీ వైపు నుంచి శంషాబాద్, రాజేంద్రనగర్ వైపు వాహనాలు ఆగకుండా సాగిపోయేలా రూ.71 కోట్లతో శాస్త్రిపురం ఆర్‌ఓబీ పనులు 2022లో చేపట్టారు. ఇప్పటి వరకు కేవలం 48 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఆస్తుల సేకరణ దాదాపుగా పూర్తయిందని చెబుతుండగా, బ్రిడ్జి నిర్మాణంలో మాత్రం పురోగతి కనిపించడం లేదు. అడపాదడపా మినహా రెగ్యులర్‌గా పనులు జరుగుతున్న దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. ఇదే స్థాయిలో పనులు జరిగితే మరో రెండేళ్లు పట్టవచ్చని ఓ అధికారి పేర్కొన్నారు.

నిలిచిన పనులు

హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఉప్పల్ నుంచి నారపల్లి వరకు అంతరాయం లేని వాహనాల రాకపోకల కోసం 7 కి.మీల మేర వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 2017లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పనులకు శంకుస్థాపన చేయగా.. 2018లో పనులు మొదలయ్యాయి. నారపల్లి నుంచి ఉప్పల్ రింగ్ రోడ్డు వరకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)లోని అర్‌అండ్‌బీ పనులు చేస్తుండగా.. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి రామంతాపూర్ వైపు వంతెన ఎక్స్‌టెన్షన్ పనులు జీహెచ్‌ఎంసీ చేపట్టింది. రామంతాపూర్ వైపు గతంలో పిల్లర్ల నిర్మాణం ప్రారంభం కాగా.. అనంతరం నిలిచిపోయాయి. సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన 8.5 ఎకరాల స్థలం సేకరించాల్సి ఉంది. ఇందుకుగాను రూ.200 కోట్లకుపైగా పరిహారం చెల్లించాల్సి వస్తుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. నిధుల కొరతతో ఆస్తుల సేకరణలో ముందడుగు పడడం లేదు. దీంతో దాదాపు రెండేళ్లుగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రూ.311 కోట్లతో ఈ పనులను బల్దియా చేపడుతోంది. ఉప్పల్ రింగ్ రోడ్డు ఆవలి వరకు ఆర్‌అండ్‌బీ వంతెన నిర్మిస్తుండగా.. అక్కడి నుంచి రామంతాపూర్ మోడ్రన్ బేకరీ వరకు నిర్మాణ బాధ్యతలు జీహెచ్‌ఎంసీవి.

సిటీ కోర్టుల్లో హౌస్‌కీపింగ్ కాంట్రాక్టులకు టెండర్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సిటీ సివిల్ కోర్టులు, హైదరాబాద్‌లోని కల్పతారు కాంప్లెక్స్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ కోర్ట్ ఆన్ ఫ్యామిలీ డిస్ప్యూట్స్ ప్రాంగణాల్లో వార్షిక నిర్వహణ, హౌస్ కీపింగ్ కాంట్రాక్టుల కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నారు. ఏప్రిల్ 19 వరకు టెండర్లు సమర్పించాలని, నిబంధనల కోసం అధికారిక వెబ్‌సైట్, సంబంధిత కోర్టు అధికారులను సంప్రదించాలని హైదరాబాద్ సిటీ సివిల్‌కోర్టు చీఫ్‌జడ్జి వై.పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

12న త్యాగరాయగాన సభలో
ప్రతిభావంతులకు ఉగాది అవార్డ్స్

చిక్కడపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): దేశ విదేశాల్లో వివిధరంగాల్లో రాణిస్తున్న ప్రతిభావంతులైన 53 మందికి ఈ నెల 12న వంశీ ఉగాది అవార్డ్స్‌తో సత్కరిస్తున్నామని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు బుధవారం విలేకరులకు తెలిపారు. త్యాగరాయగానసభలో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందజేస్తామన్నారు. సింగపూర్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అమెరికా, యూకే, ఉగాండా, దక్షిణాఫ్రికా, ఖతార్, ఒమన్, భారతకు చెందిన వారు ఎంపిక అయ్యారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, తెలుగు యూనివర్సిటీ వీసీ ఆచార్య నిత్యానందరావు, ఐలమ్మ యూనివర్సిటీ వీసీ సూర్యాధనుంజయ్, అన్నమాచార్య వారసుడు రాఘవన్, కిమ్స్ హాస్పిటల్ స్థాపకుడు బొల్లినేని కృష్ణయ్య, తిరుమల గ్రూప్స్ చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు హాజరవుతారన్నారు.

నల్లాకు మోటర్ బిగిస్తే కనెక్షన్ కట్

(5వ పేజీ తరువాయి)

వినియోగదారులల్లో 20 శాతం మందికి సాధారణంగా, మరో 20 శాతం మందికి లోప్రెషర్‌తో నీళ్లు వస్తున్నాయి. దీనిపై మెట్రో కస్టమర్ సెంటర్(ఎంసీసీ)కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదుల తాకిడి పెరగడంతో ఇటీవల వాటర్‌బోర్డు వాస్తవ పరిస్థితిపై థర్డ్ పార్టీ ద్వారా ఆరా తీసింది. నీటి సరఫరా సమయంలో చాలా మంది నల్లాలకు మోటర్లు బిగిస్తున్నట్లు గుర్తించింది. తాజాగా మార్కెట్‌లోకి వచ్చిన మోటర్లు నల్లా సరఫరా ప్రారంభం కాగానే ఆటోమెటిక్‌గా పని చేస్తుండడంతో మిగతా కనెక్షన్లకు లోప్రెషర్‌తో నీటి సరఫరా సమస్యగా తయారైంది.

నాలుగు దశల్లో తనిఖీలు

- వేసవిలో 'మోటర్ ఫ్రీ టాప్ వాటర్' లక్ష్యంగా నాలుగు దశల తనిఖీలకు జలమండలి సిద్ధమైంది. ఈ నెల 15 నుంచి స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది.
- మొదటిదశలో లైన్‌మెన్లు వాటర్‌వాల్వ్ తిప్పగానే సరఫరా చేసే లైన్లలో కనెక్షన్ టు కనెక్షన్ పరిశీలించి వాటర్ ప్రెషర్, మోటర్ల వినియోగాన్ని గుర్తిస్తారు.
- రెండో దశలో (రోజు విడిచి రోజు) సెక్షన్ మేనేజర్ అదే లైన్‌లో నల్లా నీటి సరఫరా, మోటర్ల వినియోగాన్ని గుర్తించి మోటర్ బిగించిన వారికి రూ.5 వేలు జరిమానా విధిస్తారు. తక్షణమే మోటర్ సీజ్ చేస్తారు. క్యాన్ నెంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెడతారు. ఆ తర్వాత లైన్ల వారీగా (క్యాన్‌నెంబర్ల జాబితా)తో 'మోటర్ ఫ్రీ టాప్‌వాటర్' లైన్లుగా జీఎంలకు ఆన్‌లైన్ నివేదిక సమరిస్తారు.
- మూడో దశలో జీఎంలు క్షేత్ర లైన్లను ర్యాండమ్‌గా పరిశీలించి సంతృప్తి వ్యక్తమైతే సీజీఎంలకు నివేదిక సమర్పిస్తారు.
- నాలుగో దశలో ఆ నివేదికలను క్రాస్ చెక్ కోసం సీజీఎం, డైరెక్టర్, ఎండీలు క్షేత్ర స్థాయిలో ర్యాండమ్‌గా తనిఖీలు నిర్వహిస్తారు. జరిమానాలు విధించడం, మోటర్లు సీజ్ చేయడం కొనసాగిస్తారు.
- సమగ్ర పరిశీలన జరపకుండా తప్పుడు నివేదిక సమర్పిస్తే ఏ స్థాయి అధికారికైనా మెమోను జారీ చేయాలని వాటర్‌బోర్డు నిర్ణయించింది.

ప్రత్యేకమైన యాప్ రూపకల్పన

నీటి నల్లాలకు మోటార్లను బిగించి అక్రమంగా నీటిని తోడుతున్న వారికి జరిమానా విధించడానికి, వాటర్‌బోర్డు నీటిని తాగునీటికి కాకుండా ఇతర అవసరాలకు వినియోగించే వారిపైనా కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రత్యేకమైన మొబైల్ యాప్‌ను బోర్డు రూపొందించింది. ఈ యాప్‌ను రెండు రోజుల్లో జీఎం నుంచి క్షేత్రస్థాయిలోని లైన్‌మెన్ల వరకు అందరికీ అందుబాటులోకి తేనున్నారు. ఆ ప్రాంతాల్లోని ఇల్లీగల్ మోటర్లను, నీటి వృథా చేస్తున్న వినియోగదారులను గుర్తించి ఫొటోతో సహా యాప్‌లో అప్లోడ్ చేస్తారు. సదరు కనెక్షన్‌దారుడికి జరిమానా విధిస్తారు. ఆ మొత్తాన్ని వచ్చే నెల బిల్‌లో చెల్లించేలాగా రూపొందించారు.

స్త్రీ నిధి సంస్థలో అక్రమాలపై దర్యాప్తు జరపాలి

● టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్

తార్నాక, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్త్రీ నిధి సంస్థలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై త్వరితగతిన సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు చేపట్టాలని తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ (టీఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎం శ్రీకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు. అన్నారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఎం శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా స్త్రీ నిధి సంస్థలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులకు ఎటువంటి కనీస సౌకర్యాలు కల్పించకుండా మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులను రెన్యువల్ చేయకుండా, అక్రమంగా తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

రేవంత్‌రెడ్డికి చరఖాపై నూలువడికే అర్హత లేదు

రాంనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): క్రిమినల్ చరిత్ర కలిగిన సీఎం రేవంత్‌రెడ్డి అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమంలో చరఖాపై నూలు వడికి జాతిపిత మహాత్మాగాంధీని అగౌరవ పరిచారని దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ బక్కా జాడ్సన్ ఆరోపించారు. బుధవారం గోల్కొండ చౌరస్తాలోని తన నివాసం వద్ద మహాత్మాగాంధీ చిత్ర పటానికి, చెరకకు క్షీరాభిషేకం నిర్వహించి మాట్లాడారు. ప్రజావ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి చెరకను పట్టుకునే అర్హత లేదని ఆరోపించారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలను కబ్జా చేసేందుకు రేవంత్‌రెడ్డి యత్నిస్తున్నారని ఆరోపించారు. చెట్లు నరకడం వల్ల వన్యప్రాణులకు ఇబ్బందులు ఏర్పడ్డాయని, పర్యావరణ సమస్య తలెత్తిందన్నారు. సీఎం తప్పులను ప్రశ్నిస్తే బట్టలూడదీసి కొడతామని మాట్లాడడం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి సీఎం చెడ్డపేరు తీసుకువస్తున్నారని ఆయన పేర్కొన్నారు.


మాట్లాడుతున్న జడ్సన్

కమీషన్ తీసుకుని నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు

● సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కమీషన్ తీసుకొని సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చుతున్న వ్యక్తిని సైబర్ క్రైం అధికారులు అరెస్ట్ చేశారు. బిహార్ సీతామండి ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రంజిత్ కుమార్(42), ఘజియాబాద్, యూపీలో ఉంటున్నాడు. ఈజీ మనీకోసం కమీషన్ తీసుకొని సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలను సమకూర్చుతున్నాడు. ఖాతాల్లో జమ అయిన డబ్బు లో కొంతమొత్తం కమీషన్ తీసుకొని, మిగతా డబ్బు సైబర్ నేరగాళ్లకు పంపుతున్నాడు. నగరానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు మీ పేరున ఉన్న బ్యాంకు ఖాతాల ద్వారా విదేశాలకు డబ్బు తరలిందని చెప్పారు. మనీ లాండరింగ్ కేసులు నమోదయ్యాయని చెప్పి, డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరించి రూ.19.61 లక్షలు తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేయగా, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బ్యాంకు ఖాతాల ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. ఇతడిపై తెలంగాణలో రెండు, దేశవ్యాప్తంగా మరో రెండు మొత్తం 4 కేసులు నమోదయ్యాయని సైబర్ క్రైం డీసీపీ కవిత దార తెలిపారు.

మార్ఫింగ్ ఫొటోలతో యువతికి వేధింపులు

● డబ్బులు చెల్లించాలని డిమాండ్ ● నిందితుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యువతి ఫొటోలను మార్ఫింగ్ చేసి పెళ్లి సంబంధం చెడగొడతానని నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఐడీ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డ నిందితుడిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. మెహదీపట్నం ప్రాంతానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి హెచ్. అకుల్‌సింగ్ (24), ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ వివరాలతో ప్రొఫైల్ రూపొందించాడు. నగరానికి చెందిన యువతి (21)కి పెళ్లి నిశ్చయమైంది. ఆ యువతి వివరాలు సేకరించి, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టాడు. తరచూ చాటింగ్ చేసి యువతి ఫొటోలు సేకరించాడు. వాటిని అశ్లీల చిత్రాలుగా మార్చి, యువతితోపాటు కాబోయే భర్తకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అశ్లీల ఫొటోలు పంపి, పెళ్లి రద్దు చేయిస్తానంటూ వేధింపులకు గురిచేశాడు. దాంతో బాధితురాలు నిందితుడు అకుల్ సింగ్‌ను సంప్రదించింది. డబ్బులు ఇస్తే ఫొటోలు డిలీట్ చేస్తానని చెప్పాడు. మరో స్నేహితుడి సహకారంతో రూ. 6 లక్షలు అకుల్‌సింగ్ సూచించిన ఖాతాలో జమ చేసినట్లు నకిలీ సందేశాలను పంపింది. అయినా వేధింపులు ఆగకపోవడంతో బాధితురాలు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేసింది. సైబర్ క్రైం ఆధారాలతో నిందితుడు అకుల్ సింగ్‌ను బుధవారం అరెస్ట్ చేసి, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరు గంజాయి సరఫరాదారుల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఒడిషా నుంచి నగరానికి గంజాయి సరఫరా చేస్తున్న ముఠాలోని ఇద్దరు సభ్యులను అఫ్జల్‌గంజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఒడిషా మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన మనోజ్ మధధి(19), సురేష్ కబాసి (21) రైతులు, వీరు నారాయణముదా, సురేష్‌లతో కలిసి నగరానికి గంజాయి సరఫరా చేస్తున్నారు. మనోజ్, సురేష్ 7.73 కిలోల గంజాయి తీసుకొని బుధవారం నగరానికి వచ్చారు. ఎంజీబీఎస్ ప్రాంతంలో గంజాయి ఇచ్చేందుకు వేచి చూస్తుండగా, సమాచారమందుకున్న అఫ్జల్‌గంజ్ పోలీసులు వీరిద్దరిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి 5.73 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

అల్వాల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో మొబైల్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు బుకీలను అరెస్ట్‌చేసి బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ. 2.45లక్షల నగదును అల్వాల్ పోలీసులు ఫ్రీజ్ చేశారు. అల్వాల్‌స్టేషన్ హౌజ్ ఆఫీసర్(హెస్‌హెచ్‌వో) రాహుల్‌దేవ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లా ప్రాంతానికి చెందిన ముకేష్‌సంక్లా ప్రధాన బెట్టింగ్ నిర్వాహకుడు. అల్వాల్‌లో చెప్పుల దుకాణం నిర్వాహకుడు కచ్వా నవరతన్, సీతాఫల్‌మండీలో స్వీట్‌షాపు నిర్వాహకుడు అజిత్‌సింగ్, బేగంబజార్‌కు చెందిన నిఖిల్ సాంక్లా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. మేడ్చల్ ఎస్‌వోటీ పోలీసులు, అల్వాల్ పోలీసుల సహకారంతో బుధవారం నిర్వాహకులను అరెస్ట్ చేశారు. బ్యాంక్ ఖాతాలోని రూ.2,45,796 నగదును ఫ్రీజ్ చేశారు.

జేఎన్‌టీయూలో విభాగాధిపతులకు స్థానచలనం

(5వ పేజీ తరువాయి)

మ్యాథమేటిక్స్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న ఎం.ఎస్.రాజశేఖర్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. ఆయన స్థానంలో జగిత్యాల జేఎన్‌టీయూ కాలేజీ నుంచే మరొక ప్రొఫెసర్ రాజశేఖర్‌రెడ్డిని డిప్యూటేషన్‌పై తెచ్చి హెచ్‌ఓడీ బాధ్యతలు అప్పగించడం వివాదాస్పదంగా మారింది. దీనిపై కాలేజీ విద్యార్థులు, అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కాలంగా తమ కళాశాల నుంచి డిప్యూటేషన్‌పై వేర్వేరు కాలేజీకి వెళ్లిన ప్రొఫెసర్లందరినీ తిరిగి వెనక్కి రప్పించాలని జగిత్యాల జేఎన్‌టీయూ విద్యార్థులు, అధికారులు వర్సిటీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

వ్యవసాయ రంగం బలోపేతానికి చర్యలు

● తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి


తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల డైరీని ఆవిష్కరిస్తున్న కోదండరెడ్డి తదితరులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. పురుగుల మందులు అధికంగా వాడుతుండడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటిని తగ్గించేందుకు రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారులు పూర్తి అవగాహన పెంపొందించాలని ఆయన సూచించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల ఐక్యవేదిక రూపొందించిన 2025 క్యాలెండర్, డైరీని కోదండరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, యాంత్రికరణతోనే వ్యవసాయరంగం మరింత బలోపేతం అవుతుందని స్పష్టం చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణ వ్యవసా విస్తరణ అధికారుల ఐక్యవేదిక అధ్యక్షుడు బి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ అధికారులకు రిస్క్ అలవెన్స్, ప్రమాద బీమాను అమలు చేయాలని, కొత్తగా నియమితులైన గ్రామపాలన అధికారులకు వ్యవసాయ విస్తరణ అధికారులకు అటాచ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నేతలు రవితేజ, కళ్యాణి, ప్రవీణ్, తిరుపతి, సునీత, ఆదర్శరైతు అధ్యక్షుడు లింగయ్య పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ncfyx3Mలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.


తలసానితో సలాఉద్దీన్ లోధి తదితరులు

బీఆర్ఎస్ బహిరంగ సభకు భారీగా తరలిరావాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

చార్మినార్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రజలు పదేళ్ల స్వర్ణయుగం చూశారన్నారు. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో ప్రజలు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్ఎస్ చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జి సలాఉద్దీన్‌లోధి, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ కేసీఆర్ విజన్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు.

సెట్విన్ సేవలను కొనియాడిన పరకాల ఎమ్మెల్యే


పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి శిక్షణ, కోర్సుల వివరాలు చెబుతున్న సెట్విన్ అధికారులు

చార్మినార్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు నైపుణ్యాలు అభివృద్ధి చేసి, ఉద్యోగాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోతీగల్లీ, సీతాఫల్‌మండి శిక్షణ కేంద్రాలను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్‌రావుతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల కిందట తన నియోజకవర్గంలో సెట్విన్ సహకారంతో జాబ్ మేళా నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సంస్థకు ప్రభుత్వం తరఫున ఎలాంటి సహకారం అవసరం ఉన్నా తాను ముందుంటానన్నారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలలో నిర్వహిస్తున్న కోర్సుల వివరాలను, యువతకు శిక్షణ అందిస్తున్న తీరును, అనంతరం వారికి జాబ్ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాల కల్పన తదితర అంశాలను ఎండీ వేణుగోపాల్‌రావు వివరించారు. కార్యక్రమంలో సెట్విన్ ట్రైనింగ్ ఇన్‌చార్జి ఎం.నవీన్ కుమార్, మోతీగల్లీ, సీతాఫల్ మండి కేంద్రాల ఇన్‌చార్జీలు వెంకటేశ్వర్లు, అనిత సిబ్బంది పాల్గొన్నారు.

ఫూలే జయంతి ఉత్సవాలకు తరలిరావాలి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యానికి పూర్వమే బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఉద్యమించిన నాయకుడు మహాత్మా జ్యోతిరావు ఫూలే అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 11న రాజేంద్రనగర్‌లో జరగనున్న జ్యోతిరావు ఫూలే జయంతి వేడుకలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం పాటుపడిన వారిని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీనారాయణ

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించండి

పహాడిషరీఫ్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీలోని బృందావనకాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని, దాని కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని 18వ వార్డు మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు బుధవారం జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్రామ్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 18వ వార్డు బృందావన కాలనీలో సుమారు 60 మీటర్ల దూరం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ లేకపోవడం కారణంగా స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

కంటి క్యాన్సర్‌పై అవగాహనకు 18న వైట్‌థాన్

బంజారాహిల్స్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కంటి క్యాన్సర్‌పై అవగాహన, నిధుల సేకరణ నిమిత్తం ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈనెల 18న యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో వైట్‌థాన్-2025 నిర్వహించనున్నారు. బంజారాహిల్స్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌లో వైద్యులు, వైద్య సిబ్బంది దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ హెడ్ డాక్టర్ స్వాతి కలికి మాట్లాడుతూ.. కంటి క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మొదట్లోనే వ్యాధిని గుర్తిస్తే చికిత్స సులభతరం అవుతుందన్నారు. కంటి క్యాన్సర్‌తో పోరాడుతున్న పేద పిల్లలకు ఉచితంగా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక దశలో రెటినోబ్లాస్టోమాను గుర్తించగలిగితే సులభంగా చికిత్స అందించవచ్చని పేర్కొన్నారు.

బోధనేతర సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

● రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందితో పాటు టైం స్కేల్ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన వ్యవసాయ విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బంది సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల సౌకర్యాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్(అధికారిక) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రమోషన్‌లు కల్పించాలని కోరారు. అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లందరికి 12, 18, 24 సంవత్సరాలకు ఇవ్వాల్సిన స్కేల్‌ల ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా, పరిశోధన సంస్థలలో ఉన్న వర్సిటీ క్వార్టర్లను బాగు చేసి సిబ్బందికి కేటాయించాలన్నారు. 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు కార్మికులకు టైం స్కేల్ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కాగా, వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేని ముజీబ్, రాజేంద్రగగర్ తాలుకా ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు కరణం యాదయ్య ముదిరాజ్, ఎంఏ నయీమ్, జి.అంజయ్యగౌడ్, వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ఎస్.జయరాం, వి.యాదగిరి, ఎస్కే నజీర్, పరమేశ్వర్, రవీందర్‌రెడ్డి, సులోచన, సుమలత, సునీత, రమేశ్, సంపత్ పాల్గొన్నారు.

'గావ్ చలో.. ఘర్ చలో'ను

విజయవంతం చేయాలి


బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్‌జీని సన్మానిస్తున్న రమేశ్, తదితరులు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న 'గావ్ చలో... ఘర్ చలో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్ జీ, రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. బీజేపీ అత్తాపూర్ డివిజన్ క్రియాశీలక కార్యకర్తల సమావేశం బుధవారం హైదర్‌గూడలోని పార్టీ కార్యాలయంలో జరిగింది. బడులు, గుడులు ఉన్న ప్రాంతాలలో కార్యకర్తలు స్వచ్ఛ సర్వేక్షణ్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులిగె వెంకటేశ్, కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్, నాయకులు టి.అంజన్‌కుమార్, ఎన్.మల్లారెడ్డి, వై.శ్రీధర్, ఎం.కొమురయ్య, కాడెం సుధాకర్, రాచూరి రాజశేఖర్, నల్లింగ్ రమేశ్, జయానందరెడ్డి, విజయ్‌కుమార్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మైలార్‌దేవుపల్లిలో..

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను బూత్ స్థాయిలో ప్రజలకు వివరించేలా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ కోరారు. బీజేపీ మైలార్‌దేవుపల్లి డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. బీజేపీ ప్రభుత్వం సాధించిన ట్రిబుల్ తలాక్, 370 ఆర్టికల్, వక్ఫ్ చట్ట సవరణ బిల్లును ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మైలార్‌దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు అడికె జనార్దన్, నాయకులు జోగి రవి, సి.బుచ్చిరెడ్డి, ఎన్.జగన్, పి.సంతుగౌడ్, సీహెచ్ వెంకటరమణగుప్తా, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

పార్టీ కార్యాచరణను విజయవంతం చేయాలి

ఈనెల 15వ తేదీ వరకు పార్టీ ఇచ్చిన కార్యాచరణను ప్రతీ ఒక్కరు విజయవంతంగా కొనసాగించడానికి కృషి చేయాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు బొక్క బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉప్పర్‌పల్లిలో జరిగిన సమావేశంలో యన మాట్లాడారు. ఈనెల 10న శివరాంపల్లిలో పార్టీ జెండా ఆవిష్కరణ, 11న మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి, 12న హనుమాన్ జయంతి, 13న బుద్వేల్ బాబు జగ్జీవన్‌రాం విగ్రహం నుంచి రాజేంద్రనగర్ అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ, 14న భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వేముల మల్లేశ్, కె.హరికిషన్‌జీ, కోరని క్రాంతి, ఎస్.విఠల్, కీర్తిశ్రీనివాస్, బండారి బాలకృష్ణ, గోనె శ్రీకాంత్‌రెడ్డి, కె. మల్లేశ్‌చారి, ఆర్.రాకేశ్‌గౌడ్, యు.పవన్ పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం చేసిన ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం పేరిట యువతిని మోసం చేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన వి.సీతామహాలక్ష్మి కుమార్తె ఐశ్వర్య 2023లో బీటెక్ పూర్తి చేసింది. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తుండగా జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.36కు చెందిన త్రినూన్ టెక్నాలజీస్ నుంచి తుమ్మ దివ్యవాణి ఫోన్ చేసి తాము పలు కోర్సులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పింది. ఈ మేరకు తల్లి, కుమార్తెలు సంస్థ డైరెక్టర్లు మురారి హనీషా, బచ్చు వెంకటశివరామకృష్ణారెడ్డి, కన్సల్టెంట్ దివ్యవాణిను కలిశారు. శిక్షణ తీసుకునేందుకు పలు దఫాలుగా రూ.2.50 లక్షలు చెల్లించారు. ఆరు నెలల శిక్షణ కాలంలో రూ.30వేల స్టైఫెండ్ ఆ తర్వాత ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. రోజులు గడుస్తున్నా ఎటువంటి శిక్షణ ఇవ్వలేదు. కంపెనీ నిర్వాహకులను నిలదీయగా రూ.1.65 లక్షలు తిరిగి ఇచ్చేశారు. మిగతా డబ్బు ఇవ్వకపోగా సిబ్బందితో బెదిరిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



హనుమాన్ జయంతి ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్‌రావు తదితరులు

12న వీరహనుమాన్ విజయ యాత్ర

బర్కత్‌పుర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 12న వీరహనుమాన్ విజయ యాత్ర నిర్వహిస్తున్నట్లు బజరంగ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు తెలిపారు. బుధవారం కాచిగూడలోని బజరంగ్‌సేన రాష్ట్ర కార్యాలయంలో విజయయాత్ర పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ వ్యాయామశాల నుంచి సికింద్రాబాద్ తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం వరకు బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని, హిందువుల ఐక్యతను చాటిచెప్పాలని కోరారు. కార్యక్రమంలో బజరంగ్‌సేన నగర అధ్యక్షుడు మనోజ్, మహిళా అధ్యక్షులు దుర్గా శర్మ, ఉపాధ్యక్షుడు రాఘవ, యువజన కార్యదర్శి నరేష్, నాయకులు అశ్విన్, రామేశ్వర్, విశ్రాంత్, ప్రవీణ్‌యాదవ్, సాయినాథ్ పాల్గొన్నారు.


పోషణ పక్షం కార్యక్రమంలో ఐసీడీఎస్ శేరిలింగంపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ కవిత

పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ శేరిలింగంపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ కవిత అన్నారు. లక్ష్మీగూడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. కవిత మాట్లాడుతూ పాలు, గుడ్లు, ఆకు కూరలు, మాంసకృతులు, పప్పు దినుసులు, ఐరన్ మాత్రలు, విటమిన్స్ ప్రోటీన్స్ ఎక్కువగా తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం బాలకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీ టీచర్లు వినోద, చంద్రకళ, సాయిప్రసన్న, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కమ్యునికేషన్, ఇంటర్వ్యూ నైపుణ్యాలపై శిక్షణ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ఇంటర్ విద్యార్థులకు కమ్యునికేషన్, ఇంటర్వ్యూ నైపుణ్యాలపై ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని ఇంటర్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్‌స్టెప్ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న డిజిటల్ శిక్షణ ద్వారా అధ్యాపకుల కొరత, నైపుణ్య లోపాలు, డ్రాప్‌అవుట్ రేట్లను తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. మొదటి దశ పైలెట్ కార్యక్రమంలో భాగంగా నాంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, చంచల్‌గూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిజిటల్ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్వ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ గోపాల బాలసుబ్రమణ్యం, కమ్యునికేషన్ స్కిల్ నిపుణుడు వరప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ మండలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని పాఠశాలలు తమ పాఠశాలల పేరు చివరన తోకలను తగిలించుకున్నారని, వాటిని వెంటనే తొలగించాలని ఆయన సూచించారు. కొందరు సీబీఎస్ఈ కరిక్యులం పేరుతో తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అనుమతులు లేని పాఠశాలల్లో పిల్లలను చేర్పవద్దని తల్లిదండ్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాజేంద్రనగర్ మండలంలో సీబీఎస్ఈ అనుమతులు ఉన్న పాఠశాలలు 11 మాత్రమే ఉన్నాయని, భారత విద్యాభవన్, మహేశ్ విద్యాలయం, గ్రీన్‌విచ్ అకాడమీ, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, సోలిటైర్ స్కూల్, బ్రిగేడ్ హైస్కూల్, ఎడిఫై స్కూల్, గేట్‌వే స్కూల్, లోటస్ నేషనల్ స్కూల్, ఓలీవ్ మౌంట్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం అని ఆయన తెలిపారు. పాఠశాలల్లో స్టేషనరీ అమ్మడానికి అనుమతులు లేవని, శివరాంపల్లిలోని గౌతమ్ మోడల్ స్కూల్‌కు అనుమతులు లేవని ఆయన తెలిపారు.

తక్కువ ధరకు ప్లాట్లు ఇప్పిస్తామని మోసం

● ఇద్దరు అరెస్ట్

నార్సింగ్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతాల్లో తక్కువ ధరకు ప్లాట్లు ఇప్పిస్తామని చెప్పి పలువురిని మోసం చేసిన కామిరెడ్డి రాజేంద్రప్రసాద్, వేపరాల గురుకుమార్‌లను నార్సింగ్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఈ కేసులు ఫిర్యాదు చేసింది ఎవరు?, నిందితులు ఎక్కడి వారు అన్నది పోలీసులు వెల్లడించలేదు.

నివాళులు


ఆలె నరేంద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదరి చంద్రశేఖర్ తదితరులు

కేంద్ర మాజీ మంత్రి దివంగత ఆలె నరేంద్ర 11వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు ఈ.సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు.
● చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి





గౌలిపురాలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి తదితరులు

హనుమాన్ విజయోత్సవ ర్యాలీకి

17 వేల మంది పోలీసులతో బందోబస్తు

- అనుమతి లేకుండా డ్రోన్లను వినియోగించొద్దు
- సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు
- సమీక్షా సమావేశంలో సీపీ సీవీ ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న జరగనున్న వీర హనుమాన్ విజయోత్సవ ర్యాలీ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. ఫైర్ సర్వీస్, ఎలక్ట్రిసిటీ, రవాణా శాఖ, ఆరోగ్య వైద్య శాఖలతో పాటు.. బజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు, సీనియర్ అధికారులు, సైబరాబాద్, రాచకొండ పోలీసులు, వీర హనుమాన్ విజయయాత్ర నిర్వాహకులతో కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించొద్దని హనుమాన్ విజయ యాత్ర నిర్వాహకులకు సూచించారు. పోలీసుల అనుమతి లేకుండా డ్రోన్లు ఎగురవేయొద్దని, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 17 వేలమంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు.

కొత్త వ్యక్తులను గుర్తించాలి

విజయయాత్ర, ర్యాలీలో కొత్త వ్యక్తులు చేరితే గుర్తించి పోలీసులకు తెలియజేయాలన్నారు. ఊరేగింపులో నిర్వాహకులు ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. డీజే సిస్టమ్‌ను ఉపయోగించొద్దన్నారు. వాతావరణ శాఖ తెలిపిన సమాచారం మేరకు శనివారం వర్ష సూచన ఉన్నందున జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఊరేగింపులో ఎన్ని వాహనాలు వినియోగిస్తున్నారో సంబంధిత పోలీసులకు తెలియజేయాలన్నారు. నిర్వాహకులు రోప్ పార్టీ సభ్యులకు(వలంటీర్లకు) శిక్షణ ఇచ్చి వారిని వినియోగించుకోవాలన్నారు. ఉదయం 8 నుంచి బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ భవనంలో జాయింట్ కంట్రోల్ రూమ్ నుంచి బందోబస్తును ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారని, వివిధ శాఖల అధికారులు ఏ సమస్య వచ్చినా వెంటనే సలహాలు, సూచనలు ఇచ్చేందుకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

యాత్ర మార్గాన్ని పరిశీలించిన సీపీ

సమావేశం అనంతరం వివిధ శాఖల అధికారులు, నిర్వాహకులతో కలిసి సీపీ సీవీ ఆనంద్ విజయ యాత్ర జరిగే శ్రీరామమందిరం గౌలిగూడ నుండి తాడ్‌బండ్ హనుమాన్ టెంపుల వరకు సుమారు 12.2 కిలోమీటర్ల మార్గాన్ని పరిశీలించారు. అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, రఘుప్రసాద్, అడిషినల్ కమిషనర్, జీహెచ్ఎంసీ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలి

ప్రజలు శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలని, మత సామరస్యానికి భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని రాచకొండ సీపీ సుధీర్ బాబు అన్నారు.

హనుమాన్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించే కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం, కొత్తపేట, చంపాపేట్, సింగరేణి కాలనీ, సరూర్‌నగర్ ట్యాంక్ బండ్, దిల్‌సుఖ్‌నగర్, సరస్వతీనగర్ ప్రాంతాల్లో పర్యటించి బందోబస్తు గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. సున్నిత ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులతో, ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. డీసీపీలు ప్రవీణ్‌కుమార్, జి.నరసింహా రెడ్డి, శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు.

వ్యాపార సేవల కోసం సేల్స్ ఫోర్స్

- సీఎస్ఆర్‌లో భాగంగా విద్యార్థులకు శిక్షణ
- ఏఐ టెక్నాలజీతో సేవలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా విద్యాసంస్థల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సేల్స్ ఫోర్స్ ఇండియా ఆపరేషన్ ఎండీ సాకేత్ అటల్ తెలిపారు. దివ్యశ్రీ ఆర్కేడ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సెల్‌ఫోన్ సేవలు టెక్నాలజీతో అప్‌గ్రేడేషన్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా విద్యార్థులకు కమ్యూనికేషన్, సాంకేతిక టెక్నాలజీపై శిక్షణ తదితర అంశాలపై సంస్థ చేపట్టిన కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా వ్యాపార సంస్థలకు సేవలను నుంచే సేల్స్ ఫోర్స్ ఏఐ టెక్నాలజీ ద్వారా అత్యధిక ఫీచర్స్ జోడించామని రానున్న రోజుల్లో అత్యంత మెరుగైన సేవలు అందించే సంస్థగా సేల్స్ ఫోర్స్ ఖ్యాతికి ఎక్కుతుందని వివరించారు. తెలంగాణ వ్యాప్తంగా టాస్క్, ఏఐసీటీ సహకారంతో విద్యార్థులకు సేల్స్‌ఫోర్స్ పై శిక్షణ గ్రీన్ ఎనర్జీ తదితర అంశాలపై శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. సేల్స్‌ఫోర్స్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థుల పరిశోధనల గురించి వివరించారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రభుత్వ సహకారంతో విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే అంసెబ్లీని ముట్టడిస్తాం

బర్కత్‌పుర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాసంత్సరం ముగుస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4 వేల కోట్లు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ నీలా వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వడం లేదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పుస్తెలతాడులు అమ్మి ఫీజులు చెల్లిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థులపై లేదని ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, దీనిని తీవ్రంగా ప్రతిఘటిస్తామని ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు మణికంఠ, సి. రాజేందర్, రామ్‌దేవ్‌మోదీ పాల్గొన్నారు.

'ఉద్యోగ భద్రత కల్పించాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లోని పార్ట్ టైం టీచర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమేశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ట్స్ కాలేజీ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులను వెంటనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. జీవో 21లో పార్ట్ టైం అధ్యాపకుల సర్వీస్‌కు సంబంధించిన సవరణ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఈ నెల 15 నుంచి విధులు బహిష్కరించి, ఉద్యమబాట పడతామన్నారు. తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల్లోని పార్ట్ టైం టీచర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసనలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను తొలగించాలంటూ ఆందోళన

రామంతాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తమపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రామంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను తొలగించాలని ప్రీ ప్రైమరీ సెక్షన్ ఎదుట బుధవారం విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళనకు దిగారు. పాఠశాల యాజమాన్యం ఏకపక్షంగా పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులను నియమించి తరగతులు నిర్వహించాలని కోరారు. పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్‌ను రద్దు చేసి నూతన కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించే వరకూ దశలవారీగా ఆందోళనను కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

ఫీజు చెల్లించలేదని పరీక్ష రాయనీయని పాఠశాల యాజమాన్యం

- తల్లిదండ్రుల నిరసన.. పట్టించుకోని విద్యాశాఖాధికారులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఫీజు చెల్లించని విద్యార్థులను పరీక్ష హాల్ నుంచి బయటకు పిలిచి ప్రశ్నాపత్రాలను లాక్కొని పరీక్ష రాయనీయలేదు ఖైరతాబాద్‌లోని హోలీమేరీ పాఠశాల యాజమాన్యం. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఫీజు కట్టలేదని దాదాపు 40 నుంచి 50 మంది విద్యార్థులను పరీక్ష రాయనీయకపోవడంతో దీనంగా కూర్చోవడం కనిపించింది. విద్యార్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతించకపోవడంతో ప్రిన్సిపాల్‌ను తల్లిదండ్రులు ఘెరావ్ చేసి నినాదాలు చేశారు. కొందరు అప్పటికప్పుడు అప్పు తీసుకొచ్చి కట్టారు. మరికొందరు తల్లిదండ్రులు ఫోన్ పే, గూగుల్‌పే ద్వారా చెల్లించినా అప్‌డేట్ కాలేదని విద్యార్థులను పరీక్ష రాయనీయకపోవడంతో ఆందోళన చేశారు. దాదాపు 50మంది వరకు విద్యార్థులను పరీక్ష రాయనీయకపోవడంతో వారి విషయమై ఎలాంటి చర్యలు తీసుకుంటారని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించగా.. సరైన సమాధానం ఇవ్వలేదు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేస్తామని, పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

సైబరాబాద్‌లో 11 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 11 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ అవినాష్ మహంతి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన ఇన్‌స్పెక్టర్లు వెంటనే తమకు కేటాయించిన స్టేషన్‌లలో రిపోర్టు చేయాలని, డీసీపీలు, అడిషనల్ డీసీపీ, ఏసీపీలు బదిలీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని ఆదేశాల్లో సీపీ పేర్కొన్నారు.

ఇన్‌స్పెక్టర్ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
వి.జానకిరాంరెడ్డి	సైబరాబాద్ కమిషనరేట్	సీఐ ఆమనగల్
బి.ప్రమోద్‌కుమార్	సీఐ ఆమనగల్	ఎస్‌హెచ్ఓ ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టు ట్రాఫిక్ పీఎస్
కారంపూరి రాజు	ఎస్‌హెచ్ఓ ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టు	ట్రాఫిక్ డీఐ శామీర్‌పేట పీఎస్
ఎం.అంజయ్య	డీఐ జగద్గిరిగుట్ట పీఎస్	ఎస్ఓటీ రాజేంద్రనగర్ జోన్
చందా గంగాధర్	డీఐ శామీర్‌పేట పీఎస్	ఎస్‌హెచ్ఓ కడ్తాల్ పీఎస్
సుంకరి విజయ్	డీఐ పేట్ బషీరాబాద్	ఎస్‌హెచ్ఓ చందానగర్
ఎస్.శివ ప్రసాద్	ఎస్‌హెచ్ఓ కడ్తాల్	ఇన్‌స్పెక్టర్ సైబర్ క్రైం
పి.రమణారెడ్డి	ఎస్ఓటీ రాజేంద్రనగర్ జోన్	షీ టీమ్స్ డబ్ల్యు అండ్ సీఎస్‌డబ్ల్యూ
డి.అజయ్‌కుమార్	సైబర్ క్రైం	డీఐ పేట్‌బషీరాబాద్
డి.పాలవెల్లి	ఎస్‌హెచ్ఓ చందానగర్	ఇన్‌స్పెక్టర్ సైబర్ క్రైం
పి.నరేందర్ రెడ్డి	సైబర్ క్రైం	డీఐ జగద్గిరిగుట్ట పీఎస్

తగిన జాగ్రత్తలతో సిలికోసిస్ వ్యాధిని నివారించవచ్చు

- నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ చైర్మన్ రాజగోపాలరావు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పనిచేసే ప్రదేశాల్లో సిలికాన్ దుమ్ము కారణంగా వచ్చే సిలికోసిస్ వ్యాధిని నివారించవచ్చని నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ చైర్మన్, తెలంగాణ ఫ్యాక్టరీస్ డైరెక్టర్ బి. రాజగోపాలరావు అన్నారు. నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ చాప్టర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సంయుక్తాధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని ఫ్యాప్సీ ఆడిటోరియంలో నిర్వహించిన సిలికోసిస్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సిలికోసిస్ వ్యాధికి చికిత్స లేదని, పని ప్రదేశాల్లో కార్మికులకు అవసరమైన మాస్కులు అందించడం, సిలికాన్ దుమ్ము రేగకుండా స్ప్రింకర్ల ద్వారా నీరు పిచికారి చేయడం ద్వారా సమస్య తీవ్రతను తగ్గించవచ్చన్నారు. తరచూ పరీక్షలు నిర్వహించడం ద్వారా రక్షణ చర్యలు తీసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ప్రతినిధులకు ఈఎస్ఐసీ పల్మనాలజిస్టులతో పరీక్షలు నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై నమ్మకం కలిగేలా పనిచేయండి

- కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ప్రజలకు నమ్మకం కలిగేలా టీచర్లు పనిచేయాలని కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. లకిడీకాపూల్‌లో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జిల్లా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వివిధ పథకాలపై మహిళా సంక్షేమ అధికారి అక్కేశ్వరావుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు పోషకాహారం, మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రతీ సూపర్‌వైజర్ నెలకు 15 సెంటర్లు, సీడీపీఓ 10 సెంటర్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతీ సెగ్మెంట్‌లో కింది నుంచి ఐదవ స్థానంలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లకు మెమోలు జారీచేయాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీల్లో విద్యుత్ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీల్లో పిల్లల హాజరు శాతం పెంచకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో సీసీఐ, శిశువిహార్, అంగన్వాడీ కేం ద్రాల్లో 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఆర్‌బీఎస్‌కే వైద్యులతో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసి టీకాలు వేసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా పోషణ పక్షం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఐఓ డా.శ్రీధర్, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రపంచవ్యాప్త పరిణామాలను భావి కమాండర్లు తెలుసుకోవాలి


అవార్డు గ్రహీతలతో ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్ చీఫ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా

అల్వాల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వ్యూహాత్మక, కార్యాచరణ స్థాయి ఆలోచనను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వెస్ట్రన్ ఎయిర్ కమాండ్, ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్ చీఫ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా అన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ ఎయిర్‌వార్‌ఫేర్(సీఏడబ్ల్యూ)48వ హయ్యర్ ఎయిర్ కమాండ్ కోర్సు (హెచ్ఏసీసీ) ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రేపటి సవాళ్లను ఎదుర్కోవడానికి ఉమ్మడి యుద్ధ సామర్థ్యాల అవసరాన్ని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని భావి కమాండర్లకు సూచించారు. హైబ్రిడ్ వార్‌ఫేర్, మల్టీ-డొమైన్ సామర్థ్యాలు, ప్రస్తుత భౌగోళిక పరిస్థితులపై మాట్లాడారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరానికి కాలేజ్ ఆఫ్ ఎయిర్ వార్‌ఫేర్(సీఏడబ్ల్యూ), హెచ్ఏసీసీ జర్నల్‌ను విడుదల చేశారు. కోర్స్‌లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన గ్రూప్ కెప్టెన్ సందీప్ కుమార్ ధీమాన్‌కు ఎయిర్‌చీఫ్ మార్షల్ ఎల్ఎం. కాత్రే ట్రోఫీని, అకడమిక్స్‌లో ప్రతిభ కనపర్చిన కల్నల్ బిశ్వాస్ ఆర్ నంబియార్‌కు కమాండెంట్ ట్రోఫీని, ఉత్తమ వ్యక్తిగత పరిశోధన పేపర్‌ను ప్రదర్శించిన కెప్టెన్ సుమిత్ మాలిక్‌కు ఎయిర్ మార్షల్ కేబీ సింగ్ ట్రోఫీని ప్రదానం చేశారు.

15 నుంచి రేపల్లె ఎక్స్‌ప్రెస్ టెర్మినల్ మార్పు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పునరాభివృద్ధి పనుల కారణంగా సికింద్రాబాద్-రేపల్లె మధ్య నడిచే(17645) ఎక్స్‌ప్రెస్ బయల్దేరే టెర్మినల్ ఈ నెల 15 నుంచి చర్లపల్లికి మారుస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. ఈ రైలు చర్లపల్లి నుంచి ఇంతకు ముందు ప్రకటించిన సమయం మధ్యాహ్నం 1.30గంటలకు బదులు మధ్యాహ్నం ఒంటిగంటకు(అరగంట ముందుగా) బయల్దేరుతుందని సీపీఆర్ఓ తెలిపారు. ఈ మార్గంలో ఆగే ఇతర స్టేషన్లు/వేళల్లో ఎటువంటి మార్పులేదని ఆయన పేర్కొన్నారు.



ఉదయం నుంచే భానుడి ప్రతాపం

- వేడిగాలులు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- నగరంలో పగటి ఉష్ణోగ్రతలు 39.5 డిగ్రీలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉదయం 9 గంటల నుంచే ఎండ మండుతోంది. రెండు రోజులుగా వేడిగాలులు, ఉక్కపోత నగరవాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వర్షంపడినంత సేపు చల్లగా ఉన్నా తర్వాత ఉక్కపోత పెరుగుతోంది. కాప్రా రాజీవ్‌నగర్, సికింద్రాబాద్ న్యూ మెట్టుగూడ, గోషామహల్, షేక్‌పేట ప్రాంతాల్లో బుధవారం మధ్నాహం ఉష్ణోగ్రతలు 39.5 డిగ్రీలు నమోదయ్యాయి. గ్రేటర్ వ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు 39-40 డిగ్రీలుగా నమోదవుతున్నా 42 డిగ్రీల తీవ్రత కన్పిస్తోంది. వేడిగాలుల తీవ్రత సాయంత్రం 5గంటల వరకు కొనసాగుతుండటంతో మధ్యాహ్నం ప్రధాన రహదారులపై వెళ్లే వాహనదారులు వేడిగాలులతో ఇబ్బందులు పడుతున్నారు. ఎండతీవ్రత కారణంగా మధ్యాహ్నం 2-3 గంటల సమయంలో పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ కొంత తక్కువగా ఉంటుంది.

నేడు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక

తెలంగాణలోని పలు జిల్లాల్లో గురువారం ఉరుములు, మెరుపులతోపాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో సాయంత్రం లేదా రాత్రి తేలికపాటి నుంచి అక్కడక్కడ మోస్తారు వర్షం కురిసే అవకాశముంటుందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 38డిగ్రీల నుంచి 23డిగ్రీల వరకు ఉంటాయన్నారు. ఉపరితల గాలులు దక్షిణ తూర్పు దిశలో గంటకు 6-10 కిలోమీటర్ల వేగంతో వీస్తాయన్నారు.

నేటినుంచి రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్

- గ్రేటర్ పరిధిలోని 8 ఎస్సార్వోల్లో ప్రయోగాత్మకంగా అమలు
- చంపాపేట్, సరూర్‌నగర్ ఎస్సార్వోల్లో పరిధుల విలీనం
- కుత్బుల్లాపూర్ ఎస్సార్వోలో ఇకపై ముగ్గురు సబ్ రిజిస్ట్రార్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో(ఎస్సార్వో) గురువారం నుంచి స్లాట్ బుకింగ్ వవిధానం అమల్లోకి తీసుకొస్తున్నట్లు అధికారులు తెలిపారు. పైలెట్ రన్‌గా ఈ విధానాన్ని అమలు చేసేందుకు రాష్ట్రంలోని 22 ఎస్సార్వోలను ఎంపిక చేయగా, వాటిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 8 ఎస్సార్వోలు ఉన్నాయి.

ఎంపిక చేసిన కార్యాలయాలు

హైదరాబాద్ జిల్లాలోని చిక్కడపల్లి, ఆజంపురా, రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్, చంపాపేట్, సరూర్‌నగర్, మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్, మేడ్చల్, వల్లభనగర్ కార్యాలయాలు ఉన్నాయి. కుత్బుల్లాపూర్ మినహా మిగిలిన ఎస్సార్వోలలో గురువారం నుంచి రోజుకు 48 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ జరిగేలా వినియోగదారులకు 48 టైమ్ స్లాట్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. రోజుకు సగటున 120 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యే కుత్బుల్లాపూర్ ఎస్సార్వోలో మొత్తం 144 స్లాట్‌లు ఇస్తున్నారు. ఈ ఆఫీసులో ఇప్పటి దాకా ఒక సబ్ రిజిస్ట్రారే ఉండగా, గురువారం నుంచి మరో ఇద్దరు(కలిపితే మొత్తం ముగ్గురు) సబ్ రిజిస్ట్రార్లు అదనంగా పనిచేసేలా(రీ-డిప్లాయ్‌మెంట్)ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లా చందూరు నుంచి ఒకరిని, హైదరాబాద్ జిల్లా ఆడిట్ ఆఫీస్ నుంచి మరొకరిని కుత్బుల్లాపూర్ ఎస్సార్వోకు బదిలీ చేశారు. రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్, చంపాపేట్ ఎస్సార్వోల పరిధిని (కాంకరెంట్ జూరిడిక్షన్) విలీనం చేసిన రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు ఆ రెండు ఎస్సార్వోల్లో ఎక్కడైనా వినియోగదారులు స్లాట్ బుక్ చేసుకొని తమ రిజిస్ట్రేషన్ పక్రియను పూర్తి చేసుకునేలా ఏర్పాటు చేశారు.

వినియోగదారులు డాక్యుమెంట్ రైటర్‌తో పని లేకుండా స్వయంగా ఇల్లు, స్థలం లేదా ఫ్లాట్ తదితర ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం ఆ శాఖ వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్‌లోనే స్లాట్ బుకింగ్, డాక్యుమెంట్ తయారు చేసుకోవచ్చు. స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చలానాలను ఆన్‌లైన్‌లోనే చెల్లించి ప్రింటెడ్ డాక్యుమెంట్లను తీసుకుని ఎస్సార్వోకు వెళితే 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికానుంది.

కొత్తగా ఈ-సిగ్నేచర్ విధానం

రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లపై క్రయ, విక్రయ దారుల నుంచి భౌతికంగా సంతకాలకు బదులు ఎలక్ట్రానిక్ సిగ్నేచర్ పద్ధతిని అవలంబించనున్నారు. డాక్యుమెంట్లపై ఎండార్స్‌మెంట్ (సంతకాలు) చేయాల్సిన చోట 'ఆధార్' ఆధారిత సిగ్నేచర్ వెరిఫికేషన్ ముద్ర వచ్చేలా టెక్నాలజీని వినియోగిస్తున్నారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో గంటల కొద్దీ సమయం వేచి ఉండాల్సిన అవసరం ఉండదు.

వార్డులో మద్యం తాగిన వార్డు బాయ్

- సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్
- విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం
- చెస్ట్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్

ఎర్రగడ్డ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చెస్ట్ ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ వద్ద మద్యం తాగుతూ పట్టుబడ్డాడు వార్డు బాయ్. ఆస్పత్రిలో వార్డు బాయ్‌గా పనిచేస్తున్న సాదిక్ అలీ ఆక్సిజన్ ప్లాంట్ సమీపంలోగల వార్డులో మంగళవారం అర్ధరాత్రి మద్యం తాగుతున్నాడు. గుర్తించిన కొందరు వీడియో తీశారు. బుధవారం సోషల్ మీడియాలో వీడియో వైరల్ అయింది. దీనిపై సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. వార్డు బాయ్ సాదిక్ అలీ మద్యం తాగిన విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి అతడిపై చర్యలు తీసుకుంటామన్నారు.

అనన్య సీడీసీలో రెండేళ్లలోపు చిన్నారులకు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు

పంజాగుట్ట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆటిజం అవగాహన నెలను పురస్కరించుకుని నగరంలోని అనన్య చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్(అనన్య సీడీసీ)లో రెండు సంవత్సరాల లోపు చిన్నారుల పెరుగుదల, అభివృద్ధిపై ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు, తల్లిదండ్రులకు, కేర్ టేకర్స్‌కు ఉచితంగా కౌన్సెలింగ్, ఉచితంగా టీచర్ ట్రైనింగ్ కోర్స్ నిర్వహిస్తున్నామని ఆటిజం సొసైటీ ఆఫ్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల వ్యవస్థాపకురాలు, అనన్య సీడీసీ డైరెక్టర్ మాధవి ఆదిమూలం తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సైకియాట్రిస్ట్ డాక్టర్ శివ అనూప్, డాక్టర్ అనిల్ కుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ నెలను ఆటిజం అవగాహన మాసంగా జరుపుకుంటున్నారని తెలిపారు. ఉచిత స్క్రీనింగ్ పరీక్ష అపాయింట్‌మెంట్ వివరాల కోసం 9848513192 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ డిమాండ్ చేశారు. నాంపల్లి టీఎన్జీవో భవన్‌లో బుధవారం జరిగిన అడ్‌హక్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే విషయంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయని, ప్రస్తుత ప్రభుత్వం ఈ విషయంలో తక్షణం నిర్ణయం తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల హెల్త్ కార్డులు కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేయడం లేదని, ప్రభుత్వ ఉద్యోగుల ఈహెచ్ఎస్‌తోపాటు జేహెచ్ఎస్ కూడా అన్ని ఆస్పత్రుల్లో చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా టీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్ రాకేష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మల్లేష్, అజయ్, సువర్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్. సోమేశ్వర్, సంయుక్త కార్యదర్శులుగా రమేష్, ప్రవీణ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎస్. వెంకట్, ఆర్. వెంకట్, కోశాధికారిగా బాపూరావు, కార్యవర్గ సభ్యులుగా సంతోష్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా నవీన్‌కుమార్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ ప్రకటించారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

12, 13న బీపీటీఎంఎం జాతీయ మహాసభలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్ (బీపీటీఎంఎం) 7వ త్రైవార్షిక జాతీయ మహాసభలు ఈ నెల 12, 13 తేదీల్లో రెండు రోజులపాటు హైదరాబాద్‌లో జరుగుతాయని మహాసంఘ్ అఖిల భారత ప్రధానకార్యదర్శి అల్లూరి రవిశంకర్ తెలిపారు. ఈ సభలకు దేశంలోని 25 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని ఆయన చెప్పారు. బుధవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని శ్రమశక్తిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా మహాసంఘ్ అఖిల భారత అధ్యక్షుడు హిరణ్మయ్ పాండ్యా, ఆలిండియా ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌చార్జి వాత్సాని, మహాసంఘ్ అఖిల భారత ప్రతినిధులు విచ్చేయనున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రైవేటు రవాణా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి తీర్మానాలు ప్రవేశపెడతామని చెప్పారు. వాహనాల ఇన్సూరెన్స్, 15 సంవత్సరాల తర్వాత స్క్రాప్‌కు వాహనాలు, జాతీయ రహదారులలో డ్రైవర్లకు విశ్రాంతి గదులు, దేశవ్యాప్తంగా డ్రైవర్ల కోసం సంక్షేమబోర్డు, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు తదితర విషయాలపై చర్చ జరుగుతుందని తెలిపారు.

పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ పోలీసుల దాడులు

- ఐదుగురు స్మగ్లర్స్ అరెస్ట్.. 12.78 కిలోల గంజాయి స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. ఐదుగురు స్మగ్లర్స్‌ను అరెస్ట్ చేసి రూ. 6.50 లక్షల విలువగల 12.78 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశాఖ నుంచి నగరానికి గంజాయి సరఫరా అవుతుందని సమాచారం అందడంతో ఎక్సైజ్ ఎస్టీఎఫ్ సీఐ చంచంద్రశేఖర్‌గౌడ్ టీమ్ నిఘా పెట్టింది. ముసారాంబాగ్‌లో పీవీఆర్ సినిమా కాంప్లెక్స్, మెట్రోస్టేషన్ సమీపంలో షేక్ సాహెబ్‌ఖాన్‌ను పట్టుకున్నారు. విచారించగా ఏపీ నుంచి గంజాయి తీసుకొచ్చి మహ్మద్ అలీకి ఇస్తున్నట్లు అంగీకరించాడు. ఇద్దరినీ అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి 9 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరు విశాఖ గాజువాకకు చెందిన వారని తేలింది. మలక్‌పేట ఎక్సైజ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమీర్‌పేట్‌లో గంజాయి విక్రయిస్తున్న గుంటూరు జిల్లా బాపట్ల ప్రాంతానికి చెందిన చుక్కా ఆనంద్‌బాబును పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 1.61 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని అమీర్‌పేట ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. శేరిలింగంపల్లిలో గంజాయి విక్రయిస్తున్న నిందితుడు కనిమర్ల సాయి ప్రవీణ్‌ను ఏసీ రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ పట్టుకుంది. అతడి నుంచి 1.06 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుంది. మరో నిందితుడు ఆదిల్ పాషాను అరెస్ట్ చేశారు. అతడి నుంచి 1.11 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

తమ్ముడి దాడి.. సోదరి మృతి

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో తమ్ముడి దాడి చేయడంతో సోదరి మృతిచెందింది. ఓల్డ్ మలక్‌పేట వెంకటరమణ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న లక్ష్మిపై తమ్ముడు మదన్ దాడిచేయగా ఆమె మృతి చెందింది. అడ్డుకోబోయిన మరో సోదరుడు సుదర్శన్ తీవ్రంగా గాయపడ్డాడు. చాదర్‌ఘాట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పైనాపిల్ సబ్జా షర్బత్



శరీర ఉష్ణోగ్రతలను చల్లపర్చటంలో సబ్జా గింజలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. వేసవిలో సబ్జా గింజల ఆధారిత షర్బత్‌లను తాగితే ఎన్నో రకాల ఉపయోగాలు ఉంటాయి. పైనాపిల్, సబ్జా గింజలతో కలిపి షర్బత్ ఎలా చేయవచ్చో తెలుసుకుందాం.

తయారీ విధానం

- పైనాపిల్ పైన తొక్క తీసి చిన్న చిన్న ముక్కలుగా చేయాలి. ఈ ముక్కలను కుక్కర్‌లో వేసి రెండు కూతలు వచ్చే దాకా ఉడికించాలి. ఇలా ఉడికించటం వల్ల పైనాపిల్ మరింత రుచికరంగా తయారవుతుంది.
- రెండు స్పూనుల సబ్జా గింజలను ఒక గిన్నెలో నీళ్లు పోసి నానబెట్టాలి.
- ఉడికిన ముక్కలను మిక్సీలో వేసి ముద్దగా చేయాలి. ఈ ముద్ద నుంచి రసం పిండాలి.
- ఈ రసంలో కొద్దిగా తేనె, వి ౦రియాల పొడి, నిమ్మరసం వేసి కలపాలి. ఆ తర్వాత నానబెట్టిన సబ్జా గింజలను రసంలో వేసుకోవాలి.



కౌన్సెలింగ్

వరుస గర్భస్రావాలకు అడ్డుకట్ట ఎలా?

డాక్టర్! నాకిప్పుడు రెండో నెల. ఇది నా మూడో ప్రెగ్నెన్సీ. గతంలో రెండు సార్లూ ఐదో నెలలోనే గర్భస్రావం అయిపోయింది. రెండో ప్రెగ్నెన్సీలో గర్భసంచికి కుట్లు వేసినా గర్భం నిలవలేదు. ప్రస్తుతం గర్భం నిలవాలంటే ఏం చేయాలి?

- ఓ సోదరి, హైదరాబాద్.



సాధారణంగా గర్భస్రావాన్ని నివారించడం కోసం కొందరు మహిళలకు గర్భసంచి ముఖ ద్వారం దగ్గర సర్వైకల్ స్టిచ్ అవసరమవుతుంది. 16 వారాల తర్వాత గర్భస్రావం అయిన సందర్భాల్లో, 24 వారాల లోపు కాన్పు జరిగిపోతున్న సందర్భాల్లో, ఉమ్మనీరు కోల్పోతున్న సందర్భాల్లో, సర్విక్స్ ప్రాంతంలో సర్జరీలు జరిగి ఉన్న సందర్భాల్లో, గర్భం దాల్చిన 12 నుంచి 24 వారాల మధ్య ఈ కుట్లు వేస్తారు. అయితే మీ విషయంలో గర్భం నిలవడం కోసం గర్భసంచికి కుట్లు వేసినా గర్భస్రావం అయిందని అంటున్నారు. కాబట్టి ఇలాంటి సందర్భాల్లో ట్రాన్స్ అబ్డామినల్ సర్‌క్లేజ్ చేయవలసి ఉంటుంది. పొట్ట మీద చిన్న గాటు పెట్టి, ల్యాప్రోస్కోపీ ద్వారా ఈ చికిత్స చేయడం జరుగుతుంది. అయితే వరుస గర్భస్రావాలు జరుగుతున్న మహిళలకు గర్భం దాల్చక ముందే ఈ చికిత్స చేయాలి. కానీ మీరు ఇప్పటికే గర్భం దాల్చి ఉన్నారు కాబట్టి 12 వారాల స్కాన్ తర్వాత అబ్డామినల్ సర్‌క్లేజ్ వేయించుకోవచ్చు. అందుకు ఎంతో నైపుణ్యం అవసరమవుతుంది. అందుకు నిపుణులైన వైద్యులను ఆశ్రయించాలి. సర్‌క్లేజ్ వేయించుకున్న గర్భిణులకు సాధారణ ప్రసవం సాధ్యపడదు. తప్పనిసరిగా సిజేరియన్ చేయవలసి వస్తుంది. ట్రాన్స్ అబ్డామినల్ సర్‌క్లేజ్ వల్ల గర్భం నిలిచే అవకాశం వెజైనల్ సర్‌క్లేజ్ కంటే మెరుగ్గా ఉంటుంది.

డాక్టర్ ప్రమత శిరీష
కన్సల్టెంట్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్,
బర్త్‌రైట్ బై రెయిన్‌బో, సికింద్రాబాద్.

బెండకాయ నీళ్లతో ఇన్ని లాభాలా..!

బెండకాయలను చిన్న ముక్కలుగా కోసి వెడల్పాటి గిన్నెలో వేయాలి. అవి మునిగేవరకూ నీళ్లు పోసి రాత్రంతా నానబెట్టాలి. తెల్లారిన తరవాత మరో గిన్నెలోకి వడబోయాలి. ఈ నీటినే బెండకాయ నీళ్లు లేదా ఓక్రా వాటర్ అంటారు. ఈ నీటిని తాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం...



- బెండకాయ నీళ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి అకాల వార్ధక్యాన్ని నివారిస్తాయి. చర్మం మీద ముడతలు, ముఖం మీద మొటిమలు రాకుండా కాపాడతాయి. గుండె జబ్బులు రావు.
- బెండకాయ నీళ్లు తాగడం వల్ల సి, కె విటమిన్లు లభిస్తాయి. ఇవి శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీనివల్ల చర్మం బిగుతుగా మృదువుగా ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- మలబద్ధకం రాదు. పేగులు ఆరోగ్యంగా ఉంటాయి. జీర్ణ శక్తి పెరుగుతుంది. కడుపులో ఆమ్లత్వం తగ్గుతుంది.
- రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. మధుమేహ సమస్యలు తలెత్తవు.
- బెండకాయ నీళ్లలో ఫైబర్ కరిగి ఉంటుంది. ఈ నీటిని తాగితే చాలాసేపటివరకూ కడుపు నిండిన భావన ఉంటుంది. దీనివల్ల అతిగా తినాలని అనిపించదు. శరీర బరువు అదుపులో ఉంటుంది.
- శరీరంలో పేరుకున్న చెడు కొలెస్ట్రాల్ కరిగిపోతుంది. గుండె, కాలేయం ఆరోగ్యంగా ఉంటాయి.

సంకల్పం



కాపురం అన్నాక కలహాలు సహజమే. సర్దుకుపోతే అవి టీకప్పులో తుపానులే. ఇది ఒకప్పుడు. మరి ఇప్పుడు..! చిన్న చిన్న మనస్పర్ధలకే ఇక కలిసి ఉండలేమని నిర్ణయానికి వచ్చేస్తున్నాయి జంటలు. లోపం ఎక్కడుంది? ఒకర్ని ఒకరు అర్థం చేసుకోవడంలోనా? వారికి అర్థమయ్యేట్టు చెప్పడంలోనా? భార్యాభర్తలు... తల్లిదండ్రులు... రెండు వైపులా లోపం ఉందంటారు ప్రముఖ న్యాయవాది జ్యోతిరావు. 'మధ్యవర్తిత్వం'తో ఎన్నో జంటలను ఆమె కలిపారు. ఇప్పటిదాకా నాలుగు వందలకు పైగా కేసులు పరిష్కరించిన ఆమె 'నవ్య'తో తన అనుభవాలు పంచుకున్నారు.

బంధాలకు భరోసా

"భార్య, భర్త, పిల్లలు... అందరూ కలిస్తేనే కుటుంబం అవుతుంది. అలా కాకుండా తల్లి దగ్గరో, తండ్రి దగ్గరో... ఒక్కరి వద్దే పిల్లలు పెరిగితే అది వారి మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. ఎలాగైతే ఇద్దరూ కలిసి ఒక ప్రాణిని ఈ ప్రపంచంలోకి తీసుకువచ్చారో, అలాగే కలిసి వాళ్లని పెంచాల్సిన బాధ్యత కూడా భార్యాభర్తలపై ఉంటుంది. భేదాభిప్రాయాలు ఉంటే అవి వారి మధ్యనే ఉండాలి. ఎందుకంటే పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలంటే బలమైన కుటుంబ వ్యవస్థ అనేది ఎంతో కీలకం. న్యాయవాదిగా హైదరాబాద్‌లోనే కాదు, ఢిల్లీలో కూడా వివిధ కోర్టుల్లో ఇలాంటి ఎన్నో కేసులు వాదించిన అనుభవం నాది. ముప్పై ఏళ్లకు పైగా ఈ వృత్తిలో ఉన్నాను. నేను ప్రాక్టీస్ చేసే రోజుల్లో ఒక న్యాయవాదిగా క్లయింట్లు పడే ఇబ్బందులు, ఏళ్లకు ఏళ్లు వాళ్లు కోర్టుల చుట్టూ తిరగడం చూసి నాకు బాధ అనిపించేది. అప్పుడు కూడా చాలావరకు 'మధ్యవర్తిత్వం' (మీడియేషన్) ద్వారా పరిష్కరించేందుకు ప్రయత్నించాను. ముఖ్యంగా దేశంలోని కోర్టుల్లో కోట్ల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని సరిగ్గా నాలుగేళ్ల కిందట హైదరాబాద్‌లో 'అమికా ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ కౌన్సిల్' ప్రారంభించాను. ఇందులో శిక్షణ కూడా ఇస్తున్నాను.

నాలుగు వందలకు పైనే...

మా మధ్యవర్తిత్వ కేంద్రం ద్వారా ఈ నాలుగేళ్లలో నాలుగు వందలకు పైగా కేసులు నా దగ్గరకు వచ్చాయి. అందులో అత్యధికం భార్యాభర్తల గొడవలు. అవికాకుండా కుటుంబంలో ఆస్తి తగాదాలు. వీటిల్లో తొంభై శాతానికి పైగా కేసులు నేను పరిష్కరించాను. విడాకుల వరకు వచ్చిన భార్యాభర్తలను తిరిగి ఒక్కటిగా ఇంటికి పంపగలిగాను. సీపీసీ సెక్షన్ 320 కిందకు వచ్చేవన్నీ మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చు. ఏళ్లకు ఏళ్లు కోర్టుల చుట్టూ తిరిగి కాలం, డబ్బు వృథా కాకుండా మన ముందున్న చక్కని అవకాశం ఇది. ఇరు పార్టీల మధ్య సయోధ్య కుదిర్చి ఒక 'అవార్డు' పాస్ చేస్తాం. కోర్టులో డిక్రీ ఎలాగో ఇది కూడా అలానే చెల్లుతుంది. మధ్యవర్తిత్వం అంటే... రాజీ కుదర్చడం. కోర్టు బయట వివాదాలను పరిష్కరించుకొనే మార్గం.

కౌన్సెలింగ్ అవసరం...

నా దగ్గరకు వచ్చే భార్యాభర్తల కేసుల్లో ఎక్కువగా అనుగుణ్యత (కంపాటబిలిటీ) లేకపోవడం, అనవసరంగా అహానికి పోవడం... ఇలాంటివే ఉంటాయి. ముఖ్యంగా మగవారి నుంచి వచ్చే సమస్య ఏమిటంటే... పిల్లలు పుట్టకపోతే తాము సంసారిక జీవితానికి పనికివస్తారా లేదా అనే పరీక్షలు చేయించుకోరు. ప్రతిదీ భార్య మీద రుద్దేయడం, లేదంటే చప్పుడు కాకుండా పరస్పర అవగాహనతో విడాకులు తీసుకొందామని ఒత్తిడి చేయడం. టెస్టు చేయించుకొంటే అదేదో అపచారం చేసినట్టు చాలామంది మగవాళ్లు భావిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా వారికి వంతపాడుతున్నారు. ఇలాంటివి చాలా కేసులు వచ్చాయి. 'నీవల్లే పిల్లలు కలగడంలేద'ని ఒక అమ్మాయితో భర్త గొడవ. వారు నా దగ్గరకు వచ్చారు. అమ్మాయికి మెడికల్ చెకప్ చేయించి చెప్పాను... 'అమ్మా... నువ్వు ఇతన్ని వదిలేసెయ్. లోపం నీలో లేదు' అని. ఒకవేళ ఇద్దరూ ఉద్యోగస్తులైతే 'నేను రెండు లక్షలు సంపాదిస్తున్నా' అంటే 'నేనూ రెండు లక్షలు సంపాదిస్తున్నా' అని ఇగోలకు వెళుతున్నారు. అంత సంపాదిస్తుండంతో ఒకరి మాట ఒకరు వినరు. అందుకే పెళ్లికి ముందు ఒకరికి ఒకరు సరిపోతారా లేదా అనేది తెలుసుకోవడానికి కౌన్సెలింగ్ అవసరం.



అతిగా కల్పించుకోకూడదు...

ఈ రోజుల్లో పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకోబోయేవరకు తల్లిదండ్రులు పెళ్లయిన పిల్లలతో ఒకటే మాట్లాడడం, ఏదోఒకటి చెప్పడం జరుగుతోంది. పిల్లలు కూడా ప్రతి చిన్న విషయాన్నీ వేరొకరితో పంచుకొంటున్నారు. గోప్యత అనేది లేకుండా పోతోంది. మనం భార్యాభర్తలం, మనది ఒక కుటుంబం అనే స్పృహ ఉండడంలేదు. తల్లిదండ్రులు కూడా పిల్లల సంసారాల్లో అతిగా కలుగచేసుకోకూడదు. ప్రతి విషయంలో దూరిపోకూడదు. దూరం నుంచి గమనిస్తుండాలి. వాళ్ల సమస్యలు వాళ్లు పరిష్కరించుకొనే అవకాశం కల్పించాలి.

కుటుంబ వ్యవస్థ దెబ్బతినడంవల్లే...

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. కుటుంబ వ్యవస్థ దృఢంగా ఉండేది. కానీ ఇప్పుడు భార్య, భర్త, ఒకరిద్దరు పిల్లలతో అతి చిన్న కుటుంబాలు అయిపోయాయి. ఎవరి సంపాదన వారిది. మొబైల్ ఫోన్లవల్ల పక్కపక్కనే ఉన్నా ఎవరి గోల వారిది. చెప్పడానికి అనుభవజ్ఞులైన పెద్దలు లేక ప్రతి చిన్నదానికీ గూగుల్‌లో వెతికి, అలానే చెయ్యాలనే నిర్ణయానికి వచ్చేస్తున్నాం. యాంత్రిక జీవనంలో అనుబంధాలు మాయమైపోతున్నాయి. వీటన్నిటివల్ల కాపురాలు కూలిపోతున్నాయి. పెళ్లయిన మూడు రోజులకే కాదు... ముప్పై ఏళ్లు కలిసి జీవించి తెగదెంపులు చేసుకున్న బంధాలూ ఉంటున్నాయి. ఇవన్నీ కుటుంబ వ్యవస్థ దెబ్బతినడంవల్ల జరిగే పరిణామాలు అనేది నా అభిప్రాయం.

సవాళ్లతో కూడుకున్నది...

కుటుంబ కలహాలు చాలా సున్నితమైనవి. మనం వాళ్లకు దగ్గరగా వెళ్లి, ధైర్యం చెప్పి, ఒప్పించగలగాలి. అందుకు వాళ్లు చెప్పింది ఓపిగ్గా, మనసు పెట్టి వినగలగాలి. తగిన సలహా ఇచ్చి తిరిగి వాళ్లను ఆనందంగా ఇంటికి పంపగలగాలి. నా దృష్టిలో అదే అసలైన మధ్యవర్తిత్వం. ఇది ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. నా దగ్గరకు వచ్చేవారిలో అత్యధికంగా ఆర్థిక స్థోమత లేనివారే ఉంటారు. వాళ్లకు నేను ఉచితంగానే సేవలు అందిస్తాను. ఇవ్వగలిగినవారి నుంచి కూడా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే తక్కువ తీసుకొంటాను. ఎందుకంటే నాకు డబ్బు ముఖ్యం కాదు. అర్థంపర్థంలేని గొడవలతో విచ్ఛిన్నం అవుతున్న మన కుటుంబ వ్యవస్థను నిలబెట్టాలన్నది నా సంకల్పం. కలసి ఉంటే కలదు సుఖం అని పెద్దలు అన్నారు కదా. అందుకే కుటుంబాలను కలిపి ఉంచేందుకు ఓపిక ఉన్నంతవరకూ కృషి చేస్తాను."

• హనుమా

ఎయిర్‌పోర్టులో వదిలేసి...

నా దగ్గరకు విదేశాల్లో ఉండేవారి నుంచి కూడా కేసులు వస్తుంటాయి. అలాంటివారికి ఫోన్‌లోనే మాట్లాడి మధ్యవర్తిత్వం చేస్తుంటాను. కొన్ని కేసులు చూసినప్పుడు గుండె బరువెక్కిపోతుంటుంది. ఒక కేసులో అయితే... తన ఆటిజమ్ పిల్లాడిని, భార్యను విమానాశ్రయంలోనే వదిలేసి విదేశాలకు వెళ్లిపోయాడు ఒకతను. 'పిల్లాడిని చంపేయనన్నా చంపేయ్. లేదా ఇక్కడే వదిలేయ్. కాదంటే నువ్వు కూడా నాతో రావద్దు' అని భర్త అంటే... అందుకు ఆ అమ్మాయి ఒప్పుకోలేదు. తనకు ఉద్యోగం కూడా లేదు. ఎలా బతుకుతుంది? నేను అతనితో ఫోన్‌లో మాట్లాడి మెయింటెనెన్స్ ఇప్పించగలిగాను.

అనాలోచితంగా...

పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లే కాదు, ప్రేమించి, కొన్నేళ్ల సహజీవనం తరువాత చేసుకున్న పెళ్లిళ్లు కూడా ఎక్కువ కాలం నిలబడడంలేదు. విడాకులకు వెళ్లేవాటిలో ప్రేమ పెళ్లిళ్లే ఎక్కువగా ఉంటున్నాయి. ఇందుకు కారణం... తమకు ఏంకావాలో కూడా స్పష్టత లేకుండా జంటలవుతున్నారు. తేడా వస్తే కుటుంబం మొత్తాన్నీ కేసుల్లోకి లాగుతున్నారు. సంబంధాలు కలుపుకొనేటప్పుడు గుణగణాల గురించి ఆలోచించకుండా కేవలం డబ్బు కోణంలోనే అన్నిటినీ బేరీజు వేసుకొంటున్నారు. సమస్య వచ్చినప్పుడు ఒకరినొకరు అర్థం చేసుకోకపోవడంవల్లే కాదు, వారికి అర్థమయ్యేట్టు చెప్పేవాళ్లు లేక కూడా బంధాలు బలహీనపడుతున్నాయి.

అభిరుచే ఆదాయ వనరుగా...

మనలో చాలామంది చిన్నప్పుడు పేపర్లతో రకరకాల వస్తువులు చేసే ఉంటారు. కానీ వాటిపై మక్కువ పెంచుకొని.. దానినే ఆదాయ వనరుగా మార్చుకొనేవారు తక్కువ మందే కనిపిస్తారు. అది కూడా పర్యావరణహితంగా! ఒడిశాకు చెందిన అలాంటి గిరిజన మహిళ సుధారాణి మరాండి.



చిన్నప్పటి నుంచి సుధారాణికి హస్తకళలంటే ఆసక్తి. ఖాళీ సమయాల్లో పాత పేపర్లను తీసుకొని కట్ చేస్తూ ఉండేది. రకరకాల ఆకృతులు చేసేది. ఇంట్లో వారికి చదువుకోకుండా ఇలా ఆకృతులు చేయటం ఇష్టం ఉండేది కాదు. "నన్ను ఒక అధికారిగా చూడాలనేది నాన్న ఆశ. నాకు హస్తకళలంటే ఇష్టం. ఇంట్లోవాళ్లు నన్ను చదువుకొమ్మని ఒత్తిడి పెడుతూ ఉండేవారు. కానీ నేను చేసిన ఆకృతులు చూసి స్కూల్లో నన్ను ప్రశంసిస్తూ ఉండేవారు. ఇంట్లో అమ్మ, నాన్నలకు తెలియకుండా క్విల్లింగ్ పేపర్ కొని ఆకృతులు తయారుచేసేదాన్ని" అంటారు సుధారాణి. స్కూలు నుంచి కాలేజీకి వచ్చిన తర్వాత కూడా ఈ అభిరుచి కొనసాగింది. కాగితంతో ఆకృతులు ఎక్కువ కాలం నిలవవు. అందుకని చెట్ల నారుతో కూడా ఆకృతులు తయారుచేసేది. "చెట్ల నారుతో తయారు చేయటం అంత సులభం కాదు. కానీ చూడటానికి చాలా బావుంటాయి. ఈ మధ్యకాలంలో నారుతో తయారుచేసే రకరకాల ఆకృతులకు మంచి డిమాండ్ ఉంది" అంటారు సుధారాణి. మొదట్లో తన స్నేహితులకు ఈ ఆకృతులను బహుమతులుగా ఇచ్చేది. తర్వాత కొందరు వీటిని కొనుగోలు చేయటం మొదలుపెట్టారు. ఇలా సుధారాణి ప్రస్థానం ముందుకు సాగింది. 2106లో ఎంబీఏలో చేరిన తర్వాత సుధారాణికి ఈ తరహా ఉత్పత్తులకు ఉన్న అవకాశాల గురించి తెలిసింది. స్థానికంగా ఉన్న ఫైబర్ బోర్డు సహకారంతో రకరకాల టిష్యూ బాక్స్‌లు తయారుచేయటం.. వాడిపడేసిన కార్డ్‌బోర్డులు, టెట్రాప్యాక్‌లతో అందమైన కళాకృతులు రూపొందించటం మొదలుపెట్టింది. "ప్రతి వారి ఇంట్లో బాక్సులు ఉంటాయి. టెట్రాప్యాక్‌లు కూడా ఉంటాయి. వీటిని బయట పడేస్తూ ఉంటాం. ఇలాంటి వాటిని సేకరించి వాటిని ఆదాయ వనరులుగా మార్చుకోవచ్చు" అంటారు సుధారాణి.

నెమ్మదిగా...

మొదట్లో ఇంటి నుంచే కళాకృతులు విక్రయించిన సుధారాణి 2018లో 'ఝునుక్ క్రాఫ్ట్స్'ను ప్రారంభించింది. మార్కెట్లో మిషన్లపై తయారు చేసే రకరకాల ఆకృతులు అందుబాటులో ఉండటంతో సుధారాణికి మొదట్లో వ్యాపారం అనుకున్నంత విజయవంతమవ్వలేదు. ఆ తర్వాత నెమ్మదిగా ఆన్‌లైన్ అమ్మకాలు ప్రారంభమయ్యాయి. దీనితో తనతో పాటుగా మరి కొంత మంది మహిళలకు ఉపాధి కల్పించటం ప్రారంభించింది. "ప్రస్తుతం నా ఆదాయం లక్షల్లో ఉంది. ఆదాయం కన్నా నేను చిన్నప్పుడు ఆకృతులు చేస్తుంటే అడ్డుకున్న నాన్న నన్ను పొగుడుతున్నారు. అంతే నేను ఎంచుకున్న మార్గం విజయవంతమయినట్లే కదా.." అంటారు సుధారాణి.

కొంతమంది ప్రతి చిన్న విషయాన్నీ భూతద్దంలో చూస్తూ అతిగా ఆలోచిస్తూ ఉంటారు. దీనివల్ల మానసిక ప్రశాంతత దెబ్బతింటుంది. అనవసరమైన ఆలోచనలను దూరం చేసేందుకు నిపుణులు సూచిస్తున్న చిట్కాలు ఇవే...

అతిగా ఆలోచించవద్దు..!



- మనసుకు నచ్చిన పని చేస్తూ అందులో లీనమైతే అనవసరమైన ఆలోచనలు రావు. ఏదైనా హాబీ, సృజనాత్మక కార్యక్రమాలు, చేతి పనులు లాంటి వాటి మీదికి దృష్టి మరలిస్తే ఆందోళన అనేదే ఉండదు.
- భయం, ఆందోళనలను మౌనంగా భరించకుండా స్నేహితులు లేదా కుటుంబ సభ్యులతో పంచుకుంటే ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది.
- ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం కొద్దిసేపు ధ్యానం చేస్తూ ఉంటే భావోద్వేగాలపై నియంత్రణ పెరుగుతుంది. ఆలోచనలు నిశ్చలంగా ఉంటాయి.
- ప్రతికూలంగా మాట్లాడుతూ నిరుత్సాహపరచేవారి నుంచి దూరంగా ఉండడం మంచిది. దీనివల్ల మానసిక ఆందోళన తగ్గుతుంది.
- మనసులోని భావాలను కాగితం మీద రాయడం అలవాటు చేసుకుంటే భారమైన భావోద్వేగాలు బయటికి వ్యక్తమవుతాయి. మనసు తేలిక పడుతుంది.
- ప్రకృతిని ఆస్వాదిస్తూ విహారయాత్రలకు వెళ్లడం వల్ల మనసు ఉపశమనం పొందుతుంది. కొత్త ప్రదేశాలు చూసినప్పుడు కలిగే అనుభూతులు... అనవసరమైన ఆలోచనలను దూరం చేస్తాయి.
- గతం, భవిష్యత్తుల గురించి మాత్రమే కాకుండా ప్రస్తుతానికి కూడా ప్రాధాన్యమిస్తే ఎటువంటి ఆలోచనలూ లేకుండా మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది.
- విపరీతంగా ఆలోచించడం వల్ల మనసు అలసిపోతుంది. ఇలాంటప్పుడు గాలి బాగా వీచే ప్రదేశంలో ప్రశాంతంగా కూర్చోవాలి. నాలుగు సెకన్లపాటు గాలిని నెమ్మదిగా లోపలికి పీల్చి నాలుగు సెకన్లు పట్టి ఉంచాలి. తరవాత నాలుగు సెకన్లపాటు గాలిని నెమ్మదిగా వదలాలి. ఇలా రెండు లేదా మూడుసార్లు చేస్తే అనవసరమైన ఆలోచనల నుంచి మనసు మరలుతుంది.
- తేలికపాటి వ్యాయామం, సైకిల్ తొక్కడం, ఆటలు ఆడడం, నడకలను దినచర్యలో భాగం చేసుకుంటూ సమయానుసారం ప్రశాంతంగా నిద్రిస్తే అనవసరమైన ఆలోచనలు దరిచేరవు.



ఒలింపిక్స్‌లో కాంపౌండ్ ఆర్చరీ

2028 లాస్ ఏంజిల్స్ క్రీడల్లో చోటు

న్యూఢిల్లీ: దేశ కాంపౌండ్ ఆర్చర్ల సుదీర్ఘ ఎదురు చూపులు ఫలించాయి. 2028 లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో కాంపౌండ్ ఆర్చరీని ప్రవేశపెట్టనున్నట్టు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) బుధవారం వెల్లడించింది. అయితే కేవలం మిక్స్‌డ్ టీమ్ విభాగంలోనే పోటీలు నిర్వహిస్తారు. 1972 విశ్వ క్రీడల్లో ఆర్చరీని పునఃప్రవేశపెట్టాక రికర్వ్ ఆర్చరీలో మాత్రమే పోటీలు జరుగుతున్నాయి. కాంపౌండ్ విభాగాన్ని కూడా ఒలింపిక్స్‌లో చేర్చాలని వరల్డ్ ఆర్చరీ ఎంతో కాలంగా ఐఓసీని డిమాండ్ చేస్తోంది. విశ్వ క్రీడల్లో మొత్తం ఐదు విభాగాలు..పురుషులు, మహిళలు వ్యక్తిగత, పురుషులు, మహిళలు టీమ్, మిక్స్‌డ్‌లో పోటీలు జరుగుతున్నాయి. ఇప్పుడు.. కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంతో కలిపి ఆరుకు చేరతాయి.

జ్యోతి సురేఖ హర్షం: కాంపౌండ్ వ్యక్తిగత, టీమ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాలలో తెలుగు ఆర్చర్ వెన్నం జ్యోతిసురేఖ ప్రపంచ పోటీలలో అద్భుతంగా రాణిస్తోంది. వరల్డ్ కప్, వరల్డ్ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడల్లో ఆమె ఈ విభాగాలలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కొల్లగొట్టింది. ఒలింపిక్స్‌లో కూడా కాంపౌండ్ ఆర్చరీని ప్రవేశపెడితే స్వర్ణం గెలవగలనన్న ధీమాతో ఆమె ఉంది. ఈనేపథ్యంలో ఓఐసీ నిర్ణయంతో 28 ఏళ్ల జ్యోతి సురేఖ హర్షం వ్యక్తంజేసింది.

నకమురతో అర్జున్ గేమ్ డ్రా

పారిస్: ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్ టూర్ పారిస్ అంచె..క్వార్టర్ ఫైనల్ మొదటి గేమ్‌ను భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి డ్రా చేసుకున్నాడు. అర్జున్-అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ హికరు నకముర మధ్య బుధవారం జరిగిన ఈ గేమ్ 77 ఎత్తులపాటు హోరాహోరీగా సాగింది. తెల్లపావులతో ఆడిన అర్జున్ చివరకు నకమురను నిలువరించాడు. గురువారం జరిగే రెండో గేమ్‌లో నకముర తెల్లపావులతో ఆడతాడు. ఆ గేమ్ కూడా డ్రా అయితే విజేతను తేల్చేందుకు ప్లేఆఫ్స్ నిర్వహిస్తారు. విన్సెంట్ కీమర్-నెపోమ్నియాచి, లగ్రావ్-కరువానా మధ్య క్వార్టర్‌ఫైనల్స్ తొలి గేమ్‌లు కూడా ఫలితం తేలలేదు. అయితే అబ్దుసతొరోవ్‌పై కార్ల్‌సన్ విజయం సాధించాడు.


ఐపీఎల్‌లో నేడు | వేదిక: బెంగళూరు
బెంగళూరు x ఢిల్లీ — రా.7.30

గుజరాత్ గెలుపు జోరు

58 పరుగులతో రాజస్థాన్ చిత్తు

వరుస విజయాలతో దుమ్మురేపుతున్న గుజరాత్ టైటాన్స్.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకొంది. ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో రాజస్థాన్‌ను చిత్తు చేసిన టైటాన్స్.. వరుసగా నాలుగో విజయాన్ని తమ ఖాతాలో వేసుకొంది. సాయి సుదర్శన్ క్లాసిక్ ఆటతో భారీ స్కోరు చేసిన గుజరాత్.. బంతితోనూ రాయల్స్ పనిబట్టింది.

మెరిసిన సుదర్శన్



సాయి సుదర్శన్ (53 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 82)

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ గెలుపు జోరును కొనసాగిస్తోంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సాయి సుదర్శన్ (53 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సలతో 82)తోపాటు బౌలర్లు సమష్టిగా చెలరేగడంతో.. బుధవారం జరిగిన మ్యాచ్ గుజరాత్ 58 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను మట్టికరిపించింది. తొలుత గుజరాత్ 20 ఓవర్లలో 217/6 స్కోరు చేసింది. బట్లర్ (36), షారుక్ ఖాన్ (20 బంతుల్లో 36) రాణించారు. తీక్షణ, తుషార్ దేశ్‌పాండే చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో రాజస్థాన్ 19.2 ఓవర్లలో 159 పరుగులకే కుప్పకూలింది. హెట్‌మయర్ (52), సంజూ శాంసన్ (41) శ్రమ వృథా అయింది. ప్రసిద్ధ్ కృష్ణ 3, సాయి కిశోర్, రషీద్ చెరో 2 వికెట్లు తీశారు.

బ్యాటర్లు విఫలం: ఛేదన ఆరంభంలోనే జైస్వాల్ (6), నితీశ్ రాణా (1) వికెట్లను చేజార్చుకొన్న రాజస్థాన్.. ఏదశలోనూ మ్యాచ్‌లోకి రాలేక పోయింది. టైటాన్స్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొడుతూ.. స్కోరుబోర్డుకు పగ్గాలేశారు. జైస్వాల్‌ను అర్షద్ అవుట్ చేయగా.. రాణాను సిరాజ్ బోల్తాకొట్టించాడు. కానీ, కెప్టెన్ శాంసన్, రియాన్ పరాగ్ (26) మూడో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, పరాగ్‌ను ఖేజ్రోలియా.. ధ్రువ్ జురెల్ (5) రషీద్ వెనక్కిపంపడంతో రాజస్థాన్ 68/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో శాంసన్, హెట్‌మయర్ ఐదో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యంతో ఆశలు రేపారు. కానీ, వీరిద్దరినీ కృష్ణ అవుట్ చేయడంతో రాజస్థాన్ పోరాటం ముగిసింది.

నడిపించిన సుదర్శన్: ఓపెనర్ సుదర్శన్ కళాత్మక అర్ధ శతకంతో ముందుండి నడిపించడంతో.. గుజరాత్ సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టైటాన్స్‌ను ఆర్చర్ ఆరంభంలోనే దెబ్బతీశాడు. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (2)ను స్వల్ప స్కోరుకే అవుట్ చేశాడు. కానీ, బట్లర్‌తో కలసి రెండో వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యంతో పటిష్ట పునాది వేసిన సుదర్శన్.. మూడో వికెట్‌కు షారుఖ్‌తో కలసి 62 పరుగులు జోడించడంతో టైటాన్స్ భారీ స్కోరు చేసింది. దేశ్‌పాండే వేసిన నాలుగో ఓవర్‌లో సుదర్శన్ 18 పరుగులు రాబట్టాడు. కానీ, మరో ఎండ్‌లో బట్లర్ ఆచితూచి ఆడడంతో.. ఆరు ఓవర్లకు టైటాన్స్ 56/1తో నిలిచింది. క్రీజులో కుదురుకొన్న బట్లర్.. ఫరూకీ బౌలింగ్‌లో రెండు ఫోర్లతో బ్యాట్‌కు పనిచెప్పాడు. అయితే, 10వ ఓవర్‌లో తీక్షణ బౌలింగ్‌లో సింగిల్‌తో సుదర్శన్ ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నా.. అదే ఓవర్‌లో బట్లర్ వికెట్ల ముందు దొరికిపోయాడు. ఈ దశలో షారుక్ క్రీజులోకి రావడంతో స్కోరు బోర్డు ఊపందుకొంది. రెండు వరుస బౌండ్రీలతో బ్యాట్‌కు పని చెప్పిన షారుక్.. తుషార్ బౌలింగ్‌లో సిక్స్ బాదాడు. ఇక, తీక్షణ బౌలింగ్‌లో 6,4,4తో చెలరేగిన షారుక్.. డెత్ ఓవర్లలో విజృంభిస్తాడనుకొంటే స్టంపౌటయ్యాడు. రూథర్‌ఫోర్డ్ (6)ను సందీప్ పెవిలియన్ చేర్చగా.. సుదర్శన్, రషీద్ (12)లను దేశ్‌పాండే అవుట్ చేశాడు. కానీ, చివరి ఓవర్‌లో ధాటిగా ఆడిన తెవాటియా (24 నాటౌట్) టీమ్ స్కోరును 220కి చేరువ చేశాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	5	4	1	0	8	1.413
ఢిల్లీ	3	3	0	0	6	1.257
బెంగళూరు	4	3	1	0	6	1.015
పంజాబ్	4	3	1	0	6	0.289
లఖ్‌నవూ	5	3	2	0	6	0.078
కోల్‌కతా	5	2	3	0	4	-0.056
రాజస్థాన్	5	2	3	0	4	-0.733
ముంబై	5	1	4	0	2	-0.010
చెన్నై	5	1	4	0	2	-0.889
హైదరాబాద్	5	1	4	0	2	-1.629

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) శాంసన్ (బి) దేశ్‌పాండే 82, గిల్ (బి) ఆర్చర్ 2, బట్లర్ (ఎల్బీ) తీక్షణ 36, షారుక్ ఖాన్ (స్టంప్డ్) శాంసన్ (బి) తీక్షణ 36, రూథర్‌ఫర్డ్ (సి) శాంసన్ (బి) సందీప్ 7, తెవాటియా (నాటౌట్) 24, రషీద్ (సి) జైస్వాల్ (బి) దేశ్‌పాండే 12, అర్షద్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 20 ఓవర్లలో 217/6; వికెట్ల పతనం:** 1-14, 2-94, 3-156, 4-163, 5-187, 6-201; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-30-1, ఫరూఖీ 4-0-38-0, తుషార్ దేశ్‌పాండే 4-0-53-2, సందీప్ శర్మ 4-0-41-1, తీక్షణ 4-0-54-2.

రాజస్థాన్: జైస్వాల్ (సి) రషీద్ (బి) అర్షద్ 6, సంజూ శాంసన్ (సి) సాయి కిషోర్ (బి) ప్రసిద్ధ్ 41, నితీశ్ రాణా (సి) ఖేజ్రోలియా (బి) సిరాజ్ 1, పరాగ్ (సి) బట్లర్ (బి) ఖేజ్రోలియా 26, జురెల్ (సి) సాయి సుదర్శన్ (బి) రషీద్ 5, హెట్‌మయెర్ (సి) సాయి కిషోర్ (బి) ప్రసిద్ధ్ 52, శుభమ్ దూబే (ఎల్బీ) రషీద్ 1, ఆర్చర్ (సి) గిల్ (బి) ప్రసిద్ధ్ 4, తీక్షణ (సి) సాయి సుదర్శన్ (బి) సాయి కిషోర్ 5, తుషార్ దేశ్‌పాండే (సి) రషీద్ (బి) సాయి కిషోర్ 3, సందీప్ శర్మ (నాటౌట్) 6, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 19.2 ఓవర్లలో 159 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-10, 2-12, 3-60, 4-68, 5-116, 6-119, 7-144, 8-145, 9-150, 10-159; **బౌలింగ్:** సిరాజ్ 4-0-30-1, అర్షద్ 2-0-19-1, ప్రసిద్ధ్ కృష్ణ 4-0-24-3, కుల్వంత్ ఖేజ్రోలియా 3-0-29-1, రషీద్ 4-0-37-2, సాయి కిషోర్ 2.2-0-20-2.

రుద్రాంక్ష్ జోడీకి రజతం

షూటింగ్ వరల్డ్ కప్

బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భారత షూటర్ల పతక జోరు కొనసాగుతోంది. బుధవారం జరిగిన పోటీల్లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రుద్రాంక్ష్ పాటిల్/ఆర్య బోర్సే ద్వయం రజతం సాధించింది. ఫైనల్లో భారత జోడీ 9-17తో చైనా జంట జీఫీ వాంగ్/బుహాన్ సాంగ్ చేతిలో ఓడి పసిడి పతకాన్ని చేజార్చుకుంది. ఇక, కాంస్య పతక పోరులో భారత్‌కే చెందిన అర్జున్/నర్మద జంట 13-17తో అర్జెంటీనాకు చెందిన ఫెర్నాండ రూసో/మార్సెలో చేతిలో ఓటమిపాలైంది. ఇక, భారత కాలమాన ప్రకారం మంగళవారం అర్ధరాత్రి జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ విజయ్‌వీర్ సిద్ధు స్వర్ణం దక్కించుకున్నాడు.

ఆర్చరీ ప్రపంచకప్‌లో భారత్‌కు కాంస్యం

అబన్‌డేల్ (అమెరికా): ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1 పోటీల్లో భారత పురుషుల కాంపౌండ్ జట్టు కాంస్య పతకం సాధించింది. బుధవారం ఇక్కడ జరిగిన కాంస్య పతక పోరులో అభిషేక్, ఓజాస్, రిషభ్‌లతో కూడిన భారత బృందం 230-223తో డెన్మార్క్‌పై గెలిచింది.

నీ కోసమే వచ్చాం..



న్యూఢిల్లీ: ప్రముఖ యూట్యూబర్, ఆర్జే మహ్‌వశ్ ఐపీఎల్‌లో ఇప్పుడు సందడి చేస్తోంది. పంజాబ్ కింగ్స్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్‌తో డేటింగ్‌లో ఉందన్న వార్తలకు బలం చేకూరుస్తూ అతనాడే ప్రతి మ్యాచ్‌కూ హాజరవుతోంది. చండీగఢ్‌లో మంగళవారం చెన్నైతో జరిగిన మ్యాచ్‌లోనూ కనిపించిన మహ్‌వశ్.. ఇక్కడికి నీకోసమే వచ్చానంటూ చాహల్‌తో దిగిన సెల్ఫీతో పాటు స్నేహితులతో కలిసి మ్యాచ్‌ను ఎంజాయ్ చేస్తున్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. 'నీ వెనకాల ఉండి మద్దతిచ్చే వారిలో మేమున్నాం. నీకోసమే ఇక్కడికి వచ్చాం' అని ఆ ఫొటోల కింద రాసుకొచ్చింది. ఈ పోస్టును లైక్ చేసిన చాహల్.. మీరే నా వెన్నెముక అంటూ ఆ ఫొటోలకు కామెంట్ పెట్టాడు. గతంలో కొరియోగ్రాఫర్, యూట్యూబర్ ధనశ్రీ వర్మను పెళ్లాడిన చాహల్.. ఇటీవలే ఆమెకు విడాకులిచ్చిన సంగతి తెలిసిందే.

సింధు ముందుకు

ప్రణయ్, లక్ష్య, ఆకర్షి ఇంటికి

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పీవీ సింధు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో సింధు 21-15, 21-19తో ఎస్తర్ వర్దాయో (ఇండోనేసియా)పై గెలిచి ప్రీక్వార్టర్స్ చేరింది. ఇక, పురుషుల సింగిల్స్‌లో స్టార్ షట్లర్లు హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ పోరాటం తొలిరౌండ్‌కే పరిమితమైంది. ప్రణయ్ 16-21, 21-12, 11-21తో జు గువాంగ్ లూ (చైనా) చేతిలో, లక్ష్య సేన్ 18-21, 10-21తో లీ చియా హావో (చైనా) చేతిలో ఓడారు. కాగా, యువ షట్లర్లు కిరణ్ జార్జ్ 21-16, 21-8తో దిమిత్రీ పనారిన్ (కజకిస్థాన్)పై, ప్రియాన్షు రజావత్ 20-22, 21-12, 21-10తో కంటపాన్ వాంగ్‌చరోన్ (థాయ్‌లాండ్)పై నెగ్గి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించారు.

పంత్.. దొంగనొప్పి!

» నటన అద్భుతం అంటున్న నెటిజన్లు



న్యూఢిల్లీ: కోల్‌కతాతో మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించాడంటూ నెట్‌లో విమర్శల వర్షం కురుస్తోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ 4 పరుగుల తేడాతో కోల్‌కతాపై గెలిచింది. అయితే, ఈ మ్యాచ్‌లో రహానె (61) దూకుడుగా ఆడుతుండడంతో ఒక దశలో కోల్‌కతా 149/2తో గెలుపు దిశగా దూసుకెళ్తోంది. విజయానికి 8 ఓవర్లలో 90 పరుగులు కావాలి. ఈ క్రమంలో 13వ ఓవర్ బౌల్ చేయడానికి శార్దూల్ సిద్ధమైన సమయంలో.. పంత్ నడుం నొప్పి అంటూ మెడికల్ టైమవుట్ తీసుకొన్నాడు. దీంతో కోల్‌కతా బ్యాటర్ల ఏకాగ్రత చెదిరింది. మరోవైపు వ్యూహాత్మకంగా వైడ్‌లు వేసిన శార్దూల్.. రహానెను అవుట్ చేయడంతో తడబడిన కోల్‌కతా గెలుపు వాకిట బోల్తాపడింది. అయితే, పంత్ దొంగ నొప్పితో కోల్‌కతా లయను దెబ్బతీశాడని నెటిజన్లు ఆరోపిస్తున్నారు. గతేడాది టీ20 వరల్డ్‌కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికా జోరును అడ్డుకోవడానికి పంత్ ఇలాగే మోకాలి నొప్పి అంటూ నాటకం ఆడాడని గుర్తు చేస్తున్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

కల్యాణ్‌రామ్ నట విశ్వరూపం చూస్తారు

విజయశాంతి



'కల్యాణ్‌రామ్ విలువలున్న మనిషి. ఎన్టీ రామారావు గారి మనవడు. ఆ క్రమశిక్షణ ఎక్కడికి పోతుంది. అతను చేసే ప్రతి పనిలోనూ ఆ సంస్కారం కనిపిస్తుంది 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' చిత్రంలో ఆయన నట విశ్వరూపం చూస్తారు' అని నటి విజయశాంతి అన్నారు. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం చిత్తూరులో నిర్వహించిన కార్యక్రమంలో 'ముచ్చటగా బంధాలే' అంటూ సాగే గీతాన్ని మేకర్స్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విజయశాంతి, కల్యాణ్‌రామ్, హీరోయిన్ సాయి మంజ్రేకర్, నిర్మాత అశోక్‌వర్ధన్ ముప్పా తదితరులు పాల్గొన్నారు. కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ 'ఈ నెల 12న మన సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఉంది. ఆ కార్యక్రమానికి తమ్ముడు ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా వస్తున్నాడు' అని చెప్పారు.

యోగిని కలసిన కన్నప్ప టీమ్




'కన్నప్ప' చిత్రబృందం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. వారిని సాదరంగా ఆహ్వానించిన యోగి.. ఈ సినిమా విడుదల తేదీతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జూన్ 27న 'కన్నప్ప' సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయనకు ప్రముఖ చిత్రకారుడు రమేశ్ గిరిజాల గీసిన ఓ పెయింటింగ్‌ను డా.మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా బహూకరించారు. కాగా, ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మంచు విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్నారు. ప్రీతీ ముకుందన్ కథానాయిక. మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ప్రభాస్, అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, కాజల్ ఇందులో నటిస్తున్నారు.

ఎన్టీఆర్ అడుగు పెడుతున్నారు



జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా షూట్ ఇటీవలె ప్రారంభమైన సంగతి తెలిసిందే. తాజాగా, ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్‌ను నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఎక్స్ వేదికగా షేర్ చేసింది. "ఎన్టీఆర్-నీల్ సినిమా కీలక షెడ్యూల్‌కు సిద్ధమైంది. ఈనెల 22 నుంచి సినిమా సెట్స్‌లోకి ఎన్టీఆర్ అడుగుపెడుతున్నారు" అని పేర్కొంది. వచ్చే ఏడాది జనవరి 9న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రుక్మిణీ వసంత్ కథానాయిక. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు.

లక్షల్లో ఒక్కరికి మాత్రమే లభించే అవకాశం ఇది



ప్రదీప్ మాచిరాజు హీరోగా నటించిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రదీప్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ చిత్ర విశేషాలు వెల్లడించారు. 'యాంకర్ నుంచి నటుడిగా మారడం చాలా లక్కీగా ఫీల్ అవుతున్నాను. ఇప్పుడు నా పై మరింత బాధ్యత పెరిగిందని భావిస్తున్నాను. లక్షల్లో ఒక్కరికి మాత్రమే లభించే అవకాశం ఇది' అని చెప్పారాయన. హీరోగా తన రెండో సినిమా గురించి మాట్లాడుతూ 'తొలి సినిమా తర్వాత మంచి కంటెంట్‌తో మరో సినిమా చేయాలని ప్లాన్ చేశాం. ఆసక్తి, ప్యాషన్ ఉన్న వాళ్లందరం కలసి ఈ సినిమా చేశాం. మంచి కథ దొరకడానికి ఇంత కాలం పట్టింది' అని వివరించారు. సినిమాలో తన పాత్ర గురించి వివరిస్తూ 'ఇందులో కృష్ణ అనే పాత్ర పోషించాను. సినిమాలో నేను ఎంత చిరాకు పడతానో ప్రేక్షకులు అంత ఎంటర్‌టైన్ అవుతారు. ఫ్యామిలీ అంతా కూర్చుని సమ్మర్‌లో హ్యాపీగా చూసే సినిమా ఇది. పవన్‌కల్యాణ్ తొలి సినిమా టైటిల్‌తో ఈ చిత్రం చేయడం మాపై బాధ్యతను మరింత పెంచింది. అందుకే అన్ని జాగ్రత్తలు తీసుకుని సినిమా తీశాం. మా కథకు సరిపోయే టైటిల్ ఇది. దర్శకులు నితిన్, భరత్ నాతో ఎప్పటినుంచో జర్నీ చేస్తున్నారు. నా టైమింగ్ వారికి తెలుసు. దానికి తగ్గట్లుగా ఈ కథను అందంగా తెరపై మలిచారు' అని చెప్పారు.

నేనలా మాట్లాడి ఉండాల్సింది కాదు



'బాషా' చిత్రం శతదినోత్సవంలో నాటి ముఖ్యమంత్రి జయలలితపై తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ చేసిన తీవ్ర విమర్శలు అప్పట్లో సంచలనం సృష్టించడంతో పాటు తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలకు కారణమయ్యాయి. ఈ పరిణామాల్లో మొదటిది ఆ వేడుకలో వేదికపైనున్న అన్నాడీఎంకేకు చెందిన సీనియర్ నేత ఆర్ఎం వీరప్పన్ జయ ఆగ్రహానికి గురవడంతో పాటు మంత్రి పదవిని కోల్పోవాల్సివచ్చింది. ఆ తరువాత ఆయన కన్నుమూసేవరకూ రాజకీయంగా కోలుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో ఆర్ఎం వీరప్పన్‌పై 'ఆర్ఎంవీ ది కింగ్ మేకర్' పేరుతో రూపొందిన ఓ డాక్యుమెంటరీలో రజనీ తమ స్నేహం గురించి గుర్తు చేసుకున్నారు. 'బాషా' చిత్రం వందరోజుల వేడుకల్లో నేను రాష్ట్రంలో బాంబుల సంస్కృతి గురించి ప్రస్తావించాను. వేదికపై ఆర్ఎం వీరప్పన్‌ను ఉంచుకొని నేనలా మాట్లాడి ఉండాల్సింది కాదు. నాకు అప్పుడు అంత పరిజ్ఞానం లేదు. అప్పుడు ఆయన అన్నాడీఎంకే ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. 'నువ్వు మంత్రిగా వేదికపై వుండగా, నా ప్రభుత్వానికి వ్యతిరేకంగా రజనీ ఎలా మాట్లాడారు?' అంటూ దివంగత ముఖ్యమంత్రి జయ ఆర్ఎం వీరప్పన్‌ను పదవి నుంచి తొలగించారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే నేను షాక్‌కు గురయ్యాను. ఇలా జరగడానికి నేనే కారణమని తెలిసి, ఎంతో బాధపడ్డాను. ఆ రాత్రంతా నిద్రపోలేకపోయాను. ఆయన్ని కలిసి క్షమాపణ చెప్పాను. కానీ, ఆయన ఏమీ జరగనట్లు మాట్లాడారు. చాలా సాధారణంగా వున్నారు. జయకు వ్యతిరేకంగా మాట్లాడడానికి కొన్ని కారణాలు ఉన్నప్పటికీ, ఆ వేదికపై అలా మాట్లాడివుండాల్సింది కాదు. 'నేను జయతో మాట్లాడనా?' అని ఆయన్ని అడిగాను. కానీ నీ ఆత్మగౌరవం కోల్పోవద్దని నాకు సలహా ఇచ్చారు. అంతేగాక 'మీ చేత చెప్పించుకుని అక్కడకు పోయి చేరాల్సిన అవసరం నాకు లేదు. ఈ విషయం ఇంతటితో వదిలేయండి' అన్నారు. అలాంటి ఒక గొప్ప మనిషి ఆయన. వీరప్పన్ 'కింగ్ మేకర్...రియల్ కింగ్ మేకర్' అని రజనీ పేర్కొన్నారు.

రుణగ్రహీతలకు ఊరట

తగ్గనున్న గృహ, వాహన, వ్యక్తిగత రుణ రేట్లు.. ఈఎంఐ చెల్లింపుల భారం కూడా..

రెపో రేటు 0.25 శాతం తగ్గింపు.. 6.25% నుంచి 6 శాతానికి దిగివచ్చిన రెపో

- కీలక వడ్డీ రేట్లపై భవిష్యత్ వైఖరి తటస్థం నుంచి అనుకూల స్థాయికి మార్పు
- ముున్ముందు మరింత తగ్గిస్తామని సంకేతాలు
- 2025-26 ఆర్థిక సంవత్సర వృద్ధి అంచనా 6.7 శాతం నుంచి 6.5 శాతానికి కుదింపు
- ద్రవ్యోల్బణం అంచనా 4 శాతానికి తగ్గింపు
- పరపతి సమీక్ష నిర్ణయాలు ప్రకటించిన ఆర్‌బీఐ
- జూన్ 4-6 తేదీల్లో తదుపరి సమీక్ష నిర్వహణ



ముంబై: రుణగ్రహీతలకు శుభవార్త. గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లు ఇక తగ్గుముఖం పట్టనున్నాయి. ఇప్పటికే రుణాలు తీసుకున్న వారిపై నెలవారీ కిస్తీ (ఈఎంఐ)ల భారం కాస్త తగ్గనుంది. ఎందుకంటే, బ్యాంకుల రుణ రేట్లకు ప్రామాణికాల్లో ఒకటైన రెపో రేటును మరో పావు (0.25) శాతం తగ్గిస్తున్నట్లు ద్రవ్య పరపతి సమీక్షలో భాగంగా ఆర్‌బీఐ గురువారం ప్రకటించింది. దాంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గింది. అంతేకాదు, కీలక వడ్డీ (రెపో) రేటుపై భవిష్యత్ వైఖరిని కూడా 'తటస్థం' నుంచి 'సర్దుబాటుకు అనుకూల' స్థాయికి మార్చింది. అంటే, ముున్ముందు సమీక్షల్లో మరింత తగ్గించే అవకాశాలున్నాయని సంకేతాలిచ్చింది. సర్దుబాటుకు అనుకూల స్థాయి వైఖరితో రిజర్వ్ బ్యాంక్ అవసరాన్ని బట్టి వడ్డీ రేట్లను తగ్గించడం లేదా యథాతథంగా కొనసాగిస్తుంది. అంతే తప్ప పెంచదు. ఆర్‌బీఐ 'రెపో'ను తగ్గించడం వరుసగా ఇది రెండోసారి. 2020 మే తర్వాత తొలిసారిగా ఈ ఫిబ్రవరి సమీక్షలోనూ పావు శాతం తగ్గించింది. తాజా రెపో తగ్గింపు ప్రయోజనాన్ని బ్యాంకులు పూర్తిగా కస్టమర్లకు బదిలీ చేసిన పక్షంలో (రెపో ప్రామాణిక) రుణాలపై వడ్డీ రేట్లు 2022 నవంబరు నాటి కనిష్ఠ స్థాయికి తగ్గే అవకాశం ఉంది.

ఏకగ్రీవ నిర్ణయం

ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో నిర్వహించిన తొలి ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో భాగంగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల పాటు (ఈ నెల 7-9 తేదీల్లో) సమావేశమైంది. ట్రంప్ సుంకాలతో అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి మబ్బులు కమ్ముకున్న నేపథ్యంలో మన జీడీపీ వృద్ధికి ఊతమిచ్చేందుకు రెపో రేటును పావు శాతం తగ్గించాలని సభ్యులు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. ఎందుకంటే, భారత ఎగుమతులపై ట్రంప్ విధించిన 26 శాతం సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఇది మన ఎగుమతులతో పాటు ఈ ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధికి సైతం 0.20-0.40 శాతం మేర గండికొట్టవచ్చన్న అంచనాలున్నాయి.

పీ2ఎం చెల్లింపుల పరిమితి పెంపు

యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా విక్రేతలకు వ్యక్తులు జరిపే చెల్లింపుల (పీ2ఎం పేమెంట్స్) పరిమితిని పెంచేందుకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కు ఆర్‌బీఐ అనుమతిచ్చింది. మారుతున్న వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పరిమితులను సడలించేందుకు వెసులుబాటు కల్పించింది. ప్రస్తుతం ఒక వ్యక్తి మరో వ్యక్తికి (పీ2పీ), వ్యక్తి విక్రేతకు (పీ2ఎం) గరిష్ఠంగా రూ.లక్ష వరకు చెల్లింపు జరపవచ్చు.

బ్యాంకింగ్ వ్యవస్థ సుస్థిరం

మన బ్యాంకింగ్ వ్యవస్థ సురక్షితంగా, భద్రంగా, పటిష్ఠంగా ఉందని ఆర్‌బీఐ గవర్నర్ అన్నారు. ఇండస్‌ఇండ్ బ్యాంక్ సహా కొన్ని బ్యాంకింగ్, హౌసింగ్ ఫైనాన్సింగ్ కంపెనీల్లో సంక్షోభాలు కేవలం వ్యవస్థలో కొన్ని అంకాలే తప్ప పూర్తి వైఫల్యం కాదన్నారు. తమ డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో రూ.2,100 కోట్ల అకౌంటింగ్ వ్యత్యాసాన్ని గుర్తించామని, ఇది బ్యాంక్ విలువను దాదాపు 2.35 శాతం వరకు ప్రభావితం చేయవచ్చని ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఈ మధ్యనే ప్రకటించింది. దాంతో బ్యాంక్ షేరు భారీగా క్షీణించడంతో చిన్న మదుపరులు, ఇతర ఇన్వెస్టర్లు నష్టపోవాల్సి వచ్చింది. అలాగే, ముంబైకి చెందిన న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్, అవియోమ్ ఇండియా హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దివాలా తీశాయి. అయితే, ఇవన్నీ వ్యక్తిగత ఉదంతాలేనని బ్యాంకింగ్ వ్యవస్థ సుస్థిరతకు ముప్పేమీ లేదన్నారు.

నేను సంజయ్.. భారతంలో సంజయుడిని కాను..

- నాకు దివ్య దృష్టి లేదు..
- వడ్డీరేట్లు ఇంకెంత తగ్గుతాయో ఇప్పుడే చెప్పలేనన్న ఆర్‌బీఐ గవర్నర్

ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాల ప్రకటన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వడ్డీ రేట్లు మరింత తగ్గుతాయా..? అన్న ప్రశ్నకు ఆర్‌బీఐ గవర్నర్ తనదైన శైలిలో జవాబిచ్చారు. నా పేరు సంజయ్. కానీ, మహాభారతంలో సంజయుడిని కాను. ఆయన లాగా దివ్యదృష్టి లేదన్నారు. "జీడీపీ వృద్ధి, ద్రవ్యోల్బణం నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ సంయుక్తంగా కృషి చేస్తున్నాయి. ఆర్థిక వృద్ధిని పెంచేందుకు ప్రభుత్వం ఈసారి బడ్జెట్లో మూలధన పెట్టుబడుల పెంపు, భారీగా పన్ను మినహాయింపు వంటి చర్యలను చేపట్టింది. మేం రెపో రేటును తగ్గించడంతో పాటు రేట్లపై భవిష్యత్ వైఖరిని అనుకూలంగా మార్చాం. భవిష్యత్‌లో వడ్డీ రేట్లు ఇంకెంత తగ్గుతాయనేది నేనిప్పుడే చెప్పలేను. నేను సంజయ్. కానీ, మహాభారతంలోని సంజయుడిని కాను. భవిష్యత్‌లో ఏం జరుగుతుందో చూడగలిగే దివ్యదృష్టి నాకు లేదు" అని ఆయన చమత్కరించారు. రుణగ్రహీతలకు రెపో తగ్గింపు ప్రయోజనాలు త్వరితగతిన బదిలీ అయ్యేందుకు వీలుగా బ్యాంకింగ్ వ్యవస్థలో తగినంత ద్రవ్య లభ్యతను నిర్వహిస్తామని గవర్నర్ అన్నారు.

సుంకాలతో ఎగుమతులకు గండి

- ఆర్థిక ప్రగతిపై అనిశ్చితి మబ్బులు

ట్రంప్ సుంకాలతో అన్ని దేశాల ఆర్థిక ప్రగతిపై అనిశ్చితి మబ్బులు కమ్ముకున్నాయని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ వృద్ధి, ధరల నియంత్రణకు కొత్త అవరోధంగా పరిణమించవచ్చని ఆయన హెచ్చరించారు. సుంకాలతో వాణిజ్య యుద్ధాలు తీవ్రతరమైతే, మన ఎగుమతులు గణనీయంగా తగ్గే ప్రమాదమూ ఉందన్నారు. అంతేకాదు, ట్రంప్ సుంకాలు ద్రవ్యోల్బణం కంటే జీడీపీ వృద్ధిపైనే అధిక ప్రభావం చూపవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

వృద్ధి అంచనాల్లో కోత

ట్రంప్ సుంకాలు వాణిజ్య ఉద్రిక్తతలతో పాటు ఆర్థిక అనిశ్చితిని పెంచటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి అంచనాను ఈ ఫిబ్రవరిలో ప్రకటించిన 6.7 శాతం నుంచి 6.5 శాతానికి తగ్గిస్తున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఈసారి వ్యవసాయ రంగ పనితీరు ఆశాజనకంగా ఉండవచ్చని, తయారీ రంగం తిరిగి కోలుకుంటోందని సేవల రంగం చురుకుగా ముందుకు సాగుతోందని మల్హోత్రా అన్నారు. దేశంలో ప్రైవేట్ పెట్టుబడులూ పుంజుకుంటున్నాయని, ముున్ముందు మరింత పెరగవచ్చన్నారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై భారీగా ఖర్చు చేస్తోందని.. కార్పొరేట్ కంపెనీలు, బ్యాంకులు ఆర్థికంగా పరిపుష్టిగా ఉండటం వృద్ధికి దోహదపడగలవన్నారు. ట్రంప్ సుంకాలతో వాణిజ్య అవరోధాలు ఆర్థిక ప్రగతికి ప్రతికూలంగా పరిణమించవచ్చన్నారు.

ఈ ఆర్థిక సంవత్సరానికి అంచనాలు (%)

త్రైమాసికం	వృద్ధి	ద్రవ్యోల్బణం
తొలి	6.5	4.0
రెండు	6.7	3.6
మూడు	6.6	3.8
నాలుగు	6.3	4.4

ఈఎంఐలు ఎంత తగ్గుతాయంటే..



ప్రస్తుతం బ్యాంకులు, హెచ్‌ఎఫ్‌సీలు మంచి పరపతి స్కోరు ఉన్నవారికి ఇచ్చే 20 ఏళ్ల కాలపరిమితి గృహ రుణాలపై 9 శాతం వరకు కనీస వడ్డీ రేటు వసూలు చేస్తున్నాయి. ఆర్‌బీఐ తాజా వడ్డీ రేటు తగ్గింపుతో ఈ వడ్డీ రేటు 8.5 శాతానికి తగ్గనుంది. దీంతో రూ.30 లక్షల నుంచి రూ.1.5 కోట్ల గృహ రుణాలపై ఈఎంఐ ఎంత తగ్గనుందంటే..

రూ.30 లక్షల రుణంపై: 20 సంవత్సరాల చెల్లింపు కాలపరిమితి ఉండే రూ.30 లక్షల గృహ రుణంపై నెలనెలా చెల్లించే ఈఎంఐ భారం రూ.26,247 నుంచి రూ.25,071కి తగ్గుతుంది. అంటే నెలకు రూ.1,176 భారం తగ్గుతుంది. ఈ లెక్కన 20 సంవత్సరాలకు వడ్డీ, అసలు చెల్లింపుల రూపంలో రూ.2.82 లక్షలు ఆదా అవుతాయి.

రూ.50 లక్షల రుణంపై: అదే రూ.50 లక్షల గృహ రుణంపై చెల్లించే ఈఎంఐ భారం రూ.1,960 తగ్గి రూ.43,745 నుంచి రూ.41,785కు తగ్గుతుంది. అంటే 20 ఏళ్ల కాలపరిమితి పూర్తయ్యే సరికి ఆదా అయ్యే సొమ్ము రూ.4.7 లక్షలు.

రూ.70 లక్షల గృహ రుణంపై: తొమ్మిది శాతం వడ్డీ రేటు చొప్పున ప్రస్తుతం చెల్లించే ఈఎంఐ రూ.61,243. వడ్డీ రేటు అర శాతం తగ్గితే చెల్లించే ఈఎంఐ రూ.58,499. అంటే నెలకు రూ.2,744 చొప్పున 20 ఏళ్లలో రూ.6.58 లక్షలు ఆదా అవుతాయి.

రూ.కోటి గృహ రుణంపై: ప్రస్తుతం రూ.కోటి గృహ రుణంపై 9 శాతం వడ్డీ రేటు చొప్పున చెల్లించే ఈఎంఐ రూ.87,490. అదే వడ్డీ రేటు 8.5 శాతానికి తగ్గితే చెల్లించే ఈఎంఐ రూ.83,570 మాత్రమే. అంటే నెలకు రూ.3,920 చొప్పున 20 ఏళ్లలో రూ.9.4 లక్షలు ఆదా అవుతాయి.

రూ.1.5 కోట్ల గృహ రుణంపై: ఈ గృహ రుణంపై 9 శాతం వడ్డీ రేటుతో ప్రస్తుతం నెలనెలా చెల్లిస్తున్న ఈఎంఐ రూ.1,31,235. అదే వడ్డీ రేటు 8.5 శాతానికి తగ్గితే చెల్లించే ఈఎంఐ రూ.1,25,355 మాత్రమే. అంటే నెలకు రూ.5,880 చొప్పున 20 ఏళ్లలో రూ.14.11 లక్షలు ఆదా అవుతాయి.

పసిడి రుణాలపై నియంత్రణ

ముసాయిదా మార్గదర్శకాలు జారీ చేసిన ఆర్‌బీఐ

పసిడి రుణాలు గణనీయంగా పెరిగిపోతుండటంతో వీటిపై ఆర్‌బీఐ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఈ రుణాల మంజూరుకు సంబంధించి ముసాయిదా నిబంధనలు జారీ చేసింది. ఈ నిబంధనలతో ఈ రుణాల మంజూరు ప్రక్రియ మరింత పారదర్శకంగా మారి రుణాలు తీసుకునే వారితో పాటు రుణాలు ఇచ్చే సంస్థలకూ మేలు జరుగుతుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. పసిడి రుణాలకు సంబంధించి ఏయే మార్పులు చోటు చేసుకోనున్నాయంటే..

చెల్లించే స్థోమతే కీలకం: బ్యాంకులు ఇక దరఖాస్తు చేసిన వెంటనే గతంలోలా ఎడాపెడా పసిడి రుణాలు ఇవ్వవు. దరఖాస్తుదారుడి ఆదాయం, తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించే స్థోమత ఉందా? లేదా? అని మదింపు చేసిన తర్వాతే ఇక ఈ రుణాలు మంజూరవుతాయి.

పునరుద్ధరణ, టాప్ అప్స్: బంగారం రుణాల రెన్యువల్, టాప్ అప్ నిబంధనలూ మారనున్నాయి. ఇప్పటికే ఉన్న గోల్డ్ లోన్ ప్రామాణిక తరగతిలో ఉండి.. నిర్ణీత పరివి ఎతికి లోబడి ఉంటేనే రెన్యూవల్స్, టాప్ అప్‌లను అనుమతిస్తారు.

వెలకట్టడంలో పారదర్శకత: రుణం కోసం తాకట్టు పెట్టుకునే నగల స్వచ్ఛత, విలువను లెక్కించే విధానాలు మరింత పారదర్శకంగా, నిలకడగా ఉండాలని స్పష్టం చేసింది.

కలగలుపు విధానానికి చెక్: ప్రస్తుతం ఒక వ్యక్తి ఒకేసారి వ్యక్తిగత, వ్యాపార అవసరాలు రెంటికీ కలిపి ఒకే పసిడి రుణం తీసుకోవచ్చు. ఇకపై ఇది సాధ్యం కాదు.

పర్యవేక్షణ: ఇక ఏ అవసరం కోసం గోల్డ్ లోన్ తీసుకున్నామో, ఆ రుణాన్ని ఆ అవసరం కోసం మాత్రమే ఉపయోగించాలి. వేరే అవసరాలకు ఉపయోగించకూడదు. ఈ రుణ వినియోగం నిర్దేశించిన అవసరానికే వినియోగిస్తున్నారా? లేదా? అనే విషయాన్ని బ్యాంకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఆ విషయాన్ని రికార్డుల్లో నమోదు చేస్తాయి.

పరిమితులు

- వ్యక్తిగత వినియోగ అవసరం కోసం బంగారం రుణం తీసుకుంటే దాన్ని 12 నెలల్లోగా చెల్లించాలి.
- ఒక్కో వ్యక్తికి సహకార బ్యాంకులు, ఆర్‌ఆర్‌బీలు మంజూరు చేసే పసిడి రుణాలు రూ.5 లక్షలు మించకూడదు.
- ఒక వ్యక్తికి ఒక కిలో ఆభరణాల వరకు మాత్రమే పసిడి రుణాలకు అనుమతిస్తారు.
- పసిడి నాణేలపై రుణాలు తీసుకోవాలంటే 50 గ్రాముల వరకే అనుమతిస్తారు. ఆ నాణేలు కూడా 22 క్యారట్స్ లేదా అంతకు మించిన స్వచ్ఛత ఉండి ప్రత్యేకంగా ముద్రించినవై, బ్యాంకులు అమ్మినవై ఉండాలి.
- బంగారు, వెండి నగలు, నాణేలపై మాత్రమే ఇక పసిడి రుణాలు లభిస్తాయి. నేరుగా బంగారం లేదా వెండిని కుదువ పెట్టి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునేందుకు అవకాశం ఉండదు.
- గోల్డ్ ఈటీఎఫ్‌లపైనా పసిడి రుణాలు లభించవు.
- పసిడి రుణాల కోసం వివాదాల్లో ఉన్న ఆభరణాలు, ఇప్పటికే తనఖాలో ఉన్న ఆభరణాలను తిరిగి తనఖా పెట్టేందుకు అనుమతించరు.

వడ్డీ రేట్లు తగ్గించిన 4 బ్యాంకులు

న్యూఢిల్లీ: ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించడంతో బ్యాంకులూ వడ్డీ రేట్ల తగ్గింపునకు సిద్ధమయ్యాయి. ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) తమ రెపో ఆధారిత రుణాలపై కనీస వడ్డీ రేటు 0.35 శాతం తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. మిగతా బ్యాంకులూ ఇదే బాటలో నడుస్తాయని భావిస్తున్నారు. తమ రెపో ఆధారిత రుణాలపై కనీస వడ్డీ రేటును ఈ నెల 11 నుంచి 9.05 శాతం నుంచి 8.7 శాతానికి కుదిస్తున్నట్టు ఇండియన్ బ్యాంక్ తెలిపింది. పీఎన్‌బీ, బీఓఐ కూడా తమ రెపో ఆధారిత రుణాలపై కనీస వడ్డీ రేటును 9.10 శాతం 8.85 శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. యూకో బ్యాంక్ కూడా ఇదే బాటలో నడిచింది. తన రెపో ఆధారిత రుణాలపై కనీస వడ్డీ రేటును గురువారం నుంచి 8.8 శాతానికి తగ్గించింది.

మళ్లీ నష్టాల్లోకి సూచీలు

ముంబై: ఈక్విటీ మార్కెట్లు బుధవారం మళ్లీ తిరోగమనం బాట పట్టాయి. ఆర్‌బీఐ వరుసగా రెండో సారి రెపో రేటు తగ్గించిందన్న ఆనందం స్టాక్‌మార్కెట్‌ను ఏ మాత్రం ఉత్తేజితం చేయలేకపోయింది. అంతకన్నా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల పోటు భయాలే ఇన్వెస్టర్ల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఫలితంగా ఒక రోజు విరామం అనంతరం ఈక్విటీ మార్కెట్లు తిరిగి బుధవారం నష్టాల్లోకి జారుకున్నాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన ప్రతికూల సంకేతాలు ఇందుకు ఆజ్యం పోశాయి. ఈ ప్రభావంతో ఇంట్రాడేలో 554 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ చివరికి నష్టాన్ని 379.93 పాయింట్లకు పరిమితం చేసుకుని 73,847.15 వద్ద ముగిసింది. నిఫ్టీ 136.70 పాయింట్ల నష్టంతో 22,399.15 వద్ద ముగిసింది.

మార్కెట్లకు నేడు సెలవు: మహావీర్ జయంతి సందర్భంగా గురువారం మార్కెట్లకు సెలవు. స్టాక్‌మార్కెట్‌తో పాటు ఫారెక్స్, బులియన్ మార్కెట్లన్నీ మూసి ఉంటాయి. శుక్రవారం తిరిగి ట్రేడింగ్ ఉంటుంది.

మార్కెట్లోకి పోకో సీ71 స్మార్ట్‌ఫోన్

స్మార్ట్‌ఫోన్స్ తయారీ సంస్థ పోకో ఇండియా మార్కెట్లోకి సరికొత్త పోకో సీ71 స్మార్ట్‌ఫోన్‌ను తీసుకువచ్చింది. ఈ ఫోన్ ప్రారంభ ధర రూ.6.499. 6.88 హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే, ట్రిపుల్ ఐ ప్రొటెక్షన్, ఆక్టా-కోర్ ప్రాసెసర్, 32 ఎంపీ డ్యూయల్ రియర్ కెమెరా, 8 ఎంపీ ఫ్రంట్ కెమెరా, 5,200 ఎంఏహెచ్ బ్యాటరీ ఈ ఫోన్ ప్రత్యేకతలు. 4జీబీ రామ్ ప్లస్ 64 జీబీ స్టోరేజీతో కూడిన ఫోన్ ధర రూ.6,499గా ఉండగా 6జీబీ రామ్ ప్లస్ 128 జీబీ స్టోరేజీతో కూడిన సీ71 ధర 7,499గా ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	390	విజయవాడ	420
వరంగల్	392	గోదావరి	415
చిత్తూరు	460	విశాఖపట్నం	435
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	115
వరంగల్	100	గుంటూరు	112
కరీంనగర్	100	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	78
కర్నూలు	100	నెల్లూరు	83
విశాఖపట్నం	109	అనంతపురం	83
గోదావరి	115		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,440 ▲	82,900 ▲	1,02,000 ▼
విజయవాడ	93,000 ▲	87,500 ▲	93,000 ▲
విశాఖపట్నం	90,380 ▲	82,850 ▲	90,990 ▲
రాజమండ్రి	90,440 ▲	82,900 ▲	92,200 ▲
ప్రొద్దుటూరు	88,900 ▲	81,790 ▲	93,000 ▲
ముంబై	90,161 ▲	82,588 ▲	90,669 ▲

నైరుతిలో సాధారణ వర్షపాతం!

- ఆగస్టు, సెప్టెంబరులో ఎక్కువ వర్షాలు
- ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా
- సీజన్ ఆశాజనకంగా ఉంటుందన్న ఇంగ్లండ్ శాస్త్రవేత్త
- ఐఎండీ బులెటిన్ వచ్చే వారం విడుదల



విశాఖపట్నం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు చేసే నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఈసారి సాధారణ వర్షపాతం నమోదవుతుందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. దీర్ఘకాల సగటు(96 నుంచి 104 శాతం)లో 103 శాతం(ఐదు శాతం అటూఇటుగా) వర్షపాతం నమోదుకానుందని ప్రకటించింది. దీర్ఘకాల సగటు అంటే జూన్ నుంచి సెప్టెంబరు వరకూ గల నాలుగు నెలల నైరుతి సీజన్‌లో 865.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాలి. అయితే 895 మి.మీ. వర్షపాతం కురుస్తుందంటూ రైతాంగానికి స్కైమెట్ తీపికబురు అందించింది. ఇంకా యూకే(యునైటెడ్ కింగ్‌డమ్) వాతావరణ శాఖ, యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్ అంచనా మేరకు భారతదేశంలో సగటు, అంతకంటే ఎక్కువ వర్షపాతం కురుస్తుందని యూకే వర్సిటీ ఆఫ్ రీడింగ్‌లోని నేషనల్ సెంటర్ ఫర్ అట్మాస్ఫియర్ సైన్స్ శాస్త్రవేత్త అక్షయ డియోరాన్ వెల్లడించారు. కాగా, నైరుతి రుతుపవనాల సీజన్‌కు సంబంధించి ముందస్తు అంచనా బులెటిన్‌ను భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వచ్చేవారం విడుదల చేయనుంది. గతేడాది డిసెంబరులో పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడిన లానినా ప్రస్తుతం బలహీనపడుతోంది. ఈ నెలలో తటస్థ పరిస్థితులు ఏర్పడి ఆగస్టు వరకూ కొనసాగుతాయని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఇప్పటికే అంచనా వేశాయి. ఎట్టి పరిస్థితుల్లో నైరుతి సీజన్‌లో ప్రతికూల ఫలితాలు ఇచ్చే ఎల్‌నినో రాదని ఇప్పటికే ఐఎండీ స్పష్టం చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో తటస్థ పరిస్థితులు, హిందూ మహాసముద్రంలో జూన్ నాటికి వచ్చే పాజిటివ్ దశ వల్ల రానున్న నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని స్కైమెట్ పేర్కొంది. జూన్, జూలై కంటే ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఎక్కువ వర్షాలు కురుస్తాయని వివరించింది. పశ్చిమ కనుముల వెంబడి అంటే కేరళ, కోస్తా కర్ణాటక, గోవాల్లో అధిక వర్షపాతం, ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఇతర కొండ ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదుకానుంది.

ఏ నెలలో ఎంత వర్షపాతమంటే?

జూన్‌లో సాధారణ వర్షపాతం 165.3 మి.మీ. కురవాల్సి ఉండగా 159.7 (96 శాతం), జూలైలో 280.5 మి.మీ.కుగాను 286.1 మి.మీ (రెండు శాతం ఎక్కువ), ఆగస్టులో 254.9కి 275.3 (ఎనిమిది శాతం ఎక్కువ), సెప్టెంబరులో 167.9కి. 174.6 మి.మీ. వర్షపాతం(నాలుగు శాతం ఎక్కువ) నమోదవుతుందని అంచనావేసింది. ఆగస్టులో మధ్య, తూర్పుభారతంలో సాధారణం కంటే ఎక్కువగా, దక్షిణ, ఉత్తర భారతాల్లో సాధారణంగా, సెప్టెంబరులో పశ్చిమ కనుములు, మధ్యభారతంలో సాధారణం కంటే ఎక్కువగా, కోస్తాంధ్ర, తమిళనాడు, కొంకణ్, దక్షిణ గుజరాత్‌లలో తక్కువ వర్షపాతం నమోదవుతుందని స్కైమెట్ అంచనా వేసింది. కాగా, ఐరోపా వాతావరణ సెంటర్, యునైటెడ్ కింగ్‌డమ్ సంస్థలు వేర్వేరుగా రూపొందించిన అంచనా మేరకు ఎల్‌నినో రాకపోతే భారత్‌లో నైరుతి సీజన్ ఆశాజనకంగా ఉంటుందని యూకే వర్సిటీ ఆఫ్ రీడింగ్‌లోని నేషనల్ సెంటర్ ఫర్ అట్మాస్ఫియర్ సైన్స్ శాస్త్రవేత్త అక్షయ డియోరాన్ వెల్లడించారు.

కోలుకుంటున్న మార్క్ శంకర్

- మరో మూడు రోజులు డాక్టర్ల పర్యవేక్షణలోనే
- ఐసీయూ నుంచి వార్డుకు మార్చిన వైద్యులు
- సింగపూర్‌లో ఆస్పత్రికి డిప్యూటీ సీఎం పవన్
- కుమారుడి ఆరోగ్యంపై వైద్యుల వద్ద ఆరా



అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ నెమ్మదిగా కోలుకుంటున్నాడు. ప్రమాద వార్త తెలిసి మంగళవారం రాత్రి సింగపూర్ బయల్దేరి వెళ్లిన పవన్ కల్యాణ్ బుధవారం నేరుగా తన కుమారుడు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మార్క్ శంకర్‌ను చూసిన అనంతరం ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మార్క్ శంకర్ కోలుకొంటున్నాడని.. ఊపిరితిత్తుల్లోకి పొగ చేరడం వలన మూడు రోజులపాటు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించాల్సి ఉంటుందని వారు పవన్ కల్యాణ్‌కు సూచించారు. కాగా, బుధవారం ఉదయం మార్క్‌ను ఐసీయూ నుంచి సాధారణ రూమ్‌కి తరలించారు. పవన్ చిన్న కుమారుడు సింగపూర్‌లో సమ్మర్ క్యాంప్‌లో ఉండగా మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో అతని చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఊపిరితిత్తుల్లోకి పొగ చేరడంతో తొలుత అతన్ని ఐసీయూలో ఉంచి చికిత్స అందించిన సంగతి తెలిసిందే.

కోర్టులో మోహన్‌బాబుకు చుక్కెదురు

- ఆయనకు అనుకూలంగా ఇచ్చిన తీర్పు కొట్టివేత?
- తప్పిదానికి పాల్పడిన కోర్టు క్లర్క్‌కు మెమో జారీ
- జల్‌పల్లి నివాసం వద్ద మంచు మనోజ్ ధర్నా
- కోర్టు చెప్పినా తనని ఇంట్లోకి రానివ్వడం లేదని ఆవేదన

హైదరాబాద్ సిటీ, పహాడిషరీఫ్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్ బాబు కుటుంబంలో రేగిన వివాదం చల్లారడం లేదు. జల్‌పల్లిలోని మోహన్‌బాబు నివాసం వద్ద ఆయన చిన్న కుమారుడు మంచు మనోజ్ బుధవారం ధర్నాకు దిగారు. మనోజ్ ఈ సందర్భంగా తన తండ్రి మోహన్‌బాబు, సోదరుడు విష్ణుపై తీవ్ర ఆరోపణలు చేశారు. తనని ఇంట్లోకి రానివ్వకూడదని మోహన్‌బాబు కోర్టును తప్పుదారి పట్టించి స్టే తెచ్చుకున్నారని విలేకరులతో అన్నారు. తాను ఇంట్లోకి వెళ్లేందుకు అనుమతినిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎల్బీనగర్ కోర్టులో చూపగా.. ఎల్బీనగర్ న్యాయస్థానం ఆ స్టేను కొట్టేసిందని తెలిపారు. జల్‌పల్లిలోని ఇంటి విషయంలో చిన్న కొడుకు మనోజ్‌తో వివాదం నేపథ్యంలో మోహన్‌బాబు ఎల్బీనగర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మనోజ్ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, అతను తన ఇంట్లోకి ప్రవేశించకుండా ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం మోహన్‌బాబుకు అనుకూలంగా గతంలో ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఇంట్లోకి ప్రవేశించేందుకు హైకోర్టు మనోజ్‌కు అనుమతి ఇచ్చిందనే విషయాన్ని దాచడంతోపాటు, తప్పుడు ఆధారాలు సమర్పించి మోహన్‌బాబు న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించారని మనోజ్ తరఫున న్యాయవాదులు ఎల్బీనగర్ కోర్టులో వాదనలు వినిపించారు. వాటిని పరిశీలించిన ఎల్బీనగర్ న్యాయస్థానం మోహన్‌బాబుకు అనుకూలంగా ఇచ్చిన ఆదేశాలను మంగళవారం కొట్టేసినట్టు తెలిసింది. అంతేకాక ఈ తప్పిదం జరగడానికి కారణమైన కోర్టు క్లర్క్‌కు మెమో కూడా జారీ చేసినట్లు సమాచారం.



జల్‌పల్లిలోని ఇంటి గేట్ వద్ద బైఠాయించిన మంచు మనోజ్

ఈ నేపథ్యంలో మంచు మనోజ్ జల్‌పల్లి నివాసంలోకి వెళ్లేందుకు బుధవారం ప్రయత్నించగా మోహన్‌బాబు సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో మనోజ్ ఇంటి గేటు వద్ద గంటన్నరకు పైగా బైఠాయించి నిరసనకు దిగారు. మనోజ్ భార్య భూమా మౌనిక కూడా అక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మనోజ్ విలేకరులతో మాట్లాడుతూ ఇంట్లో ఉండేందుకు హైకోర్టు తనకు అనుమతి ఇచ్చిందని, కానీ తన తండ్రి ఎల్బీనగర్ కోర్టును తప్పుదారి పట్టించి స్టే తెచ్చుకున్నారని ఆరోపించారు. తాను దాన్ని కోర్టులో నిరూపించడంతో స్టేను తొలగించిందన్నారు. అయినా తనని ఇంట్లోకి రానివ్వడం లేదని వాపోయారు. తన వస్తువులను ధ్వంసం చేయడంతోపాటు వాహనాలను దొంగతనం చేశారని ఆరోపించారు. పోలీసు కమిషన్ బైండోవర్‌ను తన సోదరుడు విష్ణు చాలాసార్లు అతిక్రమించాడని తెలిపారు. ఆస్తి వద్దని తన తండ్రికి ఎప్పుడో చెప్పానని, డిసెంబరు నుంచి గొడవలు జరుగుతుంటే పోలీసులు ఇప్పటిదాకా ఒక్క చార్జిషీట్ ఫైల్ చెయ్యలేదని మనోజ్ అన్నారు.

ఎమ్మెల్సీ బరిలో బీజేపీ వర్సెస్ మజ్లిస్!

» హైదరాబాద్ 'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికలో ఇద్దరే అభ్యర్థులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ అనివార్యంగా మారింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు బుధవారం ముగియగా.. బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, ఎంఐఎం అభ్యర్థిగా మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండిలు బరిలో ఉన్నట్టు రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి ప్రకటించారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతో కలిపి 112 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నెల 23వ తేదీన పోలింగ్, 25వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది.

ఉన్నత విద్యామండలి ముట్టడికి యత్నం

» క్రమబద్ధీకరణకు కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆందోళన బాట

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు తమ ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన బాట పట్టారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించకుండా కొత్తగా అధ్యాపకుల నియామకం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం 21వ నంబర్ జీవో తేవడం పట్ల మండిపడ్డారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని ముట్టడించడానికి ప్రయత్నించారు. వివిధ వర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు దశల వారీగా సైఫాబాద్‌లోని ఓయూ పీజీ కాలేజీ నుంచి వందల మంది ర్యాలీగా బయలుదేరి మహావీర్ ఆస్పత్రి వరకూ వచ్చారు. పోలీసులు అడ్డుకోవడంతో ఆందోళనకారులు రోడ్డుపై బైఠాయించారు. కాంట్రాక్ట్ అధ్యాపకులను పోలీసులు అరెస్ట్ చేసి తరలించారు. ఈ అరెస్టులను మాజీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఖండించారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ నేతలు పరశురామ్, ధర్మతేజ మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రిన్సిపాళ్ల, అసిస్టెంట్ ప్రొఫెసర్లను అరెస్ట్ చేయడం దుర్మార్గం అని పేర్కొన్నారు.

సమానత్వం కోసం మరో ఉద్యమం: బీసీ జేఏసీ

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వెనుకబడ్డ తరగతుల(బీసీ) ప్రజలు దశాబ్దాల కాలంగా రాజకీయంగా, ఆర్థికంగా, విద్యా పరంగా తీవ్ర అన్యాయాలు ఎదుర్కొంటున్నారని బీసీ జేఏసీ పేర్కొంది. రాజకీయ అవకాశాల్లో సరైన ప్రాతినిధ్యం లేకపోవడం, ఆర్థిక వనరుల అసమాన పంపిణీ, విద్యా సంస్థల్లో అవకాశాల కొరత వంటి సమస్యలు బీసీ సామాజిక వర్గాల్ని వెనుకబాటుకు గురిచేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో బీసీ జేఏసీ మలిదశ ఉద్యమాన్ని నిర్మించే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లలో సంచార జాతులకు ప్రాధాన్యం!

» తెలంగాణ బీసీ కమిషన్ సమావేశంలో తీర్మానం

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో బీసీ కులాల్లో నిరుపేదలకు ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ బీసీ కమిషన్ తీర్మానించింది. గతనెలలో బీసీ కమిషన్ బృందం వేములవాడ, జగిత్యాల, సిరిసిల్ల, ఆమన్‌గల్, అచ్చంపేట తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సంచార జాతుల పరిస్థితులను అధ్యయనం చేసి, వారు ఎంతో దయనీయ పరిస్థితిలో ఉన్నట్లు గుర్తించిందని కమిషన్ ఛైర్మన్ నిరంజన్ బుధవారం జరిగిన కమిషన్ సమావేశంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో సంచార జాతులకు చెందిన వారికి ఇళ్ళు, ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందని, అందుకే వారికి ఇళ్ల కేటాయింపు, ఆర్థిక సాయం అందించే పథకాల్లో ప్రాధాన్యం కల్పించాలని తీర్మానం చేశామని చెప్పారు.


మార్చి నెల వేతనాలు ఇవ్వండి

» ముఖ్యమంత్రికి గురుకుల ఉద్యోగుల లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకుల విద్యా సొసైటీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు మార్చి నెల వేతనాలు విడుదల చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుధవారం లేఖ పంపినట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్. బాలరాజు, ఎన్.దయాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అయిదు గురుకుల సొసైటీల పరిధిలో సుమారు 50 వేల మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారని వారందరికీ వేతనాలు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆ లేఖలో వివరించామని పేర్కొన్నారు.

బీసీ గురుకుల విద్యార్థులకు సెయిలింగ్‌లో శిక్షణ

విద్యార్థుల్లో చదువుతో పాటు వారి ఆసక్తికి అనుగుణంగా అనేక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు బీసీ గురుకుల విద్యాసంస్థ ప్రాధాన్యం ఇస్తుందని మహాత్మా జోతిబా పూలే బీసీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. సెయిలింగ్ క్రీడ ద్వారా శాస్త్రీయ శిక్షణతో పాటు నీటిలో నైపుణ్యం, సహనం, చురుకుదనం వంటి లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో యాట్ క్లబ్ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్‌లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ గురుకులాల్లో చదువుతున్న 14 ఏళ్ల వయసు గల బాలురు 32, బాలికలు 19 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



పార్టీ జరిగిన ఫాంహౌస్

ఫాంహౌస్‌లో ముజ్రా పార్టీ.. పోలీసుల దాడి

» 20 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

» 62 గ్రాముల గంజాయి, మద్యం స్వాధీనం

మొయినాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ముజ్రా పార్టీ నిర్వహిస్తున్న ఓ ఫాంహౌస్‌పై పోలీసులు దాడి చేశారు. పార్టీ నిర్వాహకులతో పాటు మొత్తం 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధి ఎత్‌బార్‌పల్లి రెవెన్యూలోని హాలీడే ఫాంహౌస్‌లో బోరబండకు చెందిన అబ్దుల్ లుక్మాన్ తన పుట్టిన రోజు సందర్భంగా పార్టీ ఏర్పాటు చేశాడు. ఈ పార్టీలో మద్యం, గంజాయితో పాటు అమ్మాయిలతో అర్ధనగ్న నృత్యాలు చేసే కార్యక్రమం పెట్టాడు. పక్కా సమాచారంతో రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసుల బృందం స్థానిక పోలీసులతో కలిసి దాడి చేశారు. ఏడుగురు యువతులు, 13 మంది యువకులను అదుపులోకి తీసున్నారు. 62 గ్రాముల గంజాయి, మద్యం సీసాలు, సెల్‌ఫోన్లు, కార్లు స్వాధీనం చేసుకున్నారు. పార్టీ జరిగిన ప్రాంతంలో కండోమ్ ప్యాకెట్లు సైతం దొరికినట్లు సమాచారం. కాగా, పట్టుబడిన వారిలో నగరానికి చెందిన 13 మంది యువకులు, ఏడుగురు యువతులు ఉన్నారు. నిందితులైన బాబు, రీనా ఇద్దరూ కలిసి పార్టీకి అమ్మాయిలను తీసుకొచ్చినట్లు తెలిసింది. వారితో పాటు ఫాంహౌస్ ఓనర్ హైదరాబాద్‌కు చెందిన అసన్‌పైనా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం

» ప్రభుత్వ ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ లచ్చిరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల ఐకాస ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. వీలైనంత త్వరగా పెండింగ్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని ఐకాస ఆఫీసులో తెలంగాణ ప్రభుత్వోద్యోగ సంఘాల నేతలతో సమావేశమయ్యారు. 37 డిమాండ్లపై ప్రభుత్వానికి వినతి పత్రం అందించాలని ప్రతినిధులు తీర్మానించారు. తీర్మాన ప్రతిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావుకు అందించారు.

రాజధానిలో సొంత ఇంటికి శ్రీకారం

» శంకుస్థాపన చేసిన చంద్రబాబు దంపతులు

అమరావతి, గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతిలో సొంత ఇంటి నిర్మాణానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. బుధవారం ఉదయం 8.51 గంటలకు సతీమణి భువనేశ్వరి, తనయుడు నారా లోకేశ్ దంపతులు, మనవడు దేవాన్ష్‌తో కలిసి చంద్రబాబు భూమి పూజ నిర్వహించి, ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వెలగపూడి సచివాలయం వెనుక ఈ9 రహదారి చెంతనే సుమారు 5 ఎకరాల స్థలంలో సీఎం సొంత ఇంటిని నిర్మించుకుంటున్నారు. వేదపండితుల ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాన్ని కొద్ది మంది కుటుంబసభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. భూమిపూజ సందర్భంగా చంద్రబాబుకు భూమిని విక్రయించిన వెలగపూడి మాజీ సర్పంచ్ కంచర్ల శాంతకుమారి, ఆమె కుమార్తె గీత కలిసి లోకేశ్ దంపతులకు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాజధాని రైతులు పాల్గొని చంద్రబాబు, లోకేశ్ దంపతులకు ఘనస్వాగతం పలికారు. మంగళవారం రాత్రే భూమి పూజ జరిగే ప్రదేశాన్ని రాజధాని మహిళా రైతులు రంగవల్లులతో తీర్చిదిద్దారు. శంఖుచక్రాలు తిరునామాలతో వేసిన ముగ్గు చంద్రబాబు దంపతులను విశేషంగా ఆకట్టుకుంది. శంకుస్థాపన అనంతరం రాజధాని రైతులను చంద్రబాబు, లోకేశ్ ఆప్యాయంగా పలకరించి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, చంద్రబాబు రాజధానిలో ఇల్లు కట్టుకుని తమలో ఒకడు కాబోతుండడం తమకెంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా రాజధాని రైతులు, మహిళలు హర్షం వ్యక్తంచేశారు.



మనవడు దేవాన్ష్‌తో కలిసి భూమి పూజ నిర్వహిస్తున్న చంద్రబాబు దంపతులు

హైదరాబాద్-అమరావతి.. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొని, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ భేటీలోని ముఖ్యాంశాలు..

- హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేను వేగంగా పూర్తిచేయాలి
- హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) ఉత్తరభాగం అలైన్‌మెంట్ పూర్తయింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తుది దశలో ఉంది. మరో నాలుగు నెలల్లో డీపీఆర్ పూర్తవుతుంది. ఇప్పటికే టెండర్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ టెండర్ ఖరారయ్యాక.. దక్షిణ భాగం అలైన్‌మెంట్, డీపీఆర్ ప్రక్రియను ప్రారంభిస్తారు
- హైదరాబాద్-శ్రీశైలం నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ అలైన్‌మెంట్ పూర్తయింది. అది ఆమోద దశలో ఉందని కేంద్ర హోంశాఖ తెలిపింది
- హైదరాబాద్-కల్వకుర్తి జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ కూడా ప్రారంభమైంది
- హైదరాబాద్-మన్నెగూడ జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి అంశాలు పరిష్కారం అయ్యాయని అధికారులు వివరించారు
- హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి విస్తరణను త్వరలో పూర్తిచేయాలని కేంద్ర హోంశాఖ అధికారులను ఆదేశించింది
- కాజీపేటలో రైల్వే కోచ్ తయారీ ఫ్యాక్టరీని ఈ ఏడాది డిసెంబరు నుంచే ప్రారంభించాలని నిర్ణయించారు
- తెలంగాణలో రైల్వే ప్రాజెక్టుల విస్తరణకు కూడా చర్యలు ప్రారంభించామని రైల్వే అధికారులు తెలిపారు
- ఖమ్మంలో స్టీల్‌ప్లాంట్ సాధ్యం కాదని తేలినందున.. ప్రైవేటు సంస్థలతో కలిసి స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు విషయాన్ని పరిశీలించాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది



- తెలంగాణకు సంబంధించిన నిధులపై నీతి ఆయోగ్‌తో చర్చించాలని హోంశాఖ అధికారులకు సూచించింది.

ఏపీలో ప్రాజెక్టులు

- ఏపీలో ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌కు ఆమోదం లభించింది. మరో రిఫైనరీని ఏర్పాటుకు ఏపీ చేసిన ప్రతిపాదనను పరిశీలించాల్సిందిగా పెట్రోలియం మంత్రిత్వ శాఖకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీచేసింది
- విశాఖపట్టణం, విజయవాడ, హైదరాబాద్, కర్నూలు కారిడార్ ఏర్పాటును పరిశీలించాలని రైల్వే శాఖను హోంశాఖ కోరింది
- వెనుకబడిన జిల్లాలకు సంబంధించి ఏపీకి మరో రూ.350 కోట్ల గ్రాంట్‌ను విడుదల చేయనున్నట్లు సమాచారం
- అమరావతి రింగ్ రోడ్డును వేగంగా పూర్తిచేయాలని నిర్ణయించిన హోంశాఖ.. ఆ మేరకు రహదారుల శాఖకు ఆదేశాలిచ్చింది
- ఏపీలో వ్యవసాయ విశ్వవిద్యాలయం కోసం కేంద్రం ఇప్పటికే రూ.135 కోట్లను విడుదల చేయగా, వ్యవసాయ పరిశోధన సంస్థ సౌత్ క్యాంపస్‌ను నెలకొల్పాలని ఏపీ చేసిన ప్రతిపాదనను పరిశీలించాలని కేంద్రం నిర్ణయించింది
- రెండేళ్లలో విశాఖ రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని, అప్పటి వరకు తాత్కాలిక కార్యకలాపాలను నిర్వహించాలని రైల్వే బోర్డుకు హోంశాఖ సూచించింది

ఉమ్మడి అంశాలపై..

అటార్నీజనరల్, కాగ్ అభిప్రాయం

విభజన చట్టంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్(ఏపీఎస్ఎఫ్‌సీ)తోపాటు.. 9వ షెడ్యూల్‌లో ఉన్న కార్పొరేషన్లు, కంపెనీలు, 10వ షెడ్యూల్‌లోని సంస్థల విభజనపైనా సమావేశంలో చర్చ జరిగింది. వీటితోపాటు ప్రాజెక్టులు, అప్పుల పంపిణీపై అటార్నీ జనరల్ అభిప్రాయం తీసుకుని, ముందుకు వెళ్లాలని కేంద్రం నిర్ణయించింది. రెండు రాష్ట్రాల్లో వివిధ మౌలిక సదుపాయాలు, విద్యాసంస్థల ప్రాజెక్టు పురోగతిపై కూడా కేంద్రం సమీక్షించింది. ప్రతి రెండు నెలలకోసారి సమావేశమై విభజనకు సంబంధించి అన్ని సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించింది. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన నిధుల పంపిణీ విషయంలో పరిష్కారం కోసం కాగ్‌కు లేఖ రాయనుంది. ఉమ్మడి సంస్థల నిర్వహణలపై తెలంగాణకు పెట్టిన ఖర్చును తిరిగి చెల్లించే అంశాన్ని కూడా కాగ్‌కు నివేదించనుంది. తదుపరి సమావేశంలో ఇరు రాష్ట్రాల్లో విద్యాసంస్థలు, ఏపీలో గ్రేహౌండ్స్ ఏర్పాటు, పోలవరంపై చర్చ జరపాలని నిర్ణయించినట్లు తెలిసింది

శాంతి చర్చలకు మావోయిస్టు పార్టీ సిద్ధం

» అనుకూల వాతావరణం ఏర్పరచాలి

» ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు ప్రకటించాలి

» ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

» ప్రభుత్వం స్పందించే వరకు పీఎల్‌జీఏ దళాలు అప్రమత్తంగా ఉండాలి

» ఉత్తర, పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో అధికార ప్రతినిధి రూపేష్ బహిరంగ లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శాంతి చర్చల కోసం మావోయిస్టు పార్టీ సిద్ధంగా ఉందని, అయితే ప్రభుత్వం అందుకు అనువైన వాతావరణం ఏర్పరచాలని బస్తర్ ఏరియా ఉత్తర పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో అధికార ప్రతినిధి రూపేష్ బహిరంగ లేఖలో పేర్కొన్నారు. అనుకూల వాతావరణం తమవైపు నుంచి ఉందని, ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు ప్రకటించాలని కోరారు. శాంతి చర్చలపై కేంద్ర కమిటీ లేఖ తర్వాత ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్‌శర్మ స్పందిస్తూ అనుకూల వాతావరణం డిమాండ్‌ను నిరాకరించారని, లొంగుబాటు విధానమే సమస్యకు పరిష్కారమన్న వైఖరితోనే ప్రభుత్వం ఉందని రూపేష్ పేర్కొన్నారు. శాంతి చర్చల ప్రక్రియపై ఒక నిర్ణయం తీసుకునే ముందు తాము స్థానిక నాయకత్వ అభిప్రాయం తీసుకోవడం తప్పనిసరి అని, నిరంతరాయంగా సాగుతున్న పోలీసు ఆపరేషన్ల వల్ల ఇది సాధ్యం కాబోదన్నారు. అనుకూల వాతావరణం కోసం ఆపరేషన్ కగార్‌ను, బస్తర్‌లో హత్యాకాండను వెంటనే ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. పీఎల్‌జీఏ సైన్యాల కార్యక్రమాలు శాంతి చర్చలకు అనుకూల వాతావరణం ఏర్పరిచేలా ఉండాలన్నారు. తమ డిమాండ్‌కు ప్రభుత్వం నుంచి ఇంకా అంగీకార ప్రకటన రాలేదు కాబట్టి అన్ని జాగ్రత్తలు పాటించాలని, దాడులకు గురికావద్దని పీఎల్‌జీఏ దళాలకు సూచించారు. పోలీసు జవాన్లను మావోయిస్టు పార్టీ ఎప్పుడూ శత్రువుగా చూడదని, పరస్పరం పోరాడే స్థితిని సృష్టించారని పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు మన్నె క్రిశాంక్

» 9 గంటలపాటు విచారణ

రాయదుర్గం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ని ఉపయోగించి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు చేశారంటూ బీఆర్ఎస్ నేతలు మన్నె క్రిశాంక్, కొణతం దిలీప్‌కుమార్‌కు గచ్చిబౌలి పోలీసులు ఈ నెల 9, 10, 11 తేదీల్లో విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం ఉదయం 11.30కు క్రిశాంక్, దిలీప్‌కుమార్ గచ్చిబౌలి పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. 9 గంటలకు పైగా పోలీసులు వారిని విచారించారు. ఏప్రిల్ 14న తిరిగి విచారణకు రావాలని నోటీసులు ఇచ్చారు. విచారణ అనంతరం బయటకు వచ్చిన క్రిశాంక్, దిలీప్ మాట్లాడుతూ.. తప్పుడు కేసులకు భయపడేది లేదన్నారు.



గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న మన్నె క్రిశాంక్, కొణతం దిలీప్ కుమార్

కంచె గచ్చిబౌలి భూముల్లో విధ్వంసాన్ని ప్రపంచానికి తెలిసేలా చేసిన తమను అక్రమ కేసులు, విచారణ పేరుతో ఇబ్బందులకు గురిచేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి సుప్రీం కోర్టు తలంటినా బుద్ధి రాలేదని విమర్శించారు. తాము భయపడేది లేదని, ఈ ప్రభుత్వం చేసే తప్పులను ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు. తాము పోలీసుల విచారణకు ఉదయం 11 గంటలకు వస్తే మధ్యాహ్నం 1 గంటకు రెండు ప్రశ్నలు అడిగారని చెప్పారు. ఎందుకు పోస్టులు పెట్టారు? ఎలా పెట్టారని ప్రశ్నించారని వెల్లడించారు. దానికి తాము రేవంత్‌రెడ్డి హెచ్‌సీయూ భూముల్లో జింకలు లేవని చెప్పడంతో.. జింకల ఫొటోలను ఫోన్ ద్వారా పెట్టామని సమాధానమిచ్చామన్నారు. అనంతరం పోలీసులు ఏడు గంటల పాటు తమను కూర్చోబెట్టారని తెలిపారు. ఆ తర్వాత పై నుంచి ఓ ప్రశ్నల పేపర్ వచ్చిందని, మిమ్మల్ని ఎవరైనా పంపించారా? అని ప్రశ్నించి కేసీఆర్, కేటీఆర్‌ను ఇరికించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. హెచ్‌సీయూ విద్యార్థులు పెట్టిన వాటినే తాము పెట్టామని సమాధానం చెప్పినట్లు వెల్లడించారు. పోలీసులు తమ మొబైల్ ఫోన్లు ఇవ్వాలని అడిగారని, తాము లేవని చెప్పడంతో తమ ఇళ్లలో సోదాలు చేసేందుకు చూస్తున్నారన్నారు.

పెట్రోల్, గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

» సుంకాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

» కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్‌కు కేటీఆర్ లేఖ



హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, కేంద్ర ఎక్సైజ్ సుంకాలను తగ్గించి అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా పారదర్శక ధరల విధానం అమలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీకి ఆయన లేఖ రాశారు. క్రూడ్ ఆయిల్ ధరలు 100డాలర్లు దాటినప్పుడు కూడా ఇప్పటితో పోలిస్తే దేశంలో ఇంధన ధరలు తక్కువగా ఉన్నాయని, ఇప్పుడు క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా... ప్రజలపై భారం మోపడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ధరలు స్థిరంగా ఉంచి, ఓట్ల పండగ ముగియగానే పెంచడం ప్రజల్ని వంచించడమేనని పేర్కొన్నారు. మోదీ సర్కారు ఆర్థిక దోపిడీకి పాల్పడుతూ రాష్ట్రాల హక్కులను కబళిస్తోందని, పన్నుల్లో రావాల్సిన న్యాయమైన వాటాను ఇవ్వకుండా సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. దేశ ఆర్థికవ్యవస్థ పురోగతికి సహకరిస్తున్న తెలంగాణ సహా అనేక రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతుంటే.. సుంకాల వసూళ్లతో కేంద్రం పెత్తనం చెలాయించడం అభ్యంతరకరమన్నారు. సుంకాలు, ఆదాయ వాటా వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని సూచించారు.

కేసీఆర్ తెలంగాణను నిలబెడితే.. రేవంత్ పడగొట్టిండు: హరీశ్‌రావు



పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): "కేసీఆర్‌ది సాగు భాష అయితే, రేవంత్‌రెడ్డిది చావు భాష. కేసీఆర్ తెలంగాణను నిలబెడితే, రేవంత్‌రెడ్డి పడగొట్టిండు" అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్ వైపు చూస్తున్నారని, కాంగ్రెస్ ఏడాది పాలనలోనే పాలేవో.. నీళ్లేవో ప్రజలకు అర్థమైపోయిందని చెప్పారు. సంగారెడ్డి జిల్లా బీరంగూడ నుంచి రుద్రారం వినాయకుడి ఆలయం వరకు బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శరెడ్డి పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమానికి హరీశ్‌రావు హాజరయ్యారు. వినాయకుడి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో హరీశ్ మాట్లాడుతూ.. హెచ్‌సీయూ అడవులను నరికి, మూగజీవాల ఉసురు పోసుకుంటున్న రేవంత్‌రెడ్డి.. విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టినందుకు వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. "అధికారంలోకి రాగానే ఫార్మాసిటీ భూములన్ని రైతులకు ఇప్పిస్తామని చెప్పినే రేవంత్.. ఇప్పుడేమో ఫార్మా సిటీ కోసం 16 వేల ఎకరాలను సేకరిస్తామంటున్నారు" అని ఎద్దేవా చేశారు.

ఎస్‌హెచ్‌జీలకు వడ్డీలేని రుణాలివ్వాలి: కవిత

మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.15 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను అందించి, మహిళల స్వావలంబన దిశగా కేంద్రం దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ మహిళా సాధికారత సమాఖ్య ప్రతినిధులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ బ్యాంకు రుణాలు ఎగవేసే బడా వ్యాపారులకు లక్షల కోట్ల మేర రుణాలను మాఫీ చేసే కేంద్ర ప్రభుత్వానికి మహిళలకు రుణాలిచ్చేందుకు మాత్రం మనసు రాకపోవడం శోచనీయమన్నారు. కేంద్రానికి మహిళల పట్ల చిత్తశుద్ధి ఉంటే వారి కోసం ప్రత్యేక పథకాలను ప్రకటించాలని సూచించారు. రాష్ట్రంలో 5 లక్షల మేరకే వడ్డీలేని రుణాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం 20 లక్షల వరకు ఇస్తున్నట్లు అబద్ధాలు చెబుతోందని విమర్శించారు.

నేడు కంచ గచ్చిబౌలికి కేంద్ర సాధికార కమిటీ రాక

» వాస్తవ పరిస్థితులపై అధ్యయనం

» హైదరాబాద్‌లో 2 రోజుల పర్యటన

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన కేంద్ర సాధికార కమిటీ (సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ- పర్యావరణ మందింపు కమిటీ) గురువారం కంచ గచ్చిబౌలి భూములను పరిశీలించనుంది. ఈ మేరకు కమిటీ బుధవారం సాయంత్రం హైదరాబాద్ చేరుకుంది. కమిటీ రెండు రోజుల పాటు నగరంలో పర్యటించనుంది. పర్యావరణ, అటవీ శాఖల సాధికార కమిటీ ఛైర్మన్ సిద్ధాంత దాస్.. సాధికార కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, సీపీ గోయల్, సునిల్ లిమయి, జేఆర్ భట్ సభ్యులుగా ఉన్నారు. తాజ్‌కృష్ణా హోటల్‌లో బసచేసిన ఈ కమిటీ గురువారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చేరుకుంటుంది. అనంతరం కంచ గచ్చిబౌలి భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులపై అధ్యయనం చేయనుంది. రెండో రోజు పర్యావరణ చట్టాల ఉల్లంఘనపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన సంస్థలు, ఎన్జీవోలు, విద్యార్థులతో చర్చించనుంది. అటవీ శాఖ అధికారుల నుంచి అనుమతి లేకుండా అభివృద్ధి కార్యకలాపాల పేరుతో కంచ గచ్చిబౌలిలో ప్రభుత్వం చెట్లను తొలగిస్తుందంటూ వచ్చిన ఫిర్యాదులపై మార్చి 31వ తేదీన సుప్రీం కోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి వచ్చిన కేంద్ర సాధికార కమిటీ నివేదిక అత్యంత కీలకం కానుంది. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కంచ గచ్చిబౌలి భూములను పరిశీలించారు. కమిటీ పర్యటనకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తప్పు చేసిందే బీఆర్ఎస్ నేతలు!

» విద్యార్థుల మీద ప్రేమ ఉంటే 2012లో కలెక్టర్ ఇచ్చిన నివేదికను అమలు చేయలేదేం?: రఘునందన్‌రావు

» హెచ్‌సీయూ భూములపై కొండా ఇంట్లో బీజేపీ ఎంపీల భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల విషయంలో తప్పు చేసిందే బీఆర్ఎస్ వాళ్లని, ఇప్పుడు సుద్దపూసల్లా మాట్లాడుతున్నారని మెదక్ ఎంపీ రఘునందరావు ఆరోపించారు. వర్సిటీ భూముల వ్యవహారంపై బీజేపీ ఎంపీలు బుధవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇంట్లో సమావేశమై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 1974లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీ అవసరాల కోసం 2324 ఎకరాల భూమిని కేటాయించిందని రఘునందన్‌రావు చెప్పారు. పలు ప్రభుత్వ కార్యాలయాలకు లీజుకిచ్చిన అనంతరం మిగిలిన 2185 ఎకరాలను యూనివర్సిటీకి బదలాయించ(అలినేషన్) లేదంటూ 2012లో అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భూపరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)కు లేఖ రాశారన్నారు. అప్పుడే భూమిని వర్సిటీకి అలినేషన్ చేసి ఉంటే ప్రస్తుత వివాదమే ఉండేది కాదని చెప్పారు. ఈ భూముల నుంచే 400 ఎకరాలు ఐఎంజీ సంస్థకు కేటాయించారని.. ఆ తర్వాత ఒప్పందం రద్దు చేయడంతో ఆ సంస్థ కోర్టుకు వెళ్లిందని గుర్తుచేశారు. ప్రస్తుత ఇందిరమ్మ పాలనలో మిగిలి ఉన్న భూములకు ప్రహరీ కట్టి, వర్సిటీకి అప్పగించాలని కాంగ్రెస్ నాయకులను డిమాండ్ చేశారు. 2012లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఇచ్చిన నివేదిక సీసీఎల్ఏలో పెండింగ్‌లో ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటయ్యాక అప్పటి బీఆర్ఎస్ పాలకులు ఆ నివేదిక ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోలేదని రఘునందన్‌రావు ప్రశ్నించారు. నాటి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా 2185 ఎకరాలను హెచ్‌సీయూకు అలినేషన్ చేయాలని లేఖ రాసినా పట్టించుకోలేదన్నారు. ఐఎంజీ భూములు 400 ఎకరాలు మినహాయించి, మిగిలిన 1785 ఎకరాలకైనా ఎందుకు ప్రహరీ నిర్మించలేదని, కేటీఆర్ ఆ పని ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. వర్సిటీ భూములను టీఎన్‌జీవోలకు ఇచ్చింది మీరు కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం వర్సిటీలో రోడ్డు వేసింది ఎవరని నిలదీశారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఇప్పుడు మిగిలి ఉన్న భూములకైనా ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16 వరకు సుప్రీం కోర్టు స్టేటస్‌కో ఇస్తే.. ఇంతలోనే ఆ భూములు తమవేనంటూ టీజీఐఐసీ బోర్డు పెట్టడం కోర్టు ధిక్కరణ కాదా? అన్నారు. అందరి చరిత్ర తీసుకుని గన్‌పార్క్‌కు వస్తే చర్చించేందుకు బీజేపీ సిద్ధమేనని రఘునందన్‌రావు చెప్పారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. భూముల విషయంలో చట్ట ప్రకారం ఏం చేయాలనే అంశంపై చర్చించామన్నారు. బీఆర్ఎస్ వాళ్ల బాధంతా ఆ భూములను తాము అమ్ముకోలేకపోయామనే తప్ప, వేరే ఏమీ లేదని పేర్కొన్నారు.

నేడు యంగ్ ఇండియా పోలీసు స్కూల్ ప్రారంభం

- 50% సీట్లు పోలీసుల పిల్లలకు, మిగిలినవి ఇతరులకు..
- అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్య
- సైనిక పాఠశాలల తరహాలో బోధన

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సైనిక పాఠశాలల తరహాలో పోలీసుల పిల్లల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీసు స్కూల్ ప్రాజెక్టులో భాగంగా మంచిరేవులలో తొలి స్కూల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఉదయం ప్రారంభిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు హాజరవుతున్నారు. అమరులైన పోలీసుల పిల్లలకు ఇందులో తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆ తర్వాత సర్వీసులో ఉన్న కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్‌ల కుటుంబాల పిల్లలకు 50 శాతం సీట్లు కేటాయించారు. మరో 50 శాతం సీట్లు స్థానికులకు కేటాయించారు. విధి నిర్వహణలో ఉండి పోలీసు అధికారులు కుటుంబాలకు తక్కువ ప్రాధాన్యం ఇస్తుంటారని, అలాంటపుడు వారి పిల్లల చదువు సవాలుగా మారుతుందని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఆ లోటును భర్తీ చేసే విధంగా పోలీసుల పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉత్తమ విద్యను అందించడానికి యంగ్ ఇండియా పోలీసు స్కూళ్లు పనిచేస్తాయని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ శిక్షణతో పాటు విద్యార్థులకు నూతన ఆవిష్కరణలను పరిచయం చేస్తూ క్రమశిక్షణ కలిగిన పౌరులుగా మార్చడానికి యంగ్ ఇండియా పోలీసు స్కూళ్ల ప్రాజెక్టు ఒక అవకాశం అని డీజీపీ జితేందర్ అన్నారు. ఈ స్కూలు తెలంగాణ పోలీసు చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలుస్తుందని తెలంగాణ పోలీసులు 'ఎక్స్' వేదికగా ప్రకటించారు.

ఇంజనీరింగ్‌పై అబ్బాయిల్లో తగ్గని క్రేజ్

- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌లో అమ్మాయిలే అధికం
- టీజీ ఎప్‌సెట్‌కు మూడు లక్షలు దాటిన దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సులపై అమ్మాయిల కన్నా అబ్బాయిల్లో క్రేజ్ పెరుగుతుండగా, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సుల వైపు అబ్బాయిల కన్నా అమ్మాయిలే అధికంగా చూస్తుండడం విశేషం. ఆయా కోర్సుల్లో ప్రవేశాలకై నిర్వహిస్తున్న టీజీ ఎప్‌సెట్-2005కు తాజాగా వచ్చిన దరఖాస్తులే ఇందుకు నిదర్శనం. ఎప్‌సెట్‌కు బుధవారం దాకా మొత్తం 3,00,500 దరఖాస్తులు రాగా, వాటిలో 2,16,007 దరఖాస్తులు ఇంజనీరింగ్ కోసం, 84,250 దరఖాస్తులు అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ కోసం, రెండింటికి కలిపి మరో 243 మంది అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇంజనీరింగ్ స్ట్రీమ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అబ్బాయిలు 1,23,310 మంది ఉండగా, అమ్మాయిలు 92,697 (75%)మందే ఉన్నారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్‌కు దరఖాస్తు చేసిన వారిలో అబ్బాయిలు 20,513మంది ఉండగా, అమ్మాయిలు 63,737 (మూడు రెట్లు) మంది ఉన్నారు.



పోటీపడుతున్న 764మంది దివ్యాంగులు

ఇంజనీరింగ్, అగ్రికల్చర్, అండ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎప్‌సెట్-2025 రాసేందుకు 764మంది దివ్యాంగులు సన్నద్ధమయ్యారు. 542మంది ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు, 217మంది అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ దరఖాస్తు చేయగా, మరో ఐదుగురు రెండు పరీక్షలు రాసేందుకు దరఖాస్తులు సమర్పించారు. మానసిక వైకల్యం ఉన్నవారు 20 మంది, అంధత్వం 115, చెవిటి 142, సెలబ్రల్ పాల్సీ, లెప్రసీ తదితర 473, బహుళ వైకల్యం కలిగిన మరో 14మంది ఉన్నట్లు సమాచారం. ఎప్‌సెట్-2025 అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలను ఈ నెల 29, 30తేదీల్లో, ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు మే 2నుంచి 5వరకు జరగనున్నాయి.

4 సంస్థలకు రూ. 38.59లక్షల గ్రాంట్లు

- గవర్నర్ విచక్షణ కోటా కింద నిధుల అందజేత

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సామాజిక సంక్షేమం, విద్యా, సేవారంగాల్లో కృషి చేస్తున్న నాలుగు సంస్థలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రూ.38.59లక్షల గ్రాంట్లను బుధవారం రాజ్‌భవన్‌లో అందచేశారు. గవర్నర్ విచక్షణ కోటా కింద ఈ నిధులను ఆయన విడుదల చేశారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ప్రజ్వల స్వచ్ఛంద సంస్థకు రూ. 20లక్షలు, మారుమూల ప్రాంతాల్లో విద్యా రంగంలో సేవలందిస్తున్న పీజీయుకేటీ సంస్థకు రూ. 15లక్షలు, సికింద్రాబాద్‌లోని ఆర్మీ డెంటల్ కళాశాలకు రూ. 2.24 లక్షలు, మయూరి మార్గ్‌లోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌కు రూ. 1.35లక్షల గ్రాంటుకు సంబంధించిన డిడీలను గవర్నర్ అందచేశారు.



ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధికి చెక్కు అందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సీఎం రేవంత్ చేతుల మీదుగా 14న 423 మందికి నియామక పత్రాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన నీటిపారుదల శాఖ

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో ఇటీవలే ఎంపికైన 199 మంది జూనియర్ టెక్నికల్ అధికారులు(జేటీవో), 224 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు(ఏఈ)లకు 14న సీఎం రేవంత్ నియామక పత్రాలు అందించనున్నారు. రాజేంద్రనగర్‌లోని వాలంతరీలో జరిగే కార్యక్రమంలో ఆయన వీరికి నియామక పత్రాలు ఇవ్వనున్నారు. దీనికోసం ఇప్పటికే నీటిపారుదల శాఖ పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసింది. తుది దశ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా పూర్తి చేశారు. మరోవైపు ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించడానికి వీలుగా గురువారం నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి వాలంతరీని సందర్శించనున్నారు. నియామక పత్రాలు అందించే కార్యక్రమం పూర్తయ్యాక వివిధ ప్రాజెక్టుల పనులపై సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌తో కలిసి, సమీక్ష చేయనున్నారు.

ఈసారి పాత పద్ధతిలోనే ఇంటర్ ప్రవేశాలు?

రాష్ట్రంలో రాబోయే విద్యా సంవత్సరంలో కూడా ఇంటర్మీడియట్ ప్రవేశాలకు పాత విధానాన్నే కొనసాగించాలని ఇంటర్‌బోర్డ్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ తరహాలోనే ఇంటర్ ప్రవేశాలకూ ఆన్‌లైన్ విధానాన్నే అమలు చేయాలని విద్యాశాఖ తొలుత భావించింది. అయితే దీనికి చాలా అవరోధాలున్నాయి. కళాశాలలకు ఫీజు నిర్ణయించాలంటే వాటికి ముందుగానే గ్రేడింగ్స్ నిర్ణయించాల్సి ఉంటుంది. ప్రస్తుతం పలు కళాశాలలు నీట్, ఎప్‌సెట్, జేఈఈ వంటి పరీక్షలకు శిక్షణ ఇస్తున్న నేపథ్యంలో వాటికి ఫీజులను ఎలా నిర్ణయించాలన్న విషయంపై అనేక సందేహాలున్నాయి. ఈ అంశాలన్నింటినీ ఇంటర్‌బోర్డ్ అధికారులు పరిగణలోకి తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

బెట్టింగ్ యాప్స్ కేసులపై సిట్ సమీక్ష

బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించి నమోదైన కేసులపై సిట్ అధికారుల బృందం బుధవారం సమీక్ష నిర్వహించింది. బెట్టింగ్ యాప్స్ ప్రమోటర్స్ నిర్వాహకులు, కంపెనీలపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో అన్ని కేసుల విచారణ ఒకే పద్ధతిలో జరిగేలా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌ఓపీ)ను రూపొందించాలని సిట్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఎస్‌ఓపీ విధివిధానాలు ఖరారైన తర్వాత.. ఈ కేసులు నమోదు చేసిన దర్యాప్తు అధికారులందరినీ పిలిపించి, వారికి ఈ కేసుల్లో ఆధారాల సేకరణతో పాటు తదుపరి దర్యాప్తునకు సంబంధించిన సూచనలు ఇవ్వాలని సిట్ అధికారులు భావిస్తున్నారు.

ఆర్ అండ్ బీలో పలువురికి పదోన్నతులు

రహదారులు, భవనాలశాఖలో పలువురు సహాయ ఇంజనీర్ (ఏఈ)లకు పదోన్నతులు, పోస్టింగులు ఇస్తూ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వికాస్ రాజ్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. సహాయ ఇంజనీర్లుగా పనిచేస్తున్న 101 మందికి డీఈలుగా పదోన్నతి ఇచ్చి పోస్టింగులు ఇచ్చారు. అలాగే 22 మంది ఈఈలకు, సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులిచ్చారు. వీరికి కూడా పదోన్నతులతోపాటు పోస్టింగులు ఇచ్చారు.

నేరాల నియంత్రణలో తెలంగాణ పోలీసులు టాప్

- ప్రజల భద్రత, రక్షణలోనూ దేశంలోనే మొదటి స్థానం: డీజీపీ

గన్‌పార్క్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల భద్రత, రక్షణ, నేరాల నియంత్రణలో దేశంలోనే తెలంగాణ పోలీసు శాఖ మొదటి స్థానంలో నిలిచిందని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసుశాఖ 18 పతకాలను సాధించి గొప్ప పేరు సాధించిందన్నారు. రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలు తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. బుధవారం రెడ్ హిల్స్‌లో 'ఇన్నోవేషన్ ఫర్ బెటర్ విజిలెన్స్ అండ్ పబ్లిక్ సేఫ్టీ ఇన్ ద స్టేట్' అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హింసాత్మక సంఘటనలు తలెత్తితే 100, 112, 911 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని.. ఆన్‌లైన్ మోసాలు, ఖాతాల నుంచి సొమ్ము పోగొట్టుకుంటే 1930కి ఫిర్యాదు చేయాలని అన్నారు.

హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ల ఏర్పాటుకు సెప్టెంబరు 30 గడువు

(మొదటిపేజీ తరువాయి)

హైసెక్యూరిటీ నంబరు ప్లేట్లు అమర్చుకోవాలని గడువు విధించింది. ఈ మేరకు రవాణా శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్ణీత గడువు నాటికి హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు అమర్చుకోని వాహనదారులపై మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు హై సెక్యూరిటీ నంబరు ప్లేట్ కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా నంబర్ ప్లేట్లు అమర్చుకోని వాహనానికి బీమా రెన్యువల్‌ను అనుమతించరాదని ఆయా సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేశామని, కాలుష్య సర్టిఫికెట్ సైతం జారీ చేయబోమని స్పష్టం చేశారు. హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ కోసం అధికారిక వెబ్ సైట్ www.siam.in లో బుక్ హెచ్ఎస్ఆర్‌పీ బటన్‌పై క్లిక్ చేసి పొందవచ్చు. ద్విచక్ర వాహనాలకు రూ.320-380, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ద్విచక్ర వాహనాలకు రూ.400-500, కార్లకు రూ.590-700, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న కార్లకు రూ.700-860, ఆటోలకు రూ.350-450, వాణిజ్య వాహనాలకు రూ.600-800 చొప్పున ధరలు నిర్ణయించారు.

బ్రిటిష్ వారి కంటే

బీజేపీ నేతలు ప్రమాదకారులు

(మొదటిపేజీ తరువాయి)

వెళుతున్నాం. బీజేపీని ఓడించే బాధ్యతను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, గాంధీ వారసులు ఇక్కడి నుంచి తీసుకెళ్లాలి. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినా.. తెలంగాణకు రాలేదు. జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలో సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ మాకు నిజాం పాలన నుంచి స్వాతంత్ర్యాన్ని ప్రసాదించారన్నారు. గుజరాత్ ప్రజలకు పటేల్‌తో వారసత్వ బంధం ఉండొచ్చు. కానీ, తెలంగాణ ప్రజలకు ఆయనతో హృదయ బంధం ఉంది. తెలంగాణ ప్రజలకు పటేల్ స్వాతంత్ర్యం ప్రసాదిస్తే.. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్నే ఇచ్చారు" అని రేవంత్ అన్నారు. సోనియాగాంధీని 'తెలంగాణ మాత' అని సంబోధించారు.

గాడ్సే ఆలోచనల వ్యాప్తికి మోదీ ప్రయత్నం...

దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గాంధీజీ 30 ఏళ్లపాటు అనేక పోరాటాలు నిర్వహించినా.. వారు ఏనాడూ ఆయనపై లాఠీ ప్రయోగం చేయలేదని రేవంత్‌రెడ్డి తెలిపారు. కానీ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఆరు నెలలు తిరగకుండానే గాడ్సే, అతని వారసులు గాంధీజీపై తూటాను ప్రయోగించి హత్య చేశారన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశంలో విభజన రాజకీయాలు ఎక్కువయ్యాయన్నారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలో గాంధీ ఆలోచనా విధానానికి అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుంటే.. మోదీ మాత్రం గాడ్సే ఆలోచనా విధానాన్ని దేశంలో వ్యాప్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రైతు వ్యతిరేక నల్లచట్టాలు, మణిపూర్ అల్లర్లు మోదీ గ్యారెంటీలు అని, నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతులు 15 నెలలపాటు ఆందోళనలు చేసినా.. మోదీ కనికరించలేదని విమర్శించారు. మణిపూర్‌లో మంటలు రాజేసి.. దేశ మూలవాసుల జీవన హక్కును కాలరాసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఏటా 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చి 11 ఏళ్లు గడిచిందని, ఆ లెక్కన ఈ పాటికే 20 కోట్లకు పైగా ఉద్యోగాలు కల్పించి ఉండాలని అన్నారు. కానీ, మోదీ, అమిత్‌షాలకు ఉద్యోగాలు వచ్చాయే తప్ప.. యువతకు 2 కోట్ల ఉద్యోగాలు మాత్రం రాలేదన్నారు.



తెలంగాణలో రాహుల్ హామీలను నెరవేర్చాం..

కన్యాకుమారి నుంచి కశ్మీరు వరకు 4వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసిన రాహుల్‌గాంధీ.. జాతీయ జనగణన, యువతకు ఉద్యోగాల కల్పన, మహిళా సంక్షేమంపై వాగ్దానాలు చేశారని రేవంత్ అన్నారు. తెలంగాణలో పాదయాత్ర సందర్భంగా.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల మేరకు రుణాలను మాఫీ చేస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ వాగ్దానం మేరకు రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 25.50 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణాలను మాఫీ చేశామని తెలిపారు. కులగణన కూడా చేసి చూపించామన్నారు. తెలంగాణలో నిర్వహించిన కులగణనను రాహుల్‌గాంధీ పార్లమెంటులో లేవనెత్తుతారన్న భయంతోనే ఆయనకు మోదీ మైక్ ఇవ్వలేదని ఆరోపించారు. కాగా, దేశవ్యాప్తంగా ఇటీవలి కాలంలో మరణించిన కాంగ్రెస్ నేతలకు ఏఐసీసీ విస్తృత సమావేశం నివాళులర్పించింది. ఇందులో భాగంగా తెలంగాణ నుంచి పీసీసీ మాజీ అధ్యక్షులు డి.శ్రీనివాస్, నర్సారెడ్డి, ఏఐసీసీ సభ్యులుగా పని చేసిన ఇంద్రసేనారెడ్డి, టి.నాగయ్య మృతికి సంతాపం ప్రకటించి.. నివాళులర్పించింది. రెండు రోజులపాటు జరిగిన సీడబ్ల్యూసీ, ఏఐసీసీ విస్తృత సమావేశంలో తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, సీడబ్ల్యూసీ ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఏఐసీసీ సభ్యులు తదితరులు మొత్తం కలిసి 41 మంది పాల్గొన్నారు.

తమిళిసై తండ్రి మృతికి సీఎం రేవంత్ సంతాపం

తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై తండ్రి.. తమిళనాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, సాహితీవేత్త కుమారి అనంతన్(హరికృష్ణన్ నాడార్ అనంతకృష్ణన్) మరణం పట్ల సీఎం రేవంత్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మహాత్ముడి సిద్ధాంతాలను పుణికి పుచ్చుకున్న దేశ భక్తుడు, అయిన అనంతన్ మరణం బాధాకరమన్నారు. తమిళిసై, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీ కరోనా కంటే ప్రమాదకరం

- రేవంత్‌రెడ్డి బీజేపీని బ్రిటిషర్లతో పోల్చడం సిగ్గుచేటు
- తెలంగాణలో కమలాన్ని అడ్డుకుంటామనడం శతాబ్దపు జోక్: బండి సంజయ్



హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ కరోనా కంటే ప్రమాదకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. బ్రిటిషర్ల కంటే బీజేపీ ప్రమాదకరమంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జాతీయవాద సిద్ధాంతాలు, నిలువెల్లా దేశభక్తిని పుణికి పుచ్చుకున్న బీజేపీని.. దేశాన్ని దోచుకున్న బ్రిటిషర్లతో పోల్చడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు. అవకాశవాద రాజకీయాలకు, అవినీతి పాలనకు నిలువెత్తు రూపం కాంగ్రెస్ పార్టీ అని, అది కరోనా కంటే ప్రమాదకరమని అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ అంతరించిపోతున్న జాతిలాంటిదని, బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో ఎంతటి ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందో... 15 నెలల పాలనలో కాంగ్రెస్ పార్టీ అంతకు రెట్టింపు వ్యతిరేకతను మూటగట్టుకున్న విషయాన్ని రేవంత్‌రెడ్డి మర్చిపోయారా? అని ప్రశ్నించారు. తన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్‌ను గెలిపించలేకపోయారని, సిట్టింగ్ సీటైన మల్కాజ్‌గిరి స్థానాన్ని నిలబెట్టుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. ఎంపీ ఎన్నికల ఫలితాలు, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే 50 శాతానికిపైగా ప్రాతినిధ్యాన్ని బీజేపీ కలిగి ఉందనే విషయాన్ని విస్మరించొద్దని చెప్పారు. బీజేపీ కంచుకోటైన గుజరాత్‌కు వెళ్లి తెలంగాణలో బీజేపీని అడ్డుకునే శక్తి ఉందనడం ఈ శతాబ్దపుజోక్ అని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం పక్కా అని చెప్పారు.

మెట్రోరైల్ ఎండీగా మళ్లీ ఎన్వీఎస్ రెడ్డి

ఏడాది కాలానికి పునర్నియామకం



హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్, హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎన్వీఎస్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ నియమించింది. ఇదివరకు పనిచేసిన ఆయా స్థానాల్లోనే మరో ఏడాది కాలానికి తిరిగి ఆయనను నియమిస్తూ జీవో నంబర్82ను ప్రభుత్వం జారీ చేసింది. ఈ మేరకు మునిసిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. 2025 ఏప్రిల్ 1 నుంచి ఏడాదిపాటు ఆయన పదవిలో కొనసాగుతారని అందులో పేర్కొన్నారు. మెట్రో ఫేజ్-2, ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్టుల క్లిష్టమైన ప్రణాళిక, డాక్యుమెంటేషన్ దశలో ఉన్నందున ఎన్వీఎస్ రెడ్డి సేవలు అవసరమని భావించి ఆయనను తిరిగి నియమిస్తున్నట్లు ఆదేశాల్లో వివరించారు. మెట్రో రెండో దశలో రెండు భాగాలుగా ప్రాజెక్టు చేపట్టాల్సి ఉన్న నేపథ్యంలో మరో 8 మందిని కూడా తిరిగి నియమించుకునే అవకాశం ఉందని మెట్రో వర్గాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో మెట్రో రెండో దశ మొదటి భాగం, డీపీఆర్ రూపకల్పన రెండో భాగం ఉండడంతో ఇప్పటి వరకు పనిచేసిన అధికారుల అవసరం ఉన్న నేపథ్యంలోనే కొందరు అధికారులను మరో ఏడాదికాలానికి నియమించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. పదవీ విరమణ పొందిన తర్వాత కూడా కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతున్న 6,729 మందిని గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఇలా తొలగించిన వారిలో అటెండర్ నుంచి ఐఏఎస్ అధికారుల వరకు ఉన్నారు. ఈ జాబితాలో మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఒకరు. అయితే ఇలా తొలగించిన వారిలో ఎవరి సేవలైనా అవసరం అని భావిస్తే వారి పునర్నియమానికి నోటిఫికేషన్, ఉత్తర్వులు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తాజాగా ఎన్వీఎస్‌రెడ్డిని తిరిగి నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

24 నుంచి వేసవి సెలవులు

- నెలాఖరులో పదో తరగతి ఫలితాలు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాలైన విద్యా సంస్థల పరిధిలోని పాఠశాలలకు ఈ నెల 24 నుంచి విద్యాశాఖ వేసవి సెలవులు ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని పేర్కొంది. అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే ఈ షెడ్యూల్‌ను ఖరారు చేసినట్లు విద్యాశాఖ తెలిపింది. పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనాన్ని 15వ తేదీ లోపు పూర్తి చేసి, ఈ నెలాఖరులోగా ఫలితాలు వెల్లడిస్తామని విద్యాశాఖ తెలిపింది.

సీతమ్మసాగర్ బ్యారేజీ డిజైన్లకు గ్రీన్‌సిగ్నల్!

- రాష్ట్రానికి కేంద్ర జలవనరుల సంఘం లేఖ
- తాము లేవనెత్తిన అంశాలను చేర్చుతూ నవీకరించిన డీపీఆర్ సమర్పించాలని సూచన



హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం (సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టు)లో భాగంగా నిర్మించ తలపెట్టిన బ్యారేజీ డిజైన్లు సరిగ్గానే ఉన్నాయని కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) అప్రైజల్ డైరెక్టరేట్ తెలిపింది. ప్రాజెక్టు బ్యారేజీ స్థిరత్వాన్ని భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్) ప్రమాణాల మేరకు విశ్లేషించగా, సరిగ్గానే ఉన్నట్టు తేలిందని అప్రైజల్ విభాగం డైరెక్టర్ మనోజ్‌కుమార్ మీనా ఈ నెల 4న రాష్ట్రానికి లేఖ రాశారు. దీంతో ప్రాజెక్టుకి సీడబ్ల్యూసీలోని సాంకేతిక సలహా మండలి (టీఏసీ) అనుమతులకు మార్గం సుగమమైనట్లేనని నీటిపారుదల శాఖ వర్గాలు భావిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ డిజైన్ల వైఫల్యంతోనే కుంగిందని తేలిన నేపథ్యంలో సీతమ్మసాగర్ బ్యారేజీ డిజైన్లను పునఃపరిశీలించిన తర్వాతే అనుమతుల విషయంలో ముందుకెళ్తామని ఇటీవల జరిగిన టీఏసీ సమావేశంలో కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ తేల్చిచెప్పారు. ఈ క్రమంలోనే ఆ ప్రాజెక్టు డిజైన్లను సీడబ్ల్యూసీకి తెలంగాణ నీటి పారుదల శాఖ సమర్పించింది. వీటిని పరిశీలించిన సీడబ్ల్యూసీలోని అప్రైజల్ విభాగం డైరెక్టర్ పలు అంశాలపై వివరణ కోరారు. భూకంపాల విషయంలో డిజైన్ల రూపకల్పనలో అనుసరించిన ప్రమాణాలు సమర్పించకపోవడంతో బ్యారేజీ స్థిరత్వాన్ని విశ్లేషించడం సాధ్యం కాలేదన్నారు. బ్యారేజీ నుంచి దిగువకు దూకే వరద ఉధృతితో బ్యారేజీకి ఎలాంటి నష్టం జరగకుండా డిజైన్ల రూపకల్పనలో తగిన ఏర్పాట్లు చేసినట్టు గుర్తించామని తెలిపారు. అయితే, 2డీ మోడల్ అధ్యయనం నిర్వహించి నీటి ఉధృతిని నిర్ధారించాల్సి ఉందన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి హైడ్రో మెకానికల్ పరికరాలకు సంబంధించిన డిజైన్ లెక్కలతో పాటు బ్యారేజీ గేట్లు, స్టాప్ లాగ్ గేట్లు, పవర్ హౌజ్‌కి సంబంధించిన ఇన్‌టేక్ గేట్లు, డ్రాఫ్ట్ ట్యూబ్ గేట్స్‌కి సంబంధించిన డ్రాయింగ్స్‌ను సమర్పించలేదని వెల్లడించారు. గత నెలలో రాష్ట్ర అధికారులు బ్యారేజీ ప్రధాన గేట్లు, స్లూయిస్ రేడియల్ గేట్లకి సంబంధించిన డ్రాయింగ్స్‌ను సమర్పించగా, అవి కూడా సరైన రీతిలో ఉన్నట్టు నిర్ధారించామని లేఖలో ప్రస్తావించారు. తమకు సమర్పించిన సీతారామ ఎత్తిపోతల పథకం డీపీఆర్‌లో కీలక నిర్మాణాలైన ఇన్‌టేక్, వాటర్ కండక్టర్ సిస్టమ్‌కు సంబంధించిన డిజైన్ లెక్కలు, పంప్‌హౌజ్ డిజైన్లు, పెన్‌స్టాక్ డిజైన్లు వంటివి లేవని పేర్కొన్నారు. ప్రాజెక్టులో భాగంగా 280 మెగావాట్ల జలవిద్యుత్తు కేంద్రాన్ని నిర్మించనుండగా, వీటికి సంబంధించిన డ్రాయింగ్స్ సైతం సమర్పించలేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత డీపీఆర్‌తో నీటి పంపింగ్/ఎత్తిపోతలతో పాటు విద్యుదుత్పత్తి కేంద్రానికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించలేమని స్పష్టం చేశారు. ఈ అంశాలన్నింటినీ పొందుపరిచి నవీకరించిన డీపీఆర్‌ను మళ్లీ సమర్పించాలని రాష్ట్రానికి సూచించారు.

సాగర్‌ను యజమానికి ఇచ్చేద్దామా?

త్వరలో తెలుగు రాష్ట్రాలతో కృష్ణా బోర్డు భేటీ

- ఎన్‌డీఎస్‌ఏ చట్టం ప్రకారం తెలంగాణనే యజమాని

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద 2023 నవంబరు 29వ తేదీకి ముందు ఉన్న పరిస్థితిని పునరుద్ధరించే అంశంపై చర్చించడానికి త్వరలోనే కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) తెలుగు రాష్ట్రాలతో సమావేశం కానుంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ అనంతరం శ్రీశైలం తాత్కాలిక నిర్వహణ బాధ్యతలు ఏపీకి అప్పగించగా... నాగార్జునసాగర్ తాత్కాలిక నిర్వహణ బాధ్యతలను తెలంగాణకు అప్పగించిన విషయం విదితమే. అయితే, సరిగ్గా 2023 నవంబరు 29న(తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు రోజు) ఆంధ్రప్రదేశ్‌లోని జగన్ ప్రభుత్వం.. 500మంది సాయుధ పోలీసుల సాయంతో సాగర్‌లో ఏపీ వైపు ఉన్న భాగాన్ని స్వాధీనం చేసుకుంది. ఆ తర్వాత సాగర్ ప్రాజెక్టు కృష్ణా బోర్డు చేతికి వచ్చింది. దీంతో ఏపీ వైపు విశాఖకు చెందిన సీఆర్‌పీఎఫ్ బలగాలు... తెలంగాణ వైపు ములుగుకు చెందిన సీఆర్‌పీఎఫ్ బలగాలు కాపలా కాశాయి. రెండు రోజుల కిందట రెండు బెటాలియన్ల స్థానంలో ఒక్క బెటాలియన్‌కే రక్షణ బాధ్యతలు కట్టబెడుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ బలగాలను కూడా రానున్న జూన్ కల్లా ఉపసంహరించాల్సి ఉంది. జాతీయ ఆనకట్టల భద్రత చట్టం-21 ప్రకారం శ్రీశైలం ప్రాజెక్టు యజమానిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాగార్జునసాగర్ ప్రాజెక్టు యజమానిగా తెలంగాణ ప్రభుత్వం ఉంటాయని ఇటీవల ఓ సమావేశంలో జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) స్పష్టం చేసింది. 2023 నవంబరు 30వ తేదీ నుంచి సాగర్ కృష్ణా బోర్డు నియంత్రణలో ఉన్నప్పటికీ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) పనులన్నీ తెలంగాణే చూస్తోంది. ఈ నేపథ్యంలో సాగర్ ప్రాజెక్టును తెలంగాణకు అప్పగించే విషయమై సమావేశం నిర్వహించాలని కృష్ణాబోర్డు బుధవారం నిర్ణయించింది. త్వరలోనే షెడ్యూల్‌ను ఖరారు చేసే అవకాశం ఉంది. కాగా, ఏపీలో చంద్రబాబు సీఎం అయ్యాక జలదోపిడీ పెరిగిందని, ములుగు బెటాలియన్ తొలగింపుతో సాగర్ ప్రాజెక్టు పూర్తిగా ఏపీ చేతుల్లోకి వెళ్లిపోయిందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర నిధులు ఢిల్లీకి.. రాష్ట్ర వాటా నీళ్లు ఏపీకి అన్నట్టుగా పరిస్థితి తయారైందని విమర్శించారు.

16 నుంచి గ్రూప్-1 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

నేటి నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల జాబితా

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలనకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) బుధవారం షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 16, 17, 19, 21, 22 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకూ, తిరిగి మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5.30 గంటల వరకూ దరఖాస్తులను పరిశీలిస్తామని తెలిపింది. హైదరాబాద్‌లో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి యూనివర్సిటీలో అభ్యర్థుల ధ్రువ పత్రాలను పరిశీలిస్తామని వెల్లడించింది. ధ్రువ పత్రాల వెరిఫికేషన్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితాను గురువారం నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని పేర్కొంది. అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 22 సాయంత్రం ఐదు గంటల వరకూ వెబ్ ఆప్షన్‌లు పెట్టుకోవచ్చునని తెలిపింది. ఎంపికైన అభ్యర్థులు ఒరిజినల్‌తోపాటు రెండు సెట్ల జిరాక్స్ పత్రాలతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని టీజీపీఎస్సీ సూచించింది. నిర్ణీత తేదీల్లో వెరిఫికేషన్‌కు హాజరు కాని వారికి రిజర్వ్ డేగా 22 ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని వివరించింది. వెరిఫికేషన్ నాడు, రిజర్వ్ డే రోజు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురాకపోతే మళ్లీ అవకాశం ఇవ్వబోమని, ఇతర ఉద్యోగాల కోసం వారి పేర్లను పరిశీలించబోమని కూడా టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచిన అభ్యర్థుల్లో హాజరు కాకున్నా, తిరస్కరణకు గురైనా వారి తర్వాత ర్యాంకులు గల అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుస్తామని వివరించింది.

భూదాన్ భూ అక్రమాలపై ఐఏఎస్‌లతో త్రిసభ్య కమిటీ

- మూడు వారాల్లో నివేదిక ఇస్తుంది
- హైకోర్టుకు వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భూదాన్ భూముల అక్రమాలపై విచారణకు ముగ్గురు ఐఏఎస్ అధికారులతో ఉన్నతస్థాయి కమిటీని నియమించినట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఈ మేరకు ఒక మెమోను హైకోర్టు ఎదుట దాఖలు చేసింది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం నాగారంలోని సర్వే నం.181, 182లోని 103 ఎకరాల భూముల విషయంలో అక్రమాలు జరిగాయని.. అప్పటి జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లకు అనుమతులిచ్చారన్న ఆరోపణలతో హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. సీనియర్ ఐఏఎస్‌లు నవీన్ మిట్టల్, రఘునందన్‌రావు, శశాంకతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ప్రభుత్వన్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఈ కమిటీ మూడు వారాల్లో రికార్డులన్నీ పరిశీలించి నివేదిక ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వం దాఖలు చేసిన మెమోను పరిశీలించాలని.. ఆ తర్వాత వాదనలు వింటామని పేర్కొంటూ విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది.

ఐఏఎస్ శివశంకర్‌ను ఏపీకి పంపలేదేం?

- కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో డీవోపీటీకి క్యాట్ నోటీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ లోతేటి శివశంకర్‌ను ఏపీ క్యాడర్‌కు కేటాయించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా ఎందుకు అమలు చేయలేదని కేంద్ర ప్రభుత్వం (డీవోపీటీ)ను సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్) ప్రశ్నించింది. ఫిబ్రవరి 28న ఇచ్చిన ఆదేశాలను ఇప్పటివరకు అమలు చేయలేదని.. మరో నాలుగువారాలు గడువు ఇస్తున్నామని.. ఆ లోగా తమ ఆదేశాలు అమలు చేయకపోతే కోర్టు ధిక్కరణ ప్రొసీడింగ్స్ ఎదుర్కోవాల్సి వస్తుందని డీవోపీటీ కార్యదర్శికి స్పష్టం చేసింది. ఈ మేరకు కోర్టు ధిక్కరణ కేసులో వివరణ ఇవ్వాలని డీవోపీటీకి నోటీసులు జారీచేసింది. స్థానికత ఆధారంగా ఐఏఎస్ లోతేటి శివశంకర్‌ను ఏపీకి కేటాయించాలని ఫిబ్రవరి 28న క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలు అమలు కాకపోవడంతో లోతేటి శివశంకర్ క్యాట్‌లో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది.

రొనాల్డ్ రోస్‌కు క్యాట్‌లో ఊరట

సీనియర్ ఐఏఎస్ అధికారి రొనాల్డ్ రోస్‌కు క్యాట్‌లో ఊరట లభించింది. ఆయనను తెలంగాణ క్యాడర్‌లోనే కొనసాగించాలని పేర్కొంటూ డీవోపీటీకి క్యాట్ ఆదేశాలు జారీచేసింది. రాష్ట్ర విభజన సందర్భంగా ఆయనను ఏపీకి కేటాయించగా తెలంగాణలో కొనసాగారు. ఆయన విజ్ఞప్తిని తిరస్కరించిన కేంద్ర ప్రభుత్వం ఏపీకి వెళ్లిపోవాలని చెప్పడంతో ఏపీలో రిపోర్ట్ చేశారు. అనంతరం మళ్లీ క్యాట్‌ను ఆశ్రయించారు.

చార్జిషీట్లలో హైదరాబాద్ జోన్ ఈడీ ఫస్ట్

- దేశంలోనే అత్యధికంగా దాఖలు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జోన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గత ఏడాది దేశంలోనే అత్యధికంగా చార్జిషీట్లు దాఖలు చేశారు. గత ఏడాది 49 చార్జిషీట్లు దాఖలు చేయగా, 2023లో 40 చార్జిషీట్లు మాత్రమే దాఖలు చేశారు. అలాగే ఈడీ దర్యాప్తులో కీలకమైన ఆస్తులజప్తులోనూ హైదరాబాద్ జోన్ ముందుంది. 2023లో 19 కేసులకు సంబంధించి 750 కోట్ల ఆస్తులను జప్తు చేయగా, గత ఏడాది 43 కేసులకుగాను 916 కోట్ల ఆస్తులను జప్తు చేశారు. అయితే అరెస్టుల విషయంలో హైదరాబాద్ జోన్ ఈడీ అధికారులు వెనకపడ్డారు. 2023లో పది మందిని వివిధ కేసుల్లో ఈడీ అధికారులు అరెస్టు చేయగా, గత ఏడాది ఒక్కరిని మాత్రమే అరెస్టు చేశారు. అరెస్టుల కన్నా నేరాన్ని నిరూపించే సాక్ష్యాధారాలను సేకరించి పకడ్బందీగా చార్జిషీట్లను దాఖలు చేస్తున్నామని హైదరాబాద్ జోన్ ఈడీ అధికారులు తెలిపారు. 2023లో 59 కేసులను హైదరాబాద్ ఈడీ నమోదు చేయగా, గత ఏడాది 58 కేసులను మాత్రం నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌పై సీబీఐ కేసు

నెలకు 1.40లక్షలు ఇవ్వాలని కాంట్రాక్టర్‌కు బెదిరింపులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ కాంట్రాక్టర్‌ను బెదిరించి, మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ టీవీ చంద్రకాంత్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ కాంట్రాక్టు పొందిన ఎల్లస్వామి వద్ద మేనేజర్‌గా పని చేస్తున్న కె.అశోక్ కుమార్‌ను చంద్రకాంత్ మామూళ్ల కోసం పలుమార్లు బెదిరించిన ఆడియో సంభాషణలు, గూగుల్ పే ద్వారా జరిగిన చెల్లింపుల ఆధారాలు సేకరించామని సీబీఐ అధికారులు తెలిపారు. తనకు వారానికి రూ.10వేలు, ఉన్నతాధికారులకు నెలకు రూ.లక్ష చొప్పున లంచం ఇవ్వాల్సిందేనని చంద్రకాంత్ డిమాండ్ చేసినట్లు తమ విచారణలో తేలిందని పేర్కొన్నారు.

రూ. 79లక్షల నిధుల దుర్వినియోగం... బీహెచ్‌ఈఎల్ సబ్ పోస్ట్‌మాస్టర్‌కు రెండేళ్ల జైలు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ సేవింగ్స్ ఖాతాదారులకు చెందిన రూ.79లక్షల నిధులను దుర్వినియోగం చేసిన బీహెచ్‌ఈఎల్ సబ్ పోస్ట్‌మాస్టర్‌కు కోర్టు రెండేళ్ల జైలు శిక్షను విధించింది. రామచంద్రాపురంలోని బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో ఉన్న పోస్టాఫీసులో పనిచేసిన కోళ్ల రామకోటయ్య ఖాతాదారుల డబ్బుకు ఎంట్రీ చేస్తూ, పోస్టల్ రికార్డుల్లో ఆ మొత్తాన్ని నమోదు చేసేవాడు కాదు. ఖాతాదారులు తమ సొమ్మును అడిగినపుడు పాస్‌బుక్ ఆధారంగా ఇచ్చేవాడు. పొదుపు చేసుకునే వారు ఎక్కువ, డబ్బు వెనక్కి తీసుకునే వారు తక్కువ కావడంతో అతని మోసం బయటపడలేదు. ఐదేళ్ల తర్వాత 2008లో పోస్టల్ ఆడిట్‌లో విషయం బయపడింది. పోస్టల్ ఉన్నతాధికారులు సీబీఐకి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీబీఐ వేలాది పాస్‌పుస్తకాలను జల్లెడ పట్టి రూ. 79.79లక్షలను రామకోటయ్య తన సొంతానికి వాడుకున్నట్లు గుర్తించి అరెస్టు చేసింది. ఈ కేసుకు సంబంధించిన విచారణ ఇటీవల పూర్తికావడంతో సీబీఐ కేసుల ప్రత్యేక న్యాయస్థానం రామకోటయ్యకు రెండేళ్ల జైలుశిక్ష, రూ. 80వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.

కేంద్ర పథకాలను ఇక్కడా అమలు చేయాలి

- మాజీ ఎంపీ నర్సయ్య గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్, విశ్వకర్మ యోజన పథకాలను తెలంగాణలోనూ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం 52 కోట్ల మంది చిరు వ్యాపారులకు రూ.32 లక్షల కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. ముద్రా లోన్ల ద్వారా 22-31 శాతం మైనార్టీ వర్గాలు లబ్ధిపొందాయని అన్నారు. విశ్వకర్మ యోజనతో దేశవ్యాప్తంగా 18 సంప్రదాయ వృత్తుల వారిని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం కింద ఎంపికైన వారికి 15 రోజుల పాటు శిక్షణ, రూ.15 వేల విలువైన టూల్ కిట్, రూ.లక్ష వరకు రుణ రాయితీని అందిస్తున్నట్లు తెలిపారు. సుమారు రెండున్నర లక్షల దరఖాస్తులను పరిశీలన చేయకుండా తెలంగాణలో విశ్వకర్మ పథకం అమలును రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని నర్సయ్య గౌడ్ ఆరోపించారు. తెలంగాణలో జరిగిన భూ కుంభకోణాల వెనుక బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే ఉన్నాయని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నేతలు లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను తమ పేర్ల మీద మార్చుకున్నారని గతంలో రేవంత్ రెడ్డి అన్నారన్నారు. అధికారంలోకి వచ్చాక మాత్రం ఒక్క ఎకరం కూడా స్వాధీనం చేసుకోలేదని విమర్శించారు.

హెచ్‌సీయూకే అత్యధిక భూములు

(మొదటిపేజీ తరువాయి)



హెచ్‌సీయూకి తొలుత 2324 ఎకరాలు కేటాయించారు. అందులో పలు సంస్థలకు భూములు ఇచ్చారు. ప్రస్తుతం వర్సిటీ 1630 ఎకరాల్లో ఉంది. ఇంత భూమి ఉన్న సెంట్రల్ వర్సిటీ దేశంలో మరొకటి లేదు. అయితే ఆ తర్వాత కాలంలో ఏర్పాటు చేసిన వర్సిటీలకు క్రమంగా భూ కేటాయింపులు తగ్గిపోయాయి. 2009లో కేంద్రీయ విశ్వవిద్యాలయాల చట్టం ప్రకారం ఏర్పాటు చేసిన వాటికి తక్కువ విస్తీర్ణమే ఉంది. ఈ చట్టం ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 19 వర్సిటీలను ఏర్పాటు చేశారు. అప్పటికే కళాశాలలుగా ఉన్న కొన్నింటిని కేంద్రీయ వర్సిటీలుగా మార్చారు. దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం 151 ఎకరాల్లో ఉండగా, జామియా మిల్లియా ఇస్లామియా వర్సిటీ 254 ఎకరాల్లో ఉంది. అసలు సెంట్రల్ వర్సిటీల ఏర్పాటుకు ఎంత భూమి ఉండాలి? అన్నదానిపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఒక కమిటీని నియమించగా.. కొన్ని సిఫారసులతో నివేదిక ఇచ్చింది. దాని ప్రకారం సెంట్రల్ వర్సిటీకి 500 ఎకరాలుంటే సరిపోతుంది. రాష్ట్ర వర్సిటీలకు ఆయా రాష్ట్రాల చట్టాలను బట్టి భూ కేటాయింపు ఉంటుందని తెలిపింది.

వినియోగిస్తున్న భూమి ఎంత?

విశ్వవిద్యాలయాలకు ఉన్న భూమిలో ఎంత మేరకు వినియోగించుకుంటున్నాయన్నది చర్చనీయాంశంగా మారింది. చాలా సెంట్రల్ వర్సిటీలు తమకున్న భూమిలో 25-30 శాతానికి మించి ఉపయోగించుకోవడం లేదు. ఫలితంగా ఆ భూముల్లో అడవిలాంటి వాతావరణం ఏర్పడి, జంతుజాలాలకు ఆవాసంగా మారుతున్నాయి. బనారస్ హిందూ వర్సిటీకి 1300 ఎకరాలుండగా.. అందులో వినియోగంలో ఉన్నది 25 శాతం లోపే! హెచ్‌సీయూకు ఉన్న 1630 ఎకరాల్లో భవనాలు, తరగతి గదులు, హాస్టళ్లు, ల్యాబ్‌లు ఇలాంటి వాటన్నింటికీ కలిపి ఉపయోగిస్తున్నది 25 శాతం లోపేనని అంచనా. జేఎన్‌యూ, అలీగఢ్ ముస్లిం వర్సిటీలదీ దాదాపు ఇదే పరిస్థితి. ఆయా వర్సిటీలను స్థాపించి దశాబ్దాలు గడుస్తున్నా.. అందుబాటులో ఉన్న భూమి వినియోగం భారీగా పెరిగిన దాఖలాల్లేవు. విశ్వవిద్యాలయాలకు కేటాయించిన భూమిలో వినియోగం చాలా తక్కువగా ఉందని యూజీసీ నిపుణుల కమిటీ కూడా పేర్కొంది.

విద్యార్థుల సంఖ్యకు, విస్తీర్ణానికి పొంతన లేదు..

కేంద్రీయ విశ్వవిద్యాలయాల విస్తీర్ణం విద్యార్థుల సంఖ్యను బట్టి ఉండాలన్న ప్రమాణాలు కూడా ఏమీ లేవు. ఉదాహరణకు 1000 ఎకరాల్లో ఉన్న జేఎన్‌యూలో 8800 మంది విద్యార్థులుంటే.. 600 ఎకరాలున్న అసోం సెంట్రల్ వర్సిటీలో 10 వేల మంది ఉన్నారు. 300 ఎకరాల్లో ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ సౌత్ బిహార్‌లో 4000 మంది విద్యార్థులుంటే.. అంతకు ఐదున్నర రెట్ల విస్తీర్ణంలో ఉన్న హెచ్‌సీయూలో ఉన్నది 5000 మందే. 655 ఎకరాల్లో ఉన్న గురు ఘాసీదాస్ విశ్వవిద్యాలయంలో 8256 మంది ఉన్నారు. ఇక్కడ కూడా హెచ్‌సీయూ కంటే ఎక్కువ మందే ఉండడం గమనార్హం. అంటే విద్యార్థుల సంఖ్యకు, భూమికి పొంతనే లేదన్నమాట!

యూజీసీ నివేదిక ఏం చెప్పింది?

ఉన్నత విద్యా సంస్థలకు భూ కేటాయింపులపై యూజీసీ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ 2024లో నివేదిక ఇచ్చింది. అందులో ఏ తరహా వర్సిటీలకు ఎంత భూమి ఉండాలో సిఫారసు చేసింది. సెంట్రల్ వర్సిటీలకు 500 ఎకరాలు అవసరమని చెప్పింది. రాష్ట్రాల పరిధిలో ఏర్పాటు చేసే వర్సిటీలకు భూ కేటాయింపు స్థానిక చట్టాలను బట్టి ఉంటుందని, ప్రైవేటు వర్సిటీల విషయంలోనూ రాష్ట్ర చట్టాల నిబంధనలే వర్తిస్తాయని పేర్కొంది. డీమ్డ్ వర్సిటీల విషయంలోనూ పలు సూచనలు చేసింది. జాతీయ విద్యా విధానం-2020 మేరకు రాష్ట్ర స్థాయి వర్సిటీలకు కనీసం 20 ఎకరాలు ఉండాలంది. ఆయా వర్సిటీల్లో కనీసం 3000 మంది విద్యార్థులు ఉండాలని తెలిపింది. అదే సమయంలో మెట్రోపాలిటన్ నగరాలు, కొండ ప్రాంతాల్లో వర్సిటీల ఏర్పాటుకు 10 ఎకరాలు ఉండాలని, మరో 3 ఎకరాలు ఖాళీ స్థలం ఉండాలని సూచించింది. పచ్చదనం కోసం కూడా కొంత భూమి ఉండాలని, అది కూడా 3 ఎకరాల వరకు ఉండొచ్చని తెలిపింది. ఓపెన్ యూనివర్సిటీలకు 5 ఎకరాలు ఉండాలని సూచించింది.

2014 నాటి కేంద్ర ఉత్తర్వుల ప్రకారం..

ఐఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీల ఏర్పాటుకు ఎంత భూమి అవసరం? ప్రస్తుతం ఎంత కేటాయించాల్సి వస్తోంది? అనే అంశాలపై 2014 అక్టోబరులో కేంద్ర ఉన్నత విద్యా సంస్థలకు భూ కేటాయింపులను నిర్ణయించే కమిటీకి కేంద్ర ప్రభుత్వం పలు సూచనలు చేసింది. దాని ప్రకారం ప్రస్తుతం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)కి 100 ఎకరాలు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)లకు 200 ఎకరాలు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లకు 300 ఎకరాలు అవసరమవుతున్నట్లు తెలిపింది. అలాగే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), సెంట్రల్ వర్సిటీల ఏర్పాటుకు 500 ఎకరాలు అవసరం ఉండగా.. ఆ స్థాయిలో భూములు లభించడం లేదని పేర్కొంది. పెద్దఎత్తున భూములు సేకరించడం రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా కష్టతరంగా మారిందనే విషయాన్ని ప్రస్తావించింది. ఫలితంగా అనేక కేంద్ర ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపింది. కాగా, కేంద్రీయ విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేయాలంటే దాదాపు 500 ఎకరాలు అవసరమవుతుందని గతంలో రాజ్యసభలో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు నాటి కేంద్ర మంత్రి రమేశ్ పోఖ్రియాల్ సమాధానం ఇచ్చారు. అయితే స్థానిక పరిస్థితులను బట్టి కొన్ని సందర్భాల్లో భూ పరిమాణంలో మార్పులుంటాయని కూడా చెప్పారు.

దేశంలోని కొన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, వాటి విస్తీర్ణం, విద్యార్థుల సంఖ్య

వర్సిటీ	విస్తీర్ణం (ఎకరాల్లో)	విద్యార్థులు
జేఎన్‌యూ	1019	10000
హెచ్‌సీయూ	1630	5500
రాజీవ్ గాంధీ యూనివర్సిటీ	302	1408
అస్సాం యూనివర్సిటీ	600	10,000
సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ సౌత్ బిహార్	300	4000
నలంద	455	1038
మహాత్మాగాంధీ సెంట్రల్ వర్సిటీ	310	1000
గురు ఘాసిదాస్	655	8256
జామియా మిల్లియా	254	24183
సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ గుజరాత్	100	1343
సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హిమాచల్‌ప్రదేశ్	150	4238
సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కశ్మీర్	500	1139
సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఝార్ఖండ్	510	1000
సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ	310	2500
బనారస్ హిందూ యూనివర్సిటీ	1300	18000
సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ(అనంతపురం)	491	1500

కొన్ని వర్సిటీలకు ప్రత్యేకంగా భూముల్లేవ్..

దేశంలో మొత్తం 57 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఉండగా వాటిలో కొన్నింటికి ప్రత్యేకంగా భూముల్లేవు. ఉదాహరణకు ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ కూడా సెంట్రల్ వర్సిటీయే. కానీ, దీనికి ప్రత్యేకంగా భూమి లేదు. ఓయూ ప్రాంగణంలోనే ఇది కూడా ఉంది. అన్ని కోర్సులు, విభాగాలు లేకపోవడం.. కేవలం భాషలు నేర్చుకునేందుకే దీన్ని ఏర్పాటు చేయడంతో ప్రత్యేకంగా భూమిని కేటాయించలేదు. ఇలాంటివి కాకుండా అన్ని విభాగాలు, కోర్సులు ఉన్న సెంట్రల్ వర్సిటీల్లోనూ 23 వర్సిటీలు 500 ఎకరాలు, అంతకంటే తక్కువ విస్తీర్ణంలోనే ఉన్నాయి.

ఆ 2 వర్సిటీలకు సొంత స్థలం లేదు!

రాష్ట్రంలోని కొన్ని ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలు లీజు భూముల్లోనే నడుస్తున్నాయి. కొన్నింటికి భారీగా భూములుండగా.. మరికొన్ని లీజు స్థలాల్లోనే కొనసాగుతున్నాయి. జేఎన్‌టీయూహెచ్‌ను కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో 88 ఎకరాల బోర్డు స్థలాన్ని లీజుకు తీసుకొని ప్రారంభించారు. వర్సిటీ ఏర్పడి 50 ఏళ్లయినా సొంత భూమి సమకూరలేదు. అదేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి చదువుకున్న జేఎన్ఏఎఫ్ఏయూ (జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ)కి కూడా సొంత భూమి లేదు. మాసబ్ ట్యాంక్‌లోని ఈ యూనివర్సిటీ పర్యాటక శాఖకు చెందిన ఐదెకరాల్లో లీజు పద్ధతిలో కొనసాగుతోంది. కేవలం ఐదెకరాలే ఉండడంతో విద్యార్థుల హాస్టళ్లకు స్థలం లేకుండా పోయింది. ఈ యూనివర్సిటీకి అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 10 ఎకరాలు కేటాయిస్తూ గత సెప్టెంబరులో ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీనిపై అంబేడ్కర్ వర్సిటీ సిబ్బంది నిరసనలు తెలపడంతో ఆ ప్రక్రియ ముందుకెళ్లలేదు.

‘కాళేశ్వరం’ నివేదికకు విజిలెన్స్ కమిషన్ ఆమోదం

- బ్యారేజీల వైఫల్యానికి 40 మంది కారకులు!
- బాధ్యులైన అధికారులపై చర్యలకు లైన్ క్లియర్
- నివేదికను తొక్కిపెట్టేందుకు కొందరి ప్రయత్నాలు?



హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (వీఅండ్ఈ) సమర్పించిన నివేదికకు విజిలెన్స్ కమిషన్ ఆమోదం తెలిపింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోగా, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో భారీగా సీపేజీలు బయటపడ్డాయి. వీటి వైఫల్యానికి కారకులుగా 40 మందికి పైగా అధికారులను విజిలెన్స్ గుర్తించింది. దాంతో ఆ నివేదికలోని అధికారులపై చర్యలకు కమిషన్ ఆమోదం తెలిపినట్లయింది. మరోవైపు నివేదికను తొక్కిపెట్టడానికి కీలక నేతలు కొందరు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ పనులు నిర్దేశిత క్రమపద్ధతిలో జరగలేదని, కుంగిన బ్లాక్-7 పియర్ల కింద ఉన్న పునాది (ర్యాఫ్ట్), దాని దిగువన భూగర్భంలో ఉండే సీకెంట్ పైల్స్‌ను కూడా క్రమపద్ధతిలో నిర్మించలేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇప్పటికే తేల్చింది. పనులు పూర్తికాకపోయినా పూర్తయినట్లు సర్టిఫికెట్లు జారీ చేయడం కూడా నేరపూరిత తప్పిదంగా గుర్తించింది. బ్యాంకు గ్యారంటీల విడుదలలోనూ నిబంధనలు పాటించలేదని నివేదికలో పేర్కొంది. వరదల తరువాత మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్నదని, బ్యారేజీ గేట్లు మూసివేసిన తర్వాత దిగువ భాగంలో కాంక్రీట్ బ్లాకులు, అప్రాన్లు దెబ్బతిన్నాయని తెలిపింది. అయినప్పటికీ మూడేళ్లపాటు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ చేపట్టకపోవడంతో 2023 అక్టోబరులో బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగిందని గుర్తు చేసింది. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు ఏర్పాటు చేసిన విభాగం తన బాధ్యతలు నిర్వర్తించలేదని తేల్చింది.

ప్రభుత్వం నుంచి నిధులు పొంది కూడా..

ఇండియన్ స్టాండర్డ్ కోడ్ ప్రకారం.. ప్రతి ఏటా వర్షాకాలం ముగిసిన తర్వాత డ్యామ్ అప్రాన్ ఏరియాలో సౌండింగ్ అండ్ ప్రోబింగ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా, డ్యామ్ యజమాని (ఈఎన్‌సీ రామగుండం) దీనిని చేపట్టలేదని విజిలెన్స్ నివేదికలో పేర్కొంది. బ్యారేజీ నిర్మాణ సమయంలో షీట్ పైల్స్‌తో ఏర్పాటు చేసిన కాఫర్ డ్యామ్‌ను నిర్మాణం పూర్తయిన తర్వాత కూడా తొలగించలేదని తెలిపింది. కాఫర్ డ్యామ్ తొలగింపునకు ప్రభుత్వం నుంచి నిధులు పొంది కూడా ఆ పని చేయలేదని, ఆ అవశేషాల వల్ల వరద ప్రవాహం సజావుగా జరగలేదని వివరించింది. ఇందుకు ప్రధాన కారణం నిర్మాణ సంస్థతోపాటు రామగుండం మాజీ ఈఎన్‌సీ, సంబంధిత ఎస్ఈ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లేనని పేర్కొంది. ఈ మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తన నివేదికను కాళేశ్వరం విచారణ కమిషన్‌కు కూడా అందించింది. మరోవైపు కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ ఈ నెల 20 తర్వాత తుది దశ విచారణ ప్రారంభించనున్నారు. మే రెండో వారంలో నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్లు ఇప్పటికే కమిషన్ సమాచారం ఇచ్చింది. దాంతో ఈ నెలాఖరుతో పూర్తి కానున్న కమిషన్ గడువును రాష్ట్రప్రభుత్వం మే నెలాఖరు దాకా పొడిగించనున్నది.

ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు రద్దు!

- అమెరికా నుంచి రప్పించేందుకు మార్గం సుగమం.. రెడ్ కార్నర్ నోటీసు ఫలితం
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం





హైదరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడైన ప్రత్యేక నిఘా విభాగం (ఎస్ఐబీ) మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు పాస్‌పోర్టును రద్దు చేసినట్లు విదేశాంగ శాఖ నుంచి హైదరాబాద్ పోలీసులకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. విదేశాల్లో తలదాచుకున్న ప్రభాకర్‌ను రప్పించడం కోసం సిట్ అధికారులు సీబీఐ ద్వారా ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించారు. ఈ నోటీసు జారీ అయిన వ్యక్తుల పాస్‌పోర్టులను విదేశాంగ శాఖ రద్దు చేస్తోంది. వాస్తవానికి అమెరికాలో తలదాచుకున్న ప్రభాకర్‌రావు గ్రీన్‌కార్డు కోసం ప్రయత్నం చేసినపుడు ఆయన పాస్‌పోర్టును రద్దు చేస్తున్నామని భారత విదేశాంగ శాఖ అధికారులు ఆ దేశానికి సమాచారం అందించారు. రెడ్ కార్నర్ నోటీసు జారీ కావడం, పాస్‌పోర్టు రద్దు కావడంతో ప్రభాకర్‌రావు ప్రస్తుతం అమెరికాలో అక్రమ వలసదారుడుగా మిగిలారు. ఈ క్రమంలో ఆయన ఎక్కడున్నారనే సమాచారాన్ని అందజేసి, వెనక్కి పంపించాలని (డిపోర్టేషన్) భారత్ అధికారుల నుంచి అమెరికాకు విజ్ఞాపన వెళ్లినట్లు తెలుస్తోంది. ప్రభాకర్‌రావు బెయిల్ కోసం హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగియగా.. తీర్పు పెండింగ్‌లో ఉంది. ఇదిలా ఉండగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరో నిందితుడైన మీడియా ఛానల్ అధినేత శ్రవణ్‌రావు మూడుసార్లు జరిగిన విచారణలోనూ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారుల ప్రశ్నలకు సరైన జవాబులు ఇవ్వలేదని సమాచారం. ఆయనను మూడు దఫాల్లో 19 గంటలు పైగా సిట్ అధికారులు ప్రశ్నించారు. శ్రవణ్‌రావు గతంలో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. ‘విచారణకు సహకరించండి అప్పటి వరకు కఠిన చర్యలు వద్ద’ని సుప్రీం కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పరారీలో ఉండి విదేశాల్లో తలదాచుకున్న ఆయన వచ్చి సిట్ విచారణకు హాజరయ్యారు. ఫోన్ ట్యాపింగ్ సమయంలో వాడిన ఫోన్లను అప్పగించే విషయంలోనూ ఆయన హస్తలాఘవం ప్రదర్శించడానికి ప్రయత్నించారని దర్యాప్తు అధికారులు అంటున్నారు. రెండోసారి విచారణకు వచ్చినపుడు ట్యాపింగ్ సమయంలో వాడింది ఇదేనంటూ ఒక పాత సెల్‌ఫోన్‌ను ఇవ్వడానికి శ్రవణ్‌రావు ప్రయత్నించారు. అయితే సిట్ అధికారులు అప్పటికే తమ వద్ద ఉన్న ఐఎంఈఏ నెంబర్ల ఆధారంగా ఆ ఫోన్ కాదని తేల్చిచెప్పి, అసలు ఫోన్లను అప్పగించాలని హెచ్చరించారు. దీంతో ఆయన మూడోసారి విచారణకు వచ్చినపుడు రెండు సెల్ ఫోన్లను అప్పగించారు. ప్రైవేట్ వ్యక్తి అయిన శ్రవణ్‌రావు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలోకి ఎలా ప్రవేశించారు? ఎవరి ఆదేశాల మేరకు పనిచేశారు? పోలీసు అధికారులు ఆయనకు ఎందుకు సహకరించాల్సి వచ్చింది? ఎస్ఐబీ, టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారులకు ఏ విధమైన సమాచారం ఇచ్చారు? ఆయన కార్యాలయంలో, ఇంట్లో హ్యాకింగ్ పరికరాలు ఎందుకు పెట్టుకున్నారు? వార్ రూమ్స్ తరహాలో ప్రత్యేక వసతిని ఫోన్ ట్యాపింగ్ కోసం ఎందుకు వాడారు? అనే విషయాలపై ఇప్పటివరకు జరిగిన దర్యాప్తులో ముగ్గురు మాజీ మంత్రుల పేర్లు వచ్చినప్పటికీ, ఆ విషయాలు శ్రవణ్‌రావు వాంగ్మూలం ద్వారా బయటకు రాకపోవడంతో సిట్ అధికారులు తదుపరి చర్యలకు సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు జరిపిన విచారణను పూర్తిగా వీడియో రికార్డింగ్ చేసిన నేపథ్యంలో... విచారణలో శ్రవణ్‌రావు వ్యవహరించిన తీరును వివరిస్తూ ఆయన అరెస్టుకు అనుమతించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించడానికి సిట్ అధికారులు సన్నద్ధమైనట్లు తెలుస్తోంది.

తలుపు తట్టిన అదృష్టం!

‘ఆంధ్రజ్యోతి’ లక్కీడ్రాలో నెల్లూరు వాసికి మారుతి స్విఫ్ట్ కారు

గుణదల/నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ‘ఆంధ్రజ్యోతి’ కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో నెల్లూరు వాసి విజేతగా నిలిచి, స్విఫ్ట్ కారును సొంతం చేసుకున్నారు. ‘ఆంధ్రజ్యోతి’ 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో జరిగిన డ్రాలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన కూపన్ల నుంచి మంత్రి ఒకదాన్ని డ్రా తీశారు. ఇందులో నెల్లూరుకు చెందిన ‘ఆంధ్రజ్యోతి’ పాఠకుడు జొన్నాదుల కోటేశ్వరరావు కారును గెలుచుకున్నారు. మంత్రి ఆయనకు ఫోన్ చేసి అభినందనలు తెలిపి, కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం అనగాని మాట్లాడుతూ ‘అక్షరం మీ ఆయుధం’ నినాదంతో పాఠకులతో మమేకమవుతున్న ‘ఆంధ్రజ్యోతి’ యాజమాన్యం 22 సంవత్సరాల నుంచి కార్ అండ్ బైక్ రేస్ పేరుతో పాఠకులకు పురస్కారాలు అందజేస్తోందని కొనియాడారు. ఇంతవరకు ఏ పత్రిక కూడా రూ.కోటి విలువైన బహుమతులను పాఠకులకు అందించలేదని చెప్పారు. ఎండీ వేమూరి రాధాకృష్ణ మంచి మంచి కార్యక్రమాలు చేపడుతున్నారనడానికి ఇదో నిదర్శనమని పేర్కొన్నారు. ఇకపై తాను కూడా ‘ఆంధ్రజ్యోతి’లో వచ్చే కూపన్లు నింపి పంపుతానని, డ్రాలో బహుమతి వస్తే పేదలకు అందజేస్తానని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో ‘ఆంధ్రజ్యోతి’ సర్క్యులేషన్ డైరెక్టర్ రామకృష్ణారావు, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, ఏజీఎం పి.వాసు, అడ్వర్టైజ్‌మెంట్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలోని ఆంధ్రజ్యోతి కార్యాలయంలో లక్కీడ్రా తీస్తున్న ఏపీ మంత్రి అనగాని

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.